


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 252

SUNDAY Special | ఆదివారం | 26-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కాన్స్‌లో అనసూయకు ఉత్తమ నటి అవార్డు

భారతీయ నటి అనసూయ సేన్ గుప్తా.. 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'అన్‌సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'ది షేమ్‌లెస్' చిత్రంలోని నటనకు ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు.

- వివరాలు 12లో



రైజర్స్ X రైడర్స్

ఐపీఎల్–17 టోర్నీ విజేతను తేల్చే సమయం ఆసన్నమైంది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఆదివారం జరిగే ఫైనల్ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడనున్నాయి.

- వివరాలు 12లో



ముస్లింల ఓట్ల కోసం 'ముజ్రా'

ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి ముజ్రా(అతిథులను అలరించడానికి చేసే నృత్యం) చేస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు.

- వివరాలు 6లో



వాగులోకి నడిపించిన 'గూగుల్'

కేరళలో గూగుల్ మ్యాప్ సాయంతో వెళ్తున్న నలుగురు హైదరాబాదీలు ప్రయాణిస్తున్న కారు వాగులోకి దూసుకెళ్లింది.

- వివరాలు 6లో



రాజస్తాన్‌లో 50 డిగ్రీల ఉష్ణోగ్రత

రాజస్తాన్‌లోని ఫలోదీలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేశంలో ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారని వాతావరణ శాఖ తెలిపింది.

- వివరాలు 6లో



జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీలో ఏపీకి చెందిన జ్యోతి సురేఖ టీమ్ విభాగంలో స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం గెలుచుకుంది.

- వివరాలు 12లో



తాజాగా బయట పడిన వీడియో ఆధారంగా.. పోలింగ్ మరుసటి రోజు పల్నాడు జిల్లా కారంపూడి వీధుల్లో మారణాయుధాలతో దాడులు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న టీడీపీ గూండాలు



ఒక ఇంటిపై దాడి చేసి బైక్‌ను తగలబెడుతున్న టీడీపీ మూక

పదుల సంఖ్యలో వీడియో సాక్ష్యాలు..

అయినా 'పచ్చ'పాతమే!

పోలింగ్ రోజు, ఆ తర్వాత టీడీపీ గూండాల స్వైర విహారం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓట్లేయనీయకుండా దాడులు

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కారణంతో విధ్వంసాలు

పల్నాడులో పచ్చ మూకల దాడులపై వీడియోలు తీసిన ప్రజలు

- ఒక్కొక్కటిగా బయటపడుతున్న టీడీపీ హింసాత్మక చర్యలు
- దుకాణాలపై రాళ్లు, బైక్‌ల ధ్వంసాలు, దహనాలు, లూటీలు..
- పట్టపగలు విధ్వంసకాండను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్న జనం
- టీడీపీ దారుణాలు కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టించుకోని పోలీసులు
- హత్యాయత్నం, అట్రాసిటీ కేసులున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహారం
- చిన్న చిన్న సాకులతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై మాత్రం జులుం
- వెంటాడి కేసుల నమోదు.. భయభ్రాంతులకు గురిచేస్తూ దండనలు
- ఇంకోవైపు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ఈసీ
- బడుగు, బలహీన వర్గాల బాధితుల వేదన అరణ్య రోదనగా మారిన వైనం

2లో

రాష్ట్రంలో టీడీపీ గూండాలు సాగిస్తున్న విధ్వంసకాండ గురించి పదుల సంఖ్యలో వెలుగు చూస్తున్న వీడియోలు ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మనం ఉంటున్నది ప్రజాస్వామ్య దేశంలోనేనా లేక ఆటవిక రాజ్యంలో ఉంటున్నామా.. అనే అనుమానం కలుగుతోంది. గుంపులు గుంపులుగా తోడేళ్ల మందలా వచ్చి దుకాణాలు, ఇళ్లపై పడుతున్నారు. కుర్చీలు, బల్లలు, మోటార్ సైకిళ్లను లాక్కొచ్చి రోడ్లపై పడేస్తున్నారు. లావుపాటి కర్రలు, ఇనుప రాడ్లతో వాటిని ధ్వంసం చేస్తున్నారు. ఆయిల్ ట్యాంక్ పగులగొట్టి నిప్పంటిస్తున్నారు. నిర్భయంగా, నిబ్బరంగా వచ్చిన దారిన కేకలు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు.

ఆ దృశ్యాలు చూస్తుంటే సినిమాల్లో సీన్లు కళ్ల ముందు మెదులుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు స్పందించక పోవడం విస్తుగొలుపుతోంది. పైగా ఎక్కడ, ఏ చిన్న గొడవ జరిగినా.. దాన్ని వైఎస్సార్‌సీపీకి అంటగడుతూ ఎల్లో మీడియా, ఎల్లో బ్యాచ్ దుష్ప్రచారం సాగిస్తోంది. బాధితుల నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చినా, అటు ఈసీ, ఇటు పోలీసులు.. టీడీపీ అనుబంధ సంఘాలన్నట్లు వ్యవహరిస్తుండటం దారుణం.



ఢిల్లీలో ఓటు వేసిన తర్వాత సిరా గుర్తును చూపిస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఆరో విడతలో 61.11%

- ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాల్లో ముగిసిన పోలింగ్
- జూన్ 1న తుది విడతలో 57 స్థానాలకు పోలింగ్..
- 4న ఫలితాల వెల్లడి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం ఆరో విడతలో 58 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడపటి సమాచారం అందేసరికి 61.11 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్లో అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ సజావుగా సాగింది. ఢిల్లీలో ఏడు లోక్‌సభ స్థానాలకూ ఈ విడతలోనే పోలింగ్ జరగ్గా.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తదితరులు ఓటు వేశారు.

- వివరాలు 6లో

రేవ్ పార్టీ కేసులో పలువురికి నోటీసులు



బెంగళూరు శివార్లలో ఈ నెల 18న జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్న వారిని సోమవారం విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు తెలుగు సినీ నటి హేమ సహా పలువురికి నోటీసులిచ్చారు.

- వివరాలు 2లో

అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ డంప్ స్వాధీనం



కూంబింగ్‌కు వచ్చిన వారిని హతమార్చాలనే లక్ష్యంతో మావోయిస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లా పనసలబంద పరిసర అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ డంప్‌ను పోలీసులు చాకచక్యంగా వెలికితీసి నిర్వీర్యం చేశారు.

- వివరాలు 2లో

శ్రీవారి దర్శనానికి 20 గంటలు




తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,668 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది.

తుపానుగా మారిన వాయుగుండం

- నేడు బంగ్లాదేశ్ సమీపంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం
- ఆదివారం అర్ధరాత్రి ఖేపుపుర వద్ద తీరం దాటనున్న తుపాను
- తీరం దాటే సమయంలో బలమైన గాలులు
- రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

3లో



గుజరాత్‌లో పెను విషాదం



ఘటనా స్థలిలో ఎగిసి పడుతున్న మంటలు

- రాజ్‌కోట్‌లోని టీఆర్‌పీ గేమ్ జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం
- నలుగురు చిన్నారులు సహా 27 మంది మృతి
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

- వివరాలు 6లో

జాతీయ స్థాయి మార్కెట్‌లోకి మన వంగడాలు

- వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలు
- గెజిట్‌లో నోటిఫై చేసిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ
- ద్వివర్ణ తోటకూర, వంగపండు వర్ణంలో చిక్కుడు, ఎర్రటి చింత, జెమినీ వైరస్‌ను తట్టుకునే క్రాంతి, చైత్ర, తన్వీ, సిరి వంటి మిరప రకాలు
- వాము, వస, పసుపులో కొత్త రకాలు.. తక్కువ కాలపరిమితిలో సాగు
- తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడులు

- వివరాలు 10లో

జల విద్యుత్ కేంద్రాలకు టార్గెట్

2024–25లో 2,286.14 మిలియన్ యూనిట్లు టార్గెట్ విధించిన సెంట్రల్ విద్యుత్ అథారిటీ



సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏపీ జెన్‌కో సీలేరు జల విద్యుత్ కేంద్రాలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి సెంట్రల్ విద్యుత్ అథారిటీ టార్గెట్ విధించింది. దీనికి సంబంధించి జెన్‌కో మోతుగూడెం అథారిటీ నుంచి లేఖ అందింది. సీలేరు కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు జల విద్యుత్ కేంద్రాలకు కలిపి ఏడాదికి 2,286.14 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని ఆదేశించింది. ఈ ప్రకారం మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం 630, సీలేరు జల విద్యుత్‌కేంద్రం 477, డొంకరాయి జల విద్యుత్ కేంద్రం 95.14, మోతుగూడెం జల విద్యుత్ కేంద్రం 1084 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి చేయాలని, ఈ మేరకు సెంట్రల్ అథారిటీ నిర్దేశించిందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

రేవ్ పార్టీ వ్యవహారంలో పలువురికి నోటీసులు

మొత్తం 86 మందికి నోటీసులు

యశవంతపుర: బెంగళూరు శివార్లలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో ఈ నెల 19న జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్నవారిని సోమవారం విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ప్రముఖ తెలుగు సినీ నటి హేమ సహా పలువురికి నోటీసులు ఇచ్చారు. రేవ్ పార్టీలో పాల్గొన్నవారి రక్త నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించగా 86 మంది డ్రగ్స్ సేవించినట్లు తేలింది. వీరిలో పలువురు తెలుగు, కన్నడ సినీ నటీనటులు, ఇంజనీర్లు, తదితరులు ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు నటి హేమతో పాటు 86 మందికీ బెంగళూరు సీసీబీ పోలీసులు నోటీసులు జారీ చేసి మే 27న విచారణకు హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 19న వాసు అనే వ్యక్తి పుట్టిన రోజు పేరుతో 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరుతో రేవ్ పార్టీని నిర్వహించాడు. ఇందులో 100 మందికి పైగా పాల్గొన్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దాడి చేయగా ఎండీఎంఎం మాత్రలు, కొకైన్, హైడ్రో గంజాయి లభించాయి.

ఐదుగురి బ్యాంకు ఖాతాలు సీజ్

రేవ్ పార్టీని ఏర్పాటు చేసిన వాసు, అరుణ్‌కుమార్, నాగబాబు, రణధీర్‌బాబు, మహ్మద్ అబూబక్కర్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాను హైదరాబాద్‌లో ఉన్నానని, పార్టీలో లేనని హేమ పలు వీడియోల ద్వారా బుకాయించినా పోలీసులు అన్ని ఆధారాలు చూపించి విచారణకు రావాలని ఆదేశించారు. పోలీసులు అరెస్ట్ చేసిన ఐదుగురి బ్యాంకు ఖాతాల్లో రూ.లక్షల రూపాయల నగదు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ ఖాతాలను సీజ్ చేయాలని నిర్ణయించారు.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	42.4	30.8
జంగారెడ్డిగూడెం	37.0	28.0
నూజివీడు	37.0	28.0
తాడేపల్లిగూడెం	37.0	28.0
రాజమహేంద్రవరం	37.0	26.0
భీమవరం	36.0	29.0
ఏలూరు	36.0	28.0
నరసాపురం	35.0	30.0
గుంటూరు	34.0	28.0
విజయవాడ	32.0	29.0




ఆ మూడు రోజుల్లో మా పేరంటే మా పేరు చెప్పండని కూటమి పార్టీల నుండి ఒకటే ఫోన్లు సార్!

పదుల సంఖ్యలో వీడియో సాక్ష్యాలు

అయినా 'పచ్చ'పాతమే!

- పోలింగ్ రోజు, ఆ తర్వాత టీడీపీ గూండాల స్వైర విహారం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓట్లేయనీయకుండా దాడులు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న టీడీపీ హింసాత్మక చర్యలు





తాజాగా బయటపడిన వీడియోల ఆధారంగా: పల్నాడులో నడిరోడ్డు మీదే కుర్చీలను, స్కూటర్‌ను ధ్వంసం చేస్తున్న టీడీపీ అల్లరి మూక

సాక్షి, నరసరావుపేట: రాష్ట్రంలో పోలింగ్ సందర్భంగా టీడీపీ గూండాలు, రౌడీలు పేట్రేగిపోయారు. యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తూ అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులను దారుణంగా చితకబాదారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి ఓటేయనీయకుండా వారిపై అత్యంత పాశవికంగా దాడులకు తెగబడ్డారు. కొన్నిచోట్ల ఈ వర్గాలు తమకు ఓట్లేయలేదని వారి ఇళ్లను ధ్వంసం చేశారు. దుకాణాలను లూటీ చేశారు. ఇదేంటని అడ్డుకోవడానికి ప్రయత్నించినవారిని చావ బాదారు. స్వగ్రామాలను వదిలేసి బిక్కుబిక్కుమంటూ వేరే ఊళ్లలో తల దాచుకునేలా టీడీపీ మూకలు స్వైర విహారం సాగించాయి. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు టీడీపీ గూండాలకే కొమ్ముకాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమను కాపాడండి అంటూ ఆర్తనాదాలు చేసినా ఏ ఒక్క పోలీసూ పట్టించుకోలేదు. రాష్ట్రంలో పల్నాడు జిల్లా మాచర్ల, నరసరావుపేట, అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా చంద్రగిరి, తదితర ప్రాంతాల్లో టీడీపీ గూండాల దాడిని పోలీసులు చేష్టలుడిగి వేడుకలా చూశారు. మే 13న పోలింగ్ ముగిసిన నాటి నుంచి వెలుగు చూస్తున్న వీడియోలు టీడీపీ మూకలు అరాచకాలు, విధ్వంస కాండను కళ్లకు కట్టినట్టు చూపుతున్నా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటే ఒట్టు. మాచర్ల ప్రాంతంలో పచ్చ మూక విధ్వంసం గురించి పదుల సంఖ్యలో వీడియోలు వైరల్ అవుతున్నా, వాటి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అటు ఈసీ, ఇటు పోలీసులు టీడీపీ అనుబంధ సంఘాలన్నట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. అదే మాచర్లలో ఒక్క వీడియోను సాకుగా చూపిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను మాత్రం వెంటాడి వేధిస్తున్నారు. హత్యాయత్నం కేసులు, అట్రాసిటీ కేసులు నమోదు చేస్తూ 'పచ్చ'పాతం చూపుతున్నారు.

పోలీసుల మద్దతుతోనే టీడీపీ మూక దాడులు

ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అక్కసుతో టీడీపీ మూక పల్నాడు జిల్లాలో చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పౌర సమాజం భయభ్రాంతులకు గురయ్యేలా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై అత్యంత పాశవికంగా టీడీపీ గూండాలు జరిపిన దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా పోలీసుల తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతమని ముందే తెలిసినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టీడీపీ చేసిన దాడికి కొంత మంది పోలీసుల మద్దతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ మరుసటి రోజు మే 14న కారంపూడిలో బుడగ జంగాలు, దళితులు, ముస్లింలపై టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ఆ రోజు వందలాది మంది టీడీపీ రౌడీల దారుణ కాండను కొంత మంది ప్రజలు ఇళ్ల మీద నుంచి సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. అందులో బడుగు, బలహీనవర్గాలకు చెందిన దుకాణాలు, ఇళ్లు, వాహనాలను టీడీపీ మూక ధ్వంసం చేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వాటిలో వీడియో తీస్తున్న కుటుంబ సభ్యులు.. ఇంతవరకు ఇక్కడే ఉన్న పోలీసులు లేకుండా ఎటుపోయారని ఒకటికి రెండుసార్లు అనుకోవడం ఆ వీడియోలో రికార్డు అయ్యింది. ఆ సమయంలో టీడీపీ గూండాలు మారణాయుధాలతో చేస్తున్న స్వైరవిహారం చూసి భయపడిన కూతురు ఇంట్లోకి వెళ్లి తాళాలు వేసుకుందామని అనగా.. ఇంకో వీడియో తీస్తున్న వ్యక్తి.. 'దాడి చేస్తున్నవారు మన టీడీపీ వాళ్లు.. మనల్ని ఏం చేయరు' అని భరోసా నివ్వడం గమనార్హం. ఇప్పుడు ఈ వీడియోలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

టీడీపీ మూకలపై చర్యలేవి?

టీడీపీ రౌడీలు, గూండాలు మారణాయుధాలతో విధ్వంస కాండకు దిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము ఇంతగా వీడియోల ద్వారా ఆధారాలు అందిస్తున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టీడీపీ మూక దాడుల బాధితులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ విషయంపై మాట్లాడేందుకు, సమాచారం ఇచ్చేందుకు జిల్లా పోలీసులెవరూ ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వివరాలు వెల్లడించలేమంటున్నారు. కారంపూడి ఘటనలో వందలాది మంది టీడీపీ గూండాలు విధ్వంస కాండకు దిగారు. ఈ దాడులకు సంబంధించి ఇప్పటివరకు ఎంతమందిని గుర్తించారు, ఎందరిపై కేసు నమోదు చేశారనేది తెలియనీయడం లేదు. ఇటీవల పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఓ ఉన్నతాధికారి కేసుల నమోదు, ఇతరత్రా వివరాలేవీ తనకు తెలియకుండా బయటకు వెళ్లనివ్వొద్దని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఏ సమాచారం బయటకు రానివ్వడం లేదు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసుల నమోదుకు ఉత్సాహం..

వందలాది వీడియోల రూపంలో ఆధారాలు ఉన్నా టీడీపీ మూకలపై చర్యలు తీసుకోని పోలీసులు.. మరోవైపు మాచర్ల, నరసరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పిన్నెల్లి వెంకటరామిరెడ్డి లాంటి వారిపైన మాత్రం కేసుల నమోదుకు ఎక్కడలేని ఉత్సాహం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇల్లు, ఆస్పత్రిని విధ్వంసం చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలపై హత్యాయత్నం కేసుల్లో నిందితుడైన టీడీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు, ఆయన అనుచరులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిలువెత్తు నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పల్నాడులో 144 సెక్షన్ అమలవుతున్న నేపథ్యంలో శాంతియుతంగా ఉండాల్సిన చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లోనే నిరసన దీక్షలు పేరిట మీడియాకు వీడియోలు, ఫొటోలు పంపి రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు మర్రి రాజశేఖర్, రావెల కిషోర్ బాబు తదితరులు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి శనివారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గరపడుతున్నందున మళ్లీ టీడీపీ మూకలు హింసకు పాల్పడకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కూడా కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు 'పచ్చ' పాతాన్ని మానుకోవాలని విన్నవిస్తున్నారు.

సిగ్గు విడిచి.. చిలవలు పలవలు

- వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకు టీడీపీ దిగజారుడు రాజకీయం
- పాత కక్షలతోనే కారు దహనం చేశారని తేల్చిన పోలీసులు
- సింగరాయకొండ వివాదంపై ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం



మాట్లాడుతున్న ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, పక్కన ఒంగోలు డీఎస్పీ కిశోర్ కుమార్

సింగరాయకొండ/ఒంగోలు టౌన్: ఎక్కడ చిన్న గొడవ జరిగినా అది వైఎస్సార్‌సీపీకి అంటగట్టడం ఎల్లో బ్యాచ్‌కు అలవాటుగా మారింది. జరిగిన ఘటనపై టీడీపీ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తున్నారు. వెనువెంటనే వారి అనుకూల ఛానల్స్‌లో అసత్య కథనాలు మొదలైపోతాయి. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలో జరిగిన కారు దహనం ఘటన దానికి నిదర్శనంగా నిలిచింది. మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో టీడీపీ నేత చిగురుపాటి శేషగిరిరావు నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి అతని ఇంటి ఆవరణలోని కారుపై కొందరు పెట్రోలు పోసి తగలబెట్టారు. అయితే ఇది పాత కక్షల నేపథ్యంలో జరిగిందని, రాజకీయాలకు సంబంధంలేదని బాధితుడితోపాటు పోలీసులు చెబుతున్నా పచ్చ నేతలు దానికి రాజకీయ రంగు పులిమి శిలవలు పలవలు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఒంగోలులో ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు మీడియాకు వివరించారు. వ్యక్తిగత విద్వేషాలతోనే శేషగిరిరావును భయభ్రాంతులకు గురిచేసేందుకు కారు దహనానికి పాల్పడ్డారని, ఇందులో రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు.

అసలు జరిగింది ఇదీ..

సింగరాయకొండ లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న శేషగిరిరావుకు అదే గ్రామానికి చెందిన లాడ్జి యజమాని కనసాని ఈశ్వర్‌రెడ్డికి మధ్య భూ వివాదం ఉంది. ఈశ్వర్‌రెడ్డికి, అశోక్ అనే వ్యక్తికి మధ్య ఒక భూ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా వ్యవహరించిన శేషగిరిరావు అందుకు సంబంధించిన సెటిల్‌మెంట్ పత్రాలను తన వద్దనే ఉంచుకొన్నాడు. అయితే ఆ పత్రాలను తనకు ఇవ్వవలసిందిగా ఈశ్వర్‌రెడ్డి కొద్ది రోజులుగా అడుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అంతేకాకుండా ఈశ్వర్ రెడ్డి మీద శేషగిరిరావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న ఈశ్వర్ రెడ్డి తన వద్ద పనిచేసే పాలేటి అభిషేక్ అతడి మిత్రుడైన ఒక మైనర్ సహాయంతో శేషగిరిరావు ఇంటివద్ద ఉన్న కారుపై పెట్రోలు పోసి తగలబెట్టించాడు. శేషగిరిరావు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ స్పందించారు. ఈ కేసును ఛేదించేందుకు అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ఒంగోలు డీఎస్పీ కిశోర్ కుమార్‌ల ఆధ్వర్యంలో 6 టీంలను రంగంలోకి దించారు. అన్నీ కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు శనివారం మధ్యాహ్నం సింగరాయకొండ బైపాస్ వద్ద ఈశ్వర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.

వైఎస్సార్ సీపీపై నింద వేసేందుకు ఒత్తిడి

ఇందులో వ్యక్తిగత కక్షలు తప్ప రాజకీయ నేపథ్యం లేదు. అయితే ఈ ఘటనకు వైఎస్సార్‌సీపీయే కారణం అని ఫిర్యాదు చేయాలంటూ శేషగిరిరావుపై టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. వాస్తవానికి ఈశ్వరరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు కాదు. ఆయనకు టీడీపీ నాయకులతో సంబంధాలున్నాయి. వాస్తవాలను కప్పిపుచ్చుతూ టీడీపీ, వైఎస్సార్ సీపీల మధ్య వివాదంగా చిత్రీకరించాలని చూడడంపై స్థానికులు విస్మయం చెందారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో

భారీ డంప్ స్వాధీనం

- పోలీసులను హతమార్చాలన్నదే మావోల లక్ష్యం
- చాకచక్యంగా నిర్వీర్యం చేసిన పోలీసులు
- లోతుగా దర్యాప్తు చేస్తున్నాం
- ఎస్పీ తుహిన్ సిన్హా



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): కూంబింగ్‌కు వచ్చిన పోలీస్ పార్టీలను హతమార్చాలనే లక్ష్యంతో మావోయిస్టులు ఏర్పాటు చేసిన భారీ డంప్‌ను పోలీసులు చాకచక్యంగా వెలికితీసి నిర్వీర్యం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పనసలబంద పరిసర అటవీ ప్రాంతంలో ఈ నెల 24న పోలీస్ పార్టీలు కూంబింగ్‌కు వెళ్లాయి. వారిని హతమార్చాలనే లక్ష్యంతో మావోలు ఏర్పాటు చేసిన భారీ డంప్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ డంప్‌లో ఆరు స్టీల్ క్యారేజ్ మందు పాత్రలు, రెండు డైరెక్షనల్ మైన్స్, భెల్ కంపెనీకు చెందిన ఒక పేలుడు పదార్థం, 150 మీటర్ల ఎల్రక్టికల్ వైరు, ఐదు కిలోల మేకులు, ఇనుప నట్లు, విప్లవ సాహిత్యం ఉన్నాయని ఆయన వివరించారు. జిల్లాలో మావోయిస్టులు దాచిపెట్టిన డంప్‌లన్నింటినీ స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. మావోల కుట్రపూరిత ప్రణాళికలపై గిరిజనులంతా అప్రమత్తంగా ఉండాలని, వారి మాటలు నమ్మొద్దని సూచించారు. మావోలకు పేలుడు పదార్థాలు లభించడంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, పనసలబంద అటవీ ప్రాంతంలో ఆధారాల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. డంప్‌ను స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ, ఆర్ఎస్ఐ జాన్‌రోహిత్, జి.మాడుగుల ఎస్ఐ శ్రీనివాసరావులను ఎస్పీ అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నం

- పాత గొడవలతోనే దాడి చేసినట్లు బాధితుడి కుమారుడు ఫిర్యాదు
- తిరుపతిలో ఘటన..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటశివారెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుపతిలో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరు వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అలిపిరి సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఎన్జీవో కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటశివారెడ్డి ఇంటి ఎదురుగా గిరీష, శ్రీలక్ష్మి అనే వ్యక్తులు నివాసం ఉండేవారు. వీరు ప్రతి రోజు మద్యం, గంజాయి తాగి రచ్చరచ్చ చేస్తుండేవారు. వారి ప్రవర్తన వల్ల ఎదురు ఇంట్లో ఉంటున్న వెంటకశివారెడ్డి కుటుంబానికి నిద్ర ఉండేది కాదు. ఈ విషయంపై వెంకటశివారెడ్డి, గిరీషకు మధ్య తరచూ గొడవలు జరిగేవి. అదేవిధంగా గిరీష కొద్దికాలం కిందట హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి స్థలం ఇప్పిస్తానని రూ.20లక్షలు తీసుకుని మోసం చేశాడు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉన్న వెంకటశివారెడ్డిని ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. దీంతో గిరీష కుటుంబ సభ్యులను వెంకటశివారెడ్డి పిలిపించి వారి డబ్బులు ఇవ్వాలని సూచించారు. దీంతో వెంకటశివారెడ్డి, గిరీష మధ్య గొడవలు మరింత పెరిగాయి. ఆ గొడవలు జరిగిన అనంతరం గిరీష, శ్రీలక్ష్మి ఇల్లు వదిలి వెళ్లిపోయారు. వారు ఎన్నికలకు ముందు తిరిగి వచ్చారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ఇవ్వాల్సిన డబ్బులు గురించి ఎన్నికల తర్వాత మాట్లాడదామని గిరీష చెప్పాడు. ఈ నేపథ్యంలో వెంకటశివారెడ్డి శనివారం ఉదయం ఎన్జీవో కాలనీలోని తన నివాసం నుంచి వాకింగ్‌కు బయలుదేరి వెళ్లారు. మెయిన్ రోడ్డులో ఉన్న అరవింద స్కూల్ సమీపాన ఆటోస్టాండ్ వద్దకు వెళ్లగానే ఆయనపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. తీవ్ర గాయాలతో కుప్పకూలిన వెంకటశివారెడ్డిని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వెంకటశివారెడ్డిపై గిరీష కక్ష పెంచుకుని, ఆయన ఉదయం వాకింగ్‌కి వెళ్లే సమయంలో దాడి చేయాలని ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు సీసీ పుటేజీలో నమోదైంది. వెంకటశివారెడ్డి కుమారుడు బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రామారావు వెల్లడించారు.

నీటి నిల్వలో అగ్రగామి 'కృష్ణా'

సాక్షి, అమరావతి: భారీ జలాశయాలతో కూడిన కృష్ణా నది నీటి నిల్వ సామర్థ్యంలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. అతి పెద్ద నది అయిన గంగా, రెండో అతి పెద్ద నది గోదావరికన్నా నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాలలో కృష్ణా నదిదే అగ్రస్థానం. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతోపాటు అన్ని నదీ పరివాహక ప్రాంతాల (బేసిన్)లో నిర్మాణం పూర్తయిన జలాశయాల మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణాదే ప్రథమ స్థానం. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం 589.67 టీఎంసీలు. అన్ని బేసిన్‌లలోని రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యం 19.65 శాతం.

గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. ఈ రెండు నదుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంలో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

21 లోక్‌సభ స్థానాల్లో విజేతలను నిర్ణయించేది మహిళలే

ఆ స్థానాల్లో పురుషుల కన్నా ఎక్కువగా నమోదైన మహిళల ఓట్లు

- కాకినాడ, అనంతపురం తప్ప మిగతా స్థానాల్లో భారీ వ్యత్యాసం
- మహిళల ఓట్లు వైఎస్సార్‌సీపీకే అంటున్న రాజకీయ విశ్లేషకులు



పురుషుల కన్నా మహిళా ఓట్లు ఎక్కువ పోలైన 21 పార్లమెంట్ నియోజకవర్గాలు ఇవీ..

లోక్‌సభ స్థానం	పోలైన పురుష ఓట్లు	పోలైన మహిళా ఓట్లు	ఎక్కువగా నమోదైన మహిళా ఓట్లు
అరకు (ఎస్టీ)	5,60,845	5,84,533	23,688
శ్రీకాకుళం	5,83,439	6,30,675	47,236
విజయనగరం	6,36,618	6,48,244	11,626
విశాఖపట్నం	6,66,289	7,04,154	37,685
అనకాపల్లి	6,38,148	6,71,813	33,665
కాకినాడ	6,52,578	6,59,575	6,997
రాజమండ్రి	6,47,491	6,66,081	18,590
నరసాపురం	6,02,473	6,14,030	11,557
ఏలూరు	6,77,056	6,93,045	15,989
మచిలీపట్నం	6,32,049	6,61,859	29,810
విజయవాడ	6,62,702	6,89,695	26,993
గుంటూరు	6,85,984	7,25,943	39,959
నరసరావుపేట	7,27,560	7,58,261	30,701
బాపట్ల (ఎస్సీ)	6,31,142	,56,519	25,377
నంద్యాల	6,85,792	7,01,399	15,607
అనంతపురం	7,10,040	7,12,961	2,921
కడప	6,34,349	6,69,820	35,471
నెల్లూరు	6,67,930	6,85,568	17,638
తిరుపతి (ఎస్సీ)	6,73,487	6,94,837	21,350
రాజంపేట	6,45,329	6,72,067	26,738
చిత్తూరు (ఎస్సీ)	6,94,417	7,12,401	17,984

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాల్లో విజేతలను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని స్పష్టమైంది. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకు గాను 21 స్థానాల్లో పురుషులు కన్నా మహిళలే ఎక్కువ మంది ఓటేశారని కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ గణాంకాలు పేర్కొన్నాయి. అమలాపురం, ఒంగోలు, కర్నూలు, హిందూపురం లోక్‌సభ స్థానాల్లో మాత్రమే మహిళలు కన్నా పురుషులు స్వల్పంగా ఎక్కువగా ఓటేశారు. కాకినాడ, అనంతపురం లోక్‌సభ స్థానాల్లో పురుషులు కన్నా మహిళలే ఎక్కువగా ఓటేసినా.. తేడా మాత్రం స్వల్పంగానే ఉంది. మిగతా లోక్‌సభ స్థానాల్లో 11 వేల నుంచి 47 వేల వరకు మహిళల ఓట్లు ఎక్కువ ఉన్నాయి. మహిళా ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయంటే సహజంగానే వైఎస్సార్‌సీపీకే మొగ్గు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళల కోసం అనేక పథకాలను అమలు చేయడమే కాకుండా వారి జీవనోపాధిని మెరుగుపరచడమే కారణమని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరిట పథకాలు మంజూరు చేయడంతో మహిళా ఓటింగ్ పెరిగిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని మహిళలందరూ మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే గట్టి పట్టుదలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారని సీనియర్ రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. మహిళల ఓట్లు ఎక్కువగా నమోదైన 21 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు ఆ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో మహిళల ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీకే పడ్డాయని, పోలింగ్ రోజు ఇది స్పష్టంగా కనిపించిందని ఆ రాజకీయ నాయకులు చెబుతున్నారు. హైదరాబాద్ అపార్ట్‌మెంట్లలో ఇస్త్రీ పనికి వెళ్లిన వారితో పాటు వివిధ రకాల చిన్న చిన్న పనులు చేసుకునేందుకు వెళ్లిన మహిళలందరూ కూడా ఏపీ వెళ్లి వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామని చెబుతున్నారు. ప్రభుత్వం వల్ల మేలు పొందిన వారందరూ ఎక్కడున్నా సరే పోలింగ్ రోజున రాష్ట్రానికి వచ్చి వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో ఓటు వేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ కార్యకర్తల దాడి

వన్యప్రాణుల వేటను అడ్డుకోవడమే కారణం


పొలం సమీపంలో పడివున్న విద్యుత్ తీగలు(ఉచ్చు)

రామకుప్పం(చిత్తూరు జిల్లా): రామకుప్పం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మణిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడినట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 89 పెద్దూరు పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు మణి అదే గ్రామానికి చెందిన మోహన్‌బాబుకు చెందిన మూడెకరాల పొలాన్ని గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆ పొలంలో శుక్రవారం రాత్రి 89 పెద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శేషాద్రి, వెంకటేష్, శీనప్ప వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చుతుండగా మణి గమనించి.. ప్రశ్నించాడు. దీంతో మమ్మల్నే ప్రశ్నిస్తావా? అంటూ మణిపై దాడి చేయడంతో పాటు అతని చేతి వేలిని కొరికి గాయపరిచారు. దీంతో బాధితుడు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శివ కుమార్ తెలిపారు. ఇదిలావుండగా తనపై మణి, అతని బంధువులు దాడి చేశారంటూ శేషాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

25 లోక్‌సభ స్థానాల్లో భారీగా పోలింగ్

నాలుగు దశల పోలింగ్ సరళిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో మొదటి నాలుగు దశల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 25 చోట్ల గతంలో కన్నా భారీ స్థాయిలో ఓట్లు పోలైనట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది. 373 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. గతం(2019)లో కన్నా లక్షకు పైగా ఓట్లు పోలైన నియోజకవర్గాలు 25 ఉన్నాయని నివేదిక తెలిపింది. అసాంలోని దుబ్రి లోక్‌సభ స్థానంలో 2019లో కన్నా ఏకంగా 7.7 లక్షల ఓట్లు ఎక్కువగా పోలయ్యాయని తెలిపింది. ఆ తర్వాత శ్రీనగర్‌లో 4.9 లక్షలు ఓట్లు, తెలంగాణలోని చేవెళ్ల లోక్‌సభ స్థానంలో గతంలో కన్నా 3.6 లక్షల ఓట్లు ఎక్కువగా పోలయ్యాయని వెల్లడించింది. అలాగే అసాంలోని కోక్రాఝర్‌లో గతంలో కన్నా 2.4 లక్షల ఓట్లు తక్కువగా పోలయ్యాయని పేర్కొంది. జమ్మూ, గువాహటిలో 1.7 లక్షల చొప్పున ఓట్లు తక్కువగా పోలయ్యాయని వెల్లడించింది. జనరల్ కేటగిరీల కన్నా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో అత్యధికంగా ఓట్లు పోలయ్యాయని.. ఇందులో కూడా పురుషుల కన్నా మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. 57 ఎస్సీ స్థానాల్లో ఈసారి ఒక్కోచోట అదనంగా 50 వేల ఓట్లు, 37 ఎస్టీ నియోజకవర్గాల్లో ఒక్కో స్థానంలో అదనంగా 60 వేల ఓట్లు పోలైనట్లు నివేదిక తెలిపింది.

తుపానుగా మారిన వాయుగుండం

నేడు బంగ్లాదేశ్ సమీపంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం


బెజవాడలో శనివారం సాయంత్రం జోరుగా కురుస్తున్న వాన

సాక్షి, విశాఖపట్నం/సాక్షి నెట్‌వర్క్: తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గంటకు 12 కి.మీ. వేగంతో ఉత్తరం వైపు కదులుతూ ఉత్తర బంగాళాఖాతం మీదుగా శనివారం రాత్రి సమయంలో తుపానుగా మారింది. దీనికి రెమల్ అని నామకరణం చేశారు. రెమల్ అంటే అరబిక్ భాషలో ఇసుక అని అర్థం. తుపాను క్రమంగా ముందుకు కదులుతూ ఆదివారం ఉదయానికి ఈశాన్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం అర్ధరాత్రి సాగర్ ద్వీపం, ఖేపుపరా మధ్య బంగ్లాదేశ్‌ని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 110–120 కిలోమీటర్ల వేగంతో.. గరిష్టంగా 135 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశాలున్నాయని వెల్లడించారు.

మరోవైపు.. నైరుతి రుతుపవనాలు నైరుతి బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలు, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని భాగాలు, ఈశాన్య బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. ఆదివారం నాటికి నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 31లోగా కేరళ తీరాన్ని తాకే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. రాగల రెండు రోజుల్లో ఏపీలోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రెండు రోజుల తర్వాత మళ్లీ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

పలుచోట్ల జల్లులు.. అక్కడక్కడా వర్షాలు

మన రాష్ట్రంపై తుపాను ప్రభావం లేకపోయినా.. రాజస్థాన్, విదర్భ, తెలంగాణ మీదుగా బంగాళాఖాతం వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని తూపిలిపాలెం సముద్ర తీరంలో భీకరమైన శబ్దాలతో అలలు ఎగసి పడుతున్నాయి. తీరంలో చీకట్లు కమ్ముకున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. కవిటి మండలంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంత ఇళ్లలో నీరు చేరింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులు పడ్డాయి. తెనాలిలో తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలుచోట్ల వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలంలో అత్యధికంగా 86.4 మి.మీ. భారీ వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మడకశిర మండలంలో 72.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉమ్మడి కృష్ణా జిల్లా అంతటా ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 41.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. విజయవాడ నగరంలోనూ జోరు వాన కురిసింది. పల్నాడు జిల్లాలో శనివారం అక్కడక్కడా చిరు జల్లులు కురిశాయి. జిల్లా మొత్తం చల్లటి వాతావరణం ఏర్పడింది. నరసరావుపేటలో తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. చిలకలూరిపేట, పెదకూరపాడు, సత్తెనపల్లి పట్టణం, గ్రామాల్లో జల్లులు పడ్డాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల చెదురుమదురు వర్షాలు కురిశాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, ఏజెన్సీ ప్రాంతం, నూజివీడు, కైకలూరు, ఆచంట, మొగల్తూరు, నరసాపురం తదితర ప్రాంతాల్లో తుంపర్ల వర్ష కురిసింది. కర్నూలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దేవనకొండలో 62.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

క్షమాపణ చెప్పాలి... లేకుంటే దావా

- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తికి సీఎస్ జవహర్‌రెడ్డి హెచ్చరిక
- విశాఖలో అసైన్డ్ భూములు కొనుగోలు చేయలేదు



సాక్షి, అమరావతి: జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తనపైన, తన కుమారుడిపైన చేసిన నిరాధార తప్పుడు ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం సీఎస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆరోపణలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని మూర్తి యాదవ్‌ను ఆయన డిమాండ్ చేశారు. లేదంటే వ్యక్తిగతంగా పరువు నష్టం దావా వేయడంతో పాటు చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటానని సీఎస్ హెచ్చరించారు. రెండు నెలలుగా ఒక పథకం ప్రకారం వ్యక్తిత్వ హననం చేసే కుట్రలో భాగంగా చేస్తున్న ప్రచారమే ఈ ఆరోపణలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో తాను గానీ, తన కుమారుడు, బంధువులు ఎలాంటి అసైన్డ్ భూములు కొనలేదని స్పష్టం చేశారు. తన స్నేహితుడైన రిటైర్డ్ ఆర్మీ అధికారి కుమార్తె వివాహం ఏప్రిల్‌లో జరిగిందని, ఎన్నికల దృష్ట్యా ఆ వివాహానికి హాజరు కాలేకపోయినందున రెండు రోజుల విశాఖ పర్యటలో భాగంగా ఆదివారం కొత్త దంపతులను ఆశీర్వదించడానికి వెళ్లానని సీఎస్ తెలిపారు. ఆ మరుసటి రోజు భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించానన్నారు. ఉత్తరాంధ్రలో రెండు వేల కోట్ల రూపాయల విలువైన 800 ఎకరాలు అసైన్డ్ భూములు కొట్టేసినట్లు యాదవ్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు సంబంధించి అసెంబ్లీలో 2023 అక్టోబర్‌లో సభ ఆమోదం తెలిపిందని, ఆ సవరణను అనుసరించి అసైన్డ్ భూములపై జీవో 586ను రెవెన్యూ శాఖ జారీ చేసిందని సీఎస్ పేర్కొన్నారు. చట్ట సభ ఆమోదం మేరకే జీవో జారీ అయితే దాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆపాదించడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఈ జీవో ఆధారంగా తన కుమారుడి ద్వారా విశాఖలో 800 ఎకరాలకు పైగా భూములు కొనుగోలుకు డీల్స్ చేసినట్లు చేసిన ఆరోపణ పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే 400 ఎకరాల అసైన్డ్ భూములను తన కుమారుడిని అడ్డంపెట్టుకుని బినామీల పేరిట చేజిక్కించుకున్నాననడంలో ఎంత మాత్రం నిజం లేదన్నారు. మరో 400 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించేందుకు యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాననడం పూర్తిగా అవాస్తవమని సీఎస్ తెలిపారు. ఈ భూముల రిజిస్ట్రేషన్లను పూర్తి చేసేందుకు విశాఖ, విజయనగరం జిల్లాల అధికారులపై ఒత్తిడి చేశాననడాన్నీ ఆయన తీవ్రంగా ఖండించారు. ఐదేళ్లలో తన కుమారుడు విశాఖకు గానీ, ఉత్తరాంధ్రలో ఏ జిల్లాకూ గాని వెళ్లలేదని సీఎస్ స్పష్టం చేశారు. మరో వైపు భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలన పేరుతో సీఎం జగన్ మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లపై తాను సమీక్షించానని చేసిన ఆరోపణా అసంబద్ధమేనని ఖండించారు.

'సాక్షి' ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ టెస్ట్

సాక్షి, హైదరాబాద్: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, అనస్థీషియాలజీ మొదలైన స్పెషలైజేషన్లలో వారి భవిష్యత్ కెరీర్‌లకు పునాది వేయడానికి ఔత్సాహిక వైద్యులకు నీట్-పీజీ చాలా కీలకమైన పరీక్ష.పీజీ మెడికల్ స్టడీస్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ, సాక్షి మీడియా గ్రూప్ 2024 జూన్ 16న విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ పరీక్షను నిర్వహిస్తోంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరుచుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ క్లినికల్ నాలెడ్జ్, ఎగ్జామ్-టేకింగ్ స్ట్రాటజీలకు పదును పెట్టడంలో సహాయపడటమే కాకుండా, నిజమైన నీట్-పీజీలో రాణించడానికి అభ్యర్థుల సన్నద్ధతను నిర్ధారిస్తుంది. ఈ మాక్ పరీక్షకు 'మై ర్యాంక్' టెక్నాలజీ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి https://www.arenaone.in/mock/neetpg ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లాగిన్ హాల్ టికెట్ నెంబర్, పాస్వర్డ్ పరీక్షకు రెండు రోజుల ముందు అభ్యర్థి రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్ ఐడీ/ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. మాక్ పరీక్ష ఆన్‌లైన్‌లో https://sakshimocktest.myrank.co.inలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. పరీక్ష సమయం మూడు గంటల 30 నిముషాలు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 99126 71555, 96660 13544, 96665 72244

నైపుణ్యం ప్రతిబింబించేలా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల నైపుణ్యం, సామర్థ్యంపై పరిశ్రమల విశ్వాసాన్ని ప్రతిబింబించేలా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఉన్నాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో శనివారం 'జాబ్ ఎచీవర్స్ డే' నిర్వహించారు. విజయవాడ పాలిటెక్నిక్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 2023–24లో పాలిటెక్నిక్ పూర్తి చేసినవారిలో 12 వేల మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ సాధించారన్నారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు పూర్తి చేయవచ్చని, అందుకు ఆయా సంస్థలే అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఉపాధి విభాగం ఈ విషయంలో మెరుగైన పనితీరును ప్రదర్శించిందని కితాబిచ్చారు. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, థాట్‌వర్క్స్, మేఘా ఇంజనీరింగ్, జీఈ ఏరోస్పేస్, మోస్ చిప్, సుజ్లాన్, అమరరాజా, అర్సలర్ మిట్టల్ అండ్ నిప్పన్ స్టీల్, ఎఫ్ట్రానిక్స్, మేధా సర్వో, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, షాపూర్జీ పల్లోంజీ, అల్ట్రాజ్ లఫలేస్కీ, ట్రావల్‌కి, ట్రావల్ ప్రాజెక్ట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా, నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, హెచ్‌ఎల్ మాండో, ఆనంద్ ఇండియా వంటి పలు ప్రముఖ సంస్థల్లో అవకాశాలు కల్పించామని నాగరాణి వివరించారు. అలాగే ఆయా సంస్థల్లో నియమితులైన విద్యార్థుల జీతభత్యాలు కూడా అద్భుతంగా ఉన్నాయని, అనేక మంది విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతనం ఆఫర్ అందుకున్నారన్నారు. తమ విద్యార్థుల సగటు వార్షిక వేతన ప్యాకేజీ రూ.3 లక్షలు ఉందని తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, లోకేశ్ ఇండస్ట్రీస్ చైర్మన్ వెంకటరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం


మృతులు దశరథ, ప్రభాకర్, మునిరంగడు (ఫైల్)

డోన్ రూరల్: నంద్యాల జిల్లా డోన్ మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మరణించారు. డోన్ మండలం చనుగొండ్లకు చెందిన దశరథ(22), తుగ్గలి మండలం లింగనేనిదొడ్డికి చెందిన మునిరంగడు(19), ప్రభాకర్(21)లు పట్టణంలో పెయింట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని వర్షంలో ఒకే బైక్‌పై ముగ్గురూ బయలుదేరారు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. వీరిని హైవే పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. డోన్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, దశరథకు ఆరు నెలల క్రితం వివాహం కాగా.. భార్య మహాలక్ష్మి ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ముగ్గురు యువకుల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



ఆయనలో జీవముండెను మరియు ఆ జీవము సమస్త మానవాళికి వెలుగై ఉండెను.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం,
తిథి: బ.తదియ సా.5.54 వరకు, తదుపరి చవితి
నక్షత్రం: మూల ఉ.10.44 వరకు, తదుపరి పుర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.07 నుండి 10.43 వరకు, తదుపరి రా.8.12 నుండి 9.47 వరకు
దుర్ముహూర్తం: సా.4.42 నుండి 5.34 వరకు
అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.23
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

విక్రమాదిత్య సింగ్ (కంగన ప్రత్యర్థి)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

ఓటమే కాదు, కొన్నిసార్లు గెలుపు కూడా గుణపాఠాలు నేర్పుతుంది. జూన్ 1న జరిగే 'మండీ' లోక్ సభా స్థానం ఎన్నికల్లో ఒకవేళ నేను గెలిస్తే... 'గెలుపు కోసం ప్రత్యర్థి గురించి తప్పుగా మాట్లాడటం ఓటమి కన్నా తక్కువేం కాదు'... అన్నదే బహుశా నేను నేర్చుకునే మొదటి గుణపాఠం అవుతుంది!

రాజకీయంగా ఎన్నైనా ఉండొచ్చు, అవి రాజకీయంగానే ఉండాలి. వ్యక్తిగత స్థాయికి దిగకూడదు. దిగజార కూడదు.

కంగనకు, నాకు మధ్య ఏం లేదు. ఆమె బీజేపీ, నేను కాంగ్రెస్. సినిమాల్లో ఆమె 'క్వీన్', సిమ్లా వాళ్లకు నేను 'కింగ్'. ఇద్దరం ఒకింట్లో పుట్టుంటే ఆమె అక్క, నేను తమ్ముడు. కానీ ప్రచారంలో ఆమెను ఎన్నిమాటలన్నాను! అన్నానా? అనవలసి వచ్చిందా? అనవలసి వచ్చినా అది అన్నట్లే!

కంగనకు, నాకు మధ్య ఏం లేకుండానూ లేదు. మంచి నటిగా ఆమెను నేను అభిమానిస్తాను. కనుక నేను ఆమె అభిమానిని అన్నట్లే! మా మధ్య సినీతారకు–సినీ అభిమానికి మధ్య



ఉండే అనుబంధం ఉన్నట్లే!

'క్వీన్' సినిమాలో చూడాలి కంగనను. 'క్వీన్ ఆఫ్ ఝాన్సీ' సినిమా కాదు. 'క్వీన్' సినిమా. అమాయకురాలైన అమ్మాయి. ఆత్మాభిమానం కల అమ్మాయి. ప్రతికూల పరిస్థితుల్ని చేతుల్లోకి తీసుకుని రాణిలా ఏలిన అమ్మాయి. మధురం, సున్నితం, ఆహ్లాదకరం... 'క్వీన్' లో కంగన నటన. అందులో అనే ఏముంది! ప్రతి చిత్రంలోనూ!

రొమాంటిక్ థ్రిల్లర్ 'గ్యాంగ్‌స్టర్' తో మొదలు పెట్టి రాజకీయాల్లోకి వచ్చి పడ్డారు కంగన. ఇక్కడ ఆమె తొలి చిత్రం 'మండీ'. దర్శకత్వం బీజేపీ. అందులో విలన్... ఇంకెవరు? నేనే.

బీజేపీ నుంచి కంగన, కాంగ్రెస్ నుండి నేను మండీ నుంచి పోటీ పడుతున్నాం. మాటలూ పడుతున్నాం!

ఎన్నెన్ని మాటలు! ఎంతెంత మాటలు! అర్థం లేనివి, అనవసరమైనవీ, అసహ్యకరమైనవి, రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేనివి! ఆమె బీఫ్ తిన్నారని అన్నాను. ఆమె దర్శించిన దేవాలయాలను శుద్ధి చేయాలని అన్నాను. తిరిగి ఆమె నన్ను 'మహా చోర్' అన్నారు. 'ఛోటా పప్పు' అన్నారు. కానీ స్త్రీ... పురుషుడిని అనడం వేరు. పురుషుడు స్త్రీని అనడం వేరు.

అమ్మ స్టేట్ కాంగ్రెస్ ప్రెసిడెంట్. 'మండీ' సిటింగ్ ఎంపీ. అమ్మ కాంగ్రెస్‌లో ఉండి కూడా... రామాలయం నిర్మించినందుకు మోదీజీని ధైర్యంగా ప్రశంసించగలిగారు! అయోధ్యలో ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్ల కూడదని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించిన తర్వాత కూడా మోదీని అమ్మ బహిరంగంగా అభినందించారు.

అందుకు ఒకవేళ కాంగ్రెస్ పార్టీ... "ప్రతిభాసింగ్‌జీ! మీరు పార్టీ నియమాలను ఉల్లంఘించారు..." అని అమ్మను బహిష్కరించి, "ప్రతిభాసింగ్‌జీ! మీరు మా పార్టీలోకి వచ్చేయండి..." అని బీజేపీ అమ్మను ఆహ్వానించి, అమ్మ బీజేపీలో చేరి, ఇప్పుడు ఇదే 'మండీ' నుంచి నాకు పోటీగా నిలబడి ఉంటే అమ్మను కూడా కంగనను అన్నట్లే అన్నేసి మాటలు అనవలసి వచ్చేదా? మాటలు అనవలసి వస్తే అసలు అమ్మకు పోటీగా నిలబడేవాడినా? "కంగనకు బుద్ధి ప్రసాదించమని ఆ శ్రీరాముడిని వేడుకుంటున్నాను" అని కూడా నేను కంగన గురించి అన్నాను.

అందుకు కంగన – "వీరభద్రసింగ్‌జీ ఈరోజు జీవించి ఉంటే కనుక నా గురించి అగౌరవంగా మాట్లాడినందుకు తన కొడుకు విక్రమాదిత్యను మందలించి, 'వెళ్లి ఆమెకు క్షమాపణ చెప్పు' అని ఉండేవారు..." అన్నారు.

ఆ మాట నిజమే కావచ్చు.

కానీ, కొన్నిసార్లు క్షమాపణ కోరటం కూడా అభిమానాన్ని ప్రదర్శించుకోవటమే అవుతుంది. అభిమానం అన్నది గుండెల్లో ఉంటేనే మనల్ని సాకర్యవంతంగా ఉంచుతుంది.

అయినా అందరికీ అమ్మకు ఉన్నంత ధైర్యం ఉంటుందా?! రాజకీయ ప్రత్యర్థిని అభినందించేంత ధైర్యం!

బొటాబొటిగా జాతీయం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



చండీగఢ్ టూ పట్నా. జాతీయ రాజకీయాలకు ఆయువుపట్టు. సారవంతమైన గంగా–యమునల మైదాన ప్రాంతం ఇదే. కొద్దిగా సింధూ బేసిన్ కూడా ఇందులో చేరి ఉండవచ్చు. కాస్త విస్తరిస్తే 'కౌబెల్ట్' అని కూడా పిలుస్తాము. మనం ఏ రకమైన మాంసం తినాలో, ఏ రకమైనది తినకూడదో తెలియజెప్పే కౌబాయ్స్‌కు ఇది పరమ పూజనీయమైన ప్రాంతం. అనాదిగా పిలుచుకుంటున్నట్టు 'ఆర్యావర్తం' కూడా ఇదే! ఈ ప్రాంతం మీద పట్టు సాధించకుండా దేశంలో రాజ్యాధికారాన్ని సంపాదించడం చాలా కష్టం.

మొదటి ఐదు సాధారణ ఎన్నికల్లో ఆర్యావర్తం, ద్రవిడదేశం అనే తేడాల్లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కనబరిచింది. ఆరోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ జైత్రయాత్రకు కళ్లెం వేసిన జనతా పార్టీ మాత్రం అచ్చంగా ఉత్తరాది పార్టీయే! అప్పుడు జనతా పార్టీకి 295 లోక్‌సభ స్థానాలు దక్కాయి. ఇందులో వింధ్య పర్వతాలకు దిగువన గెలిచిన సీట్లు రెండు డజన్లు దాటలేదు. అవి కూడా ప్రధానంగా మహారాష్ట్రలో గెలిచినవే!

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి గడచిన పదేళ్లుగా అధికారంలో ఉన్నది. అయినప్పటికీ ఒక్క కర్ణాటక మినహా మిగిలిన దక్షిణాదిలో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నది. ఈసారి అదనంగా తెలంగాణపై కూడా ఆశలు పెట్టుకున్నది. కానీ, మూడోసారి వరసగా అధికారాన్ని చేపట్టాలంటే కచ్చితంగా గోమాత ప్రాంతమే కాషాయ దళాన్ని కరుణించి కాపాడాలి. గత ఎన్నికల్లో భారీ సీట్లను ప్రసాదించిన ఈ ప్రాంతంలో బలమైన గండి పడితే మాత్రం ఇతర ప్రాంతాలు పూడ్చగలిగే పరిస్థితి కనిపించడం లేదు. మరి ఈసారి కూడా ఆర్యావర్తం బీజేపీని గట్టెక్కిస్తుందా లేదా అన్నదే ముఖ్యమైన ప్రశ్న.

చండీగఢ్ నుంచి హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల మీదుగా బీహార్‌లోని పట్నా వరకు మొత్తం 157 స్థానాలను అప్పట్లో జనతా పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికీ అదే రికార్డు. ఇందిరా గాంధీ హత్యానంతరం వెల్లువెత్తిన సానుభూతి ప్రభంజనం (1984)లో కూడా ఈ రికార్డు చెక్కుచెదరలేదు. అప్పుడు యూపీ, బీహార్‌లలో ఎనిమిదిమంది ఇతర పార్టీల వారు గెలిచారు. కొత్త రాష్ట్రాలుగా అవతరించిన ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లను కూడా కలుపుకొంటే ఇదే ప్రాంతంలో బీజేపీకి 2019లో 113 సీట్లు దక్కాయి. ఎన్డీఏ భాగస్వాములతో కలిసి 131 సీట్లలో గెలిచారు.

ఇప్పుడా సంఖ్యను బీజేపీ నిలబట్టుకోగలదా? రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌లను కూడా కలిపి చూస్తే కౌబెల్ట్ పూర్తవుతుంది. ఇందులో రాజస్థాన్ (25), గుజరాత్ (26), హిమాచల్ (4)లో అప్పుడు బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. మధ్యప్రదేశ్ (29)లో 28, ఛత్తీస్‌గఢ్ (11)లో 9 సీట్లను గెలుచుకున్నది. ఈ దూకుడును ఇప్పుడు కూడా ప్రదర్శించగలుగుతుందా? దాదాపు 90 శాతం స్ట్రయిక్ రేట్‌తో విజృంభిస్తేనే కౌబెల్ట్‌లో బీజేపీ తన బలాన్ని నిలబెట్టుకోగలుగుతుంది.

ఈ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గాలుగా పేరున్న రాజ్‌పుత్, జాట్, యాదవ కులాలు బీజేపీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాయనే వార్తలు వస్తున్నాయి. ఓబీసీ రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్న జాట్ నాయకులు రాజస్థాన్, హర్యానాల్లో ఇప్పటికే 'ఇండియా' కూటమికి మద్దతు ప్రకటించారు. పశ్చిమ యూపీలోని జాట్లు మాత్రం చరణ్‌సింగ్ పరివారానికి చెందిన ఆర్‌ఎల్‌డీతోనే ఉన్నట్టు కనిపిస్తున్నది. ఈ పార్టీ ఎన్డీఏలో చేరినందువల్ల యూపీ జాట్ల మద్దతు బీజేపీకి లభించవచ్చు.

ఉత్తరాదిలో తొలి నుంచీ బీజేపీకి వెన్నుదన్నుగా ఉన్న రాజ్‌పుత్‌ల తాజా వైఖరి ఆ పార్టీని కొంత కలవరపరుస్తున్నది. ఈ వర్గానికి ప్రాతినిధ్యం వహించే కర్ణిసేన సభ్యులు బహిరంగ సభలు పెట్టి మరీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని పిలుపునిస్తున్నారు. రాజ్‌పుత్ వర్గం మీద వీరి పిలుపు ప్రభావం చూపితే ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలోని కనీసం 30 నియోజకవర్గాల్లో బీజేపీకి నష్టం జరిగే అవకాశం ఉన్నది. రాజ్‌పుత్ వర్గానికి చెందిన యోగీ బాబానే యూపీ సీఎంగా ఉన్నందువలన ఆ రాష్ట్రంలో పెద్దగా భయపడవలసిన అవసరం లేదని బీజేపీ భావిస్తున్నది.

యూపీ, బీహార్‌లలో గణనీయమైన సంఖ్యలో ఉన్న యాదవులు చాలాకాలంగా ఎస్పీ, ఆర్జేడీల వెనుకనే సమీకృతమై ఉన్నారు. ఇప్పుడీ సమీకరణ మరింత సంఘటితంగా ఉన్నట్టు సమాచారం. అఖిలేశ్, తేజస్వీ యాదవ్‌లను వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రులను చేయాలనే పట్టుదల యువతలో కనిపిస్తు

వాజ్‌పేయి హయాంలోని ఎన్డీఏ సర్కార్ చేసుకున్న 'షైనింగ్ ఇండియా' ప్రచారం వికటించినట్టుగానే మోదీ సర్కార్ చేస్తున్న 'వికసిత భారత్' కూడా వికటిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. ఉపాధి రంగం దారుణంగా దెబ్బతిన్నది. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ వరస దెబ్బలతో కుదేలైన చిన్న వర్తకులు ఇప్పటికీ కోలుకోలేదు. నిరుద్యోగిత రేటుపై నిన్ననే విడుదలైన పీరియాడిక్ లేబర్ శాంపుల్ సర్వే నివేదిక నిరాశాజనకంగానే ఉన్నది. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో చదువుకున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 38 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించలేదని వచ్చిన తాజా వార్త పరిస్థితికి అద్దం పడుతున్నది.
ఉత్తరాది రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు సైనిక బలగాల్లో చేరడం ఒక ప్రత్యామ్నాయం. అందులో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నివీర్' పథకం ఈ యువతను తీవ్రంగా నిరాశపరిచింది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రపంచస్థాయి ఆర్థికవేత్తలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు క్రమం తప్పకుండా ఇచ్చే నివేదికల్లో ఈ అన్యాయాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఒకే దేశంలోని మనుషుల మధ్య వంద రెట్లు, వేయి రెట్లు కాదు లక్షల రెట్ల ఆర్థిక తారతమ్యాలు వెక్కిరిస్తున్నాయి.
2012 నుంచి 2021 మధ్యకాలంలో భారత జాతి సృష్టించిన సంపదలో నలభై శాతం సొత్తు జనాభాలోని ఒకే ఒక్క శాతం కుబేరుల జేబుల్లోకి వెళ్లింది. యాభై శాతం మంది అడుగు జనాభా దోసిళ్లలో ఎంగిలి మెతుకులు రాలిపడ్డట్టు ఒకే ఒక్క శాతం సొమ్ము ఉమ్మడిగా జారిపడింది. దీన్నే కొందరు 'ట్రికిల్ డౌన్ థియరీ'గా పిలుచుకుంటున్నారు. ఈ రకమైన ఆర్థిక విధానాలతో ఎన్డీఏ రాజ్యమేలుతున్నది. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే శామ్ పిట్రోడాతో సహా పలువురు ఆర్థికవేత్తలు కూడా దేశంలో వారసత్వ పన్ను విధించాలన్న ప్రతిపాదన చేస్తున్నారు.

న్నది. యాదవ వర్గం వ్యతిరేకతకు విరుగుడుగా యాదవేతర ఓబీసీలను మచ్చిక చేసుకుంటూ బీజేపీ ఇన్నాళ్లుగా నెట్టుకొస్తున్నది. బీజేపీ అధికారంలోకి వస్తే ఈసారి రిజర్వేషన్లు ఎత్తివేస్తారని జరిగిన ప్రచారం వల్ల ఈ వర్గం మద్దతును కూడా ఎంతోకొంత బీజేపీ కోల్పోవచ్చనే అభిప్రాయం బలపడుతున్నది. రిజర్వేషన్లు ఎత్తివేసే ఆలోచన తమకు లేదని ప్రధాని సహా పలువురు నేతలు వివరణ ఇచ్చినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయిందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

వాజ్‌పేయి హయాంలోని ఎన్డీఏ సర్కార్ చేసుకున్న 'షైనింగ్ ఇండియా' ప్రచారం వికటించినట్టుగానే మోదీ సర్కార్ చేస్తున్న 'వికసిత భారత్' కూడా వికటిస్తున్నట్టుగానే కనిపిస్తున్నది. ఉపాధి రంగం దారుణంగా దెబ్బతిన్నది. పెద్దనోట్ల రద్దు, కోవిడ్ వరస దెబ్బలతో కుదేలైన చిన్న వర్తకులు ఇప్పటికీ కోలుకోలేదు. నిరుద్యోగిత రేటుపై నిన్ననే విడుదలైన పీరియాడిక్ లేబర్ శాంపుల్ సర్వే నివేదిక నిరాశాజనకంగానే ఉన్నది. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో చదువుకున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 38 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించలేదని వచ్చిన తాజా వార్త పరిస్థితికి అద్దం పడుతున్నది.

ఉత్తరాది రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు సైనిక బలగాల్లో చేరడం ఒక ప్రత్యామ్నాయం. అందులో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నివీర్' పథకం ఈ యువతను తీవ్రంగా నిరాశపరిచింది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రపంచ స్థాయి ఆర్థికవేత్తలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు క్రమం తప్పకుండా ఇచ్చే నివేదికల్లో ఈ అన్యాయాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఒకే దేశంలోని మనుషుల మధ్య వంద రెట్లు, వేయి రెట్లు కాదు లక్షల రెట్ల ఆర్థిక తారతమ్యాలు వెక్కిరిస్తున్నాయి.

2012 నుంచి 2021 మధ్యకాలంలో భారత జాతి సృష్టించిన సంపదలో నలభై శాతం సొత్తు జనాభాలోని ఒకే ఒక్క శాతం కుబేరుల జేబుల్లోకి వెళ్లింది. యాభై శాతం మంది అడుగు జనాభా దోసిళ్లలో ఎంగిలి మెతుకులు రాలిపడ్డట్టు ఒకే ఒక్క శాతం సొమ్ము ఉమ్మడిగా జారిపడింది. దీన్నే కొందరు 'ట్రికిల్ డౌన్ థియరీ'గా పిలుచుకుంటున్నారు. ఈ రకమైన ఆర్థిక విధానాలతో ఎన్డీఏ రాజ్యమేలుతున్నది.

ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే శామ్ పిట్రోడాతో సహా పలువురు ఆర్థికవేత్తలు కూడా దేశంలో వారసత్వ పన్ను విధించాలన్న ప్రతిపాదన చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ఇటువంటి సూచనలపై విస్తృతమైన చర్చను ఆహ్వానించడం అవసరం. కానీ, పిట్రోడాకు ఉన్న కాంగ్రెస్ సంబంధాలను ఆసరా చేసుకొని స్వయంగా ప్రధానమంత్రే ఎదురుదాడికి పూనుకున్నారు. 'ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మీరు సంపాదించుకున్న సొమ్మును లాగేసుకుంటారట' అంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. ఈ ప్రచారం బీజేపీకి మేలు చేసిందా... కీడు చేసిందా అనే విషయం ఓట్ల లెక్కింపు తర్వాత తేలిపోనున్నది.

ఈ రకమైన సామాజిక – ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తన కంచుకోటలను ఏ మేరకు కాపాడుకోగలదన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ఎటువంటి గాలి లేదని అభిప్రాయపడిన పక్షంలో గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 50 స్థానాలను బీజేపీ చేజార్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వీటితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా గత ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలనే సాధించింది. ఈసారి రెండు రాష్ట్రాల్లో కనీసం 15 స్థానాల వరకు ఆ పార్టీ పోగొట్టుకోవచ్చనే అంచనాలున్నాయి.

శరద్ పవార్, బాల్‌ఠాక్రేలు స్థాపించిన పార్టీలను చీల్చడం బీజేపీకి కలిసివచ్చే అంశం కాదనే అభిప్రాయం మహారాష్ట్రలో ఉన్నది. ఎన్నికల హామీల అమలులో చతికిలబడ్డ కర్ణాటక కాంగ్రె

'ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మీరు సంపాదించుకున్న సొమ్మును లాగేసుకుంటారట' అంటూ స్వయంగా ప్రధానమంత్రే రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశారు. ఈ ప్రచారం బీజేపీకి మేలు చేసిందా... కీడు చేసిందా అనే విషయం ఓట్ల లెక్కింపు తర్వాత తేలిపోనున్నది.
ఈ రకమైన సామాజిక – ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తన కంచుకోటలను ఏ మేరకు కాపాడుకోగలదన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వానికి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ఎటువంటి గాలి లేదని అభిప్రాయపడిన పక్షంలో గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 50 స్థానాలను బీజేపీ చేజార్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వీటితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా గత ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలనే సాధించింది. ఈసారి రెండు రాష్ట్రాల్లో కనీసం 15 స్థానాల వరకు ఆ పార్టీ పోగొట్టుకోవచ్చనే అంచనాలున్నాయి.
శరద్ పవార్, బాల్‌ఠాక్రేలు స్థాపించిన పార్టీలను చీల్చడం బీజేపీకి కలిసివచ్చే అంశం కాదనే అభిప్రాయం మహారాష్ట్రలో ఉన్నది. ఎన్నికల హామీల అమలులో చతికిలబడ్డ కర్ణాటక కాంగ్రెస్‌కు బీజేపీ మిత్రపక్షం జేడీఎస్ మళ్లీ ఊపిరిపోసింది. దేవెగౌడ పౌత్రరత్నం చేసిన నిర్వాకంపై కన్నడిగులు మండిపడుతున్నారు. ఇక బెంగాల్, ఒడిషా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఓ పదిహేను స్థానాలను బీజేపీ అధికంగా సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే కోల్పోయే అవకాశం ఉన్న సీట్లు 65 అనుకుంటే, అదనంగా తెచ్చుకునే సీట్లు పదిహేను వరకు ఉండవచ్చని అంచనా. అంటే కనీసం యాభై సీట్లను బీజేపీ నికరంగా కోల్పోతుంది.

స్‌కు బీజేపీ మిత్రపక్షం జేడీఎస్ మళ్లీ ఊపిరిపోసింది. దేవెగౌడ పౌత్రరత్నం చేసిన నిర్వాకంపై కన్నడిగులు మండిపడుతున్నారు. ఇక బెంగాల్, ఒడిషా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఓ పదిహేను స్థానాలను బీజేపీ అధికంగా సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే కోల్పోయే అవకాశం ఉన్న సీట్లు 65 అనుకుంటే, అదనంగా తెచ్చుకునే సీట్లు పదిహేను వరకు ఉండవచ్చని అంచనా. అంటే కనీసం యాభై సీట్లను బీజేపీ నికరంగా కోల్పోతుంది.

వ్యతిరేక గాలి బలంగా లేకపోతేనే గత ఎన్నికలతో పోలిస్తే యాభై స్థానాలను బీజేపీ కోల్పోవచ్చు. కూటమిలోని మిత్రపక్షాలన్నీ ఉమ్మడిగా మరో పాతిక, ముప్పయ్ సీట్లను గెలవచ్చు. ఇది దాదాపు తొంభై శాతం స్థానాలకు పోలింగ్ పూర్తయిన తర్వాత పరిశీలకుల్లో నెలకొని ఉన్న అభిప్రాయం. అంటే బొటాబొటి మెజారిటీతో ఎన్డీఏ మూడోసారి గద్దెనెక్కడానికి అవకాశాలు ఉన్నాయనుకోవాలి. బీజేపీకి సొంతంగా 370 సీట్లు కావాలనీ, కూటమికి 400 సీట్లు కావాలని ప్రధానమంత్రి చేసిన అభ్యర్థనను జనం పట్టించుకోలేదు. మూడింట రెండొంతుల మెజారిటీ లభిస్తే ఈ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చడానికి వెనకాడదనే వాదనను జనం విశ్వసిస్తున్నారనే అనుకోవాలి.

విశ్వసనీయమైన ప్రత్యామ్నాయం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉండి ఉంటే ఇప్పుడున్న ప్రభుత్వాన్ని ప్రజలు కచ్చితంగా ఓడించేవారే. ప్రజల ఆకాంక్షలకు, ప్రభుత్వ విధానాలకు మధ్యన ఓ పెద్ద అగాధమే ఉన్నది. కానీ, ఇండియా కూటమిలో పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన పార్టీగా మిగిలిపోయింది. సాధారణ మెజారిటీకి అవసరమైన 272 స్థానాల్లో కనీసం సగం సీట్లను కూడా కాంగ్రెస్ గెలవగలదన్న నమ్మకం ఎవరికీ లేదు. ఈ పరిస్థితుల్లో అతుకుల బొంతతో అస్థిర ప్రభుత్వ ప్రయోగాలకు మెజారిటీ ప్రజలు సిద్ధపడకపోవచ్చు. పార్టీ అధ్యక్షుడు ఖర్గేను ప్రధాని పదవికి ప్రతిపాదించి ఉంటే కూటమి సభ్యుల ఆమోదం లభించేది. సాహసోపేతమైన ఈ ప్రయోగాన్ని దేశ ప్రజలు స్వాగతించేవారు. కానీ రాహుల్‌గాంధీ మాటల్లో కనిపించేంత ఔదార్యం, అభ్యుదయం చేతల్లో కనిపించవు. అదే విషాదం. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో సెంచరీ కొట్టే ఒక మంచి అవకాశం దొరికింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆశిద్దాం.

vardhelli1959@gmail.com

ప్రశ్నించడం నేర్పిన తొలి మేధావులు


సందర్భం



డాక్టర్ దేవరాజు మహారాజు

'దేవుడు చెడును ఆపాలని కోరుకుంటున్నా ఆపలేకపోతున్నాడా? అలా అయితే, అతను సృష్టిలయలను తన అధీనంలో ఉంచుకున్నవాడు కాదు. అతను సమర్థుడే, కానీ ఆపాలని కోరుకోవడం లేదా? అయితే అతను పగ, ద్వేషమూ గలవాడన్న మాట! అతను చెడును ఆపాలని కోరుకునేవాడు, పైగా సమర్థుడూ అయితే... మరి చెడు ఎందుకు రాజ్యమేలుతోందీ?– సమాధానం కావాలి! పోనీ, అతను చెడును ఆపాలని కోరుకోవడమూ లేదు – పైగా సామర్థ్యమూ లేదా? ఇక ఎందుకండీ ఆయనకు ఆ దేవుడనే బిరుదూ?' అని ప్రశ్నించాడు ఎపిక్యురస్ (క్రీస్తు పూర్వం 341–270) అనే పురాతన గ్రీకు తత్త్వవేత్త. 'ఎపిక్యురిజమ్'కు ఆయనే సిద్ధాంతకర్త. ఆయన రచనలు సుమారు మూడు వందల రాత ప్రతులున్నట్లు తెలిసింది. ఆయనపై డెమోక్రైటస్ అరిస్టిప్పస్, పైరో లాంటి వారి ప్రభావం ఉంది. ఎపిక్యురస్ బోధనలు తొలి దశలో సైన్సుకు ఆధారమయ్యాయి. ఎందుకంటే ఆయన రుజువుల్నే యథార్థాలనే నమ్మాలన్నాడు. క్రీ.పూ. 800–200 మధ్య కాలాన్ని ఏగియల్ యుగంగా పరిగణించారు. ఆ యుగంలో వైజ్ఞానిక ధోరణితో ఆలోచించి శాస్త్రయుగ కర్తగా నిలిచినవాడు ఎపిక్యురస్! గ్రీస్‌లో లాగానే ఇలాంటి ఆలోచనా ధోరణి గల వారు ఇండియా, చైనా, ఇరాన్ లాంటి దేశాల్లో ఉన్నారని కార్ల్ జాస్పర్స్ (1883–1969) అనే జర్మనీ తత్వవేత్త పరిశీలనలో తేలింది. ఆయన పరిశీలనల్లో వాస్తవం ఉందనిపిస్తుంది. ఎందుకంటే సాధారణ శకానికి పూర్వమే మన భారత్‌లో చార్వాకులు, హేతువాదులు విస్తరించి ఉన్నారు. సమాజానికి ప్రశ్నించడం నేర్పారు.

ఎపిక్యురస్ ఆనాటి మేధావులందరితో విభేదించినా, డెమోక్రైటస్ (క్రీ.పూ. 460–370) వెలుగులోకి తెచ్చిన అటమిక్ థియరీని బలపరిచాడు. ఈ విశ్వం అతి సూక్ష్మమైన అణువులతో రూపొందిందనీ, అవి ఒకదానితో ఒకటి ఢీ–కొట్టుకుంటూ, విడిపోతూ, మళ్ళీ దగ్గరవుతూ ఉంటాయనీ, ఇవి నాశనం కావనీ, వీటి వల్లనే 'పదార్థం' ఏర్పడుతుందనీ డెమోక్రైటస్ భావించాడు. ఈ 'అటమిక్ థియరీ'ని ఎపిక్యురస్ గట్టిగా నమ్మాడు. అయితే డెమోక్రైటస్ ఈ సిద్ధాంతం తనదని చెప్పుకోలేదు. తనకు గురుతుల్యుడైన లుసిప్పస్ (క్రీ.పూ. 5వ శతాబ్దం) ప్రతిపాదించాడనీ, తను కేవలం ఆ అటమిక్ థియరీని వెలుగులోకి తెచ్చానన్నాడు. లుసిప్పస్ తత్వవేత్త. మెటాఫిజిక్స్ అటమిక్ థియరీ ఎవరిదైనా కావచ్చు. కానీ అది వాస్తవం! ఆనాడు డెమోక్రైటస్ ప్రభావం ఎపిక్యురస్ పైనే కాదు, ఆధునిక కాలపు కార్ల్ మార్క్స్‌పైనా ఉంది.



ఎపిక్యురస్



సోక్రటీస్

ఎపిక్యురస్‌కు కొంచెం అటు ఇటుగా దృష్టి సారిస్తే, మనకు మిలోస్‌కు చెందిన డయగోరస్, సైరిన్‌కు చెందిన థియడోరస్‌లు కనిపిస్తారు (క్రీ.పూ. 5వ శతాబ్దం) వీరిలో డయగోరస్ గ్రీకు కవి, హేతువాది. థియడోరస్ నాటి గ్రీకు గణిత శాస్త్రవేత్త. ఆయన పేరుతోనే 'స్పైరల్ ఆఫ్ థియడోరస్' అనే గణిత సూత్రం ఉంది.

పశ్చిమాన పరిస్థితి అలా ఉంటే, మన తూర్పు దేశాల్లో బౌద్ధం, జైనం, టోయిజం వంటివి వ్యాపించి విగ్రహారాధనను నిరసించాయి. డయగోరస్ తర్వాత– థియడోరస్, యుథిమిరస్ వెలుగులోకి వచ్చారు. గ్రీస్‌లో నిరీశ్వర వాదం ఆ రోజుల్లో పెద్ద నేరం! తత్త్వవేత్త సోక్రటీస్ (క్రీ.పూ. 399)కు శిక్ష పడింది కూడా ఆ విషయం గురించే! నాటి సమాజం గుడ్డిగా నమ్ముతున్న దేవుళ్ళను సోక్రటీస్ తిరస్కరించాడు. అతని ప్రభావంలో పడి యువత చెడిపోతోందని పాలకులు అతనికి మరణశిక్ష విధించారు. ఆ ఆ శిక్షను నింపాదిగా, నిబ్బరంగా స్వీకరించాడు.

ఫ్రెంచ్ విప్లవ నేపథ్యంలో యూరోప్‌లో హేతువాదం బాగా పుంజుకుంది. ఫ్రెంచ్ విప్లవ ప్రభావం యూరోప్ సమాజంపై బాగా పడిన తర్వాత, విశ్వాసానికి – విశ్వసనీయతకు ఘర్షణ జరిగింది. క్రైస్తవ రహిత సమాజం రూపుదిద్దుకోనారంభించింది.


అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 19వ శతాబ్దంలో వచ్చిన సామాజిక ఉద్యమాల వల్ల అక్కడి సమాజంలో 'స్వేచ్ఛాలోచన' బాగా స్థిరపడింది. కేంబ్రిడ్జి యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం 1917 రష్యా విప్లవం ప్రభావంతో సమాజంలో హేతువాదం బాగా పెరిగింది. అందువల్ల మార్క్సిస్టు – లెనినిస్టుల ప్రభుత్వం ఏర్పడింది.

సమాజంలో హేతుబద్ధత పెంచాలంటే, లక్షల సంఖ్యలో కార్యకర్తలు నడుం బిగించాలి. వేల సంఖ్యలో రచయితలు కలాలు పట్టాలి. అప్పుడు గానీ, వైజ్ఞానిక స్పృహ గల ప్రభుత్వాలు ఏర్పడవు. అమాయకులంతా మాయ మాటలు చెప్పే మోసగాళ్ళనే నమ్ముతారు. దీనికి పరిష్కారమెక్కడుందీ? వాస్తవాలు తెలుసుకోవడంలో ఉంది. నిజాల్ని జీర్ణించుకోవడంలో ఉంది.

వ్యాసకర్త సాహిత్య అకాడెమీ అవార్డ్ గ్రహీత

ముక్కలైన దేహానికి పాతికేళ్లు

పాటనే జీవితంగా మలుచుకొని చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించింది తెలంగాణ గానకోకిల బెల్లి లలిత. 1972 ఏప్రిల్ 29న భువనగిరిలో నిరుపేద కుటుంబంలో జన్మించింది. చదువులేని ఆమె పొట్టకూటి కోసం స్థానిక కాటన్ స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలిగా చేరింది. ఈ క్రమంలోనే సీఐటీయూలో సభ్యత్వం తీసుకొని కార్మిక హక్కుల సాధన కోసం పోరాడింది. అనంతరం 'భువనగిరి సాహిత్య మిత్ర మండలి'లో చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటను తన అస్త్రంగా మార్చుకుంది. 'తాగబోతే నీళ్ల లేవూ తుమ్మెదాలో... తడి గొంతూ లారిపాయే తుమ్మెదాలో!' అంటూ ఫ్లోరైడ్ నీటి సమస్యలపై గళమెత్తింది. 1996లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ 'తెలంగాణ ఐక్య వేదిక' ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 1997 మార్చి 8న భువనగిరిలో జరిగిన 'దగాపడ్డ తెలంగాణ' సభలో బెల్లి లలిత కీలక భూమిక పోషించింది. ఆ తర్వాత 1997 ఆగస్టు 11న బహుజన నేత మారోజు వీరన్న సూర్యాపేటలో నిర్వహించిన 'తెలంగాణ మహాసభ'తో పాటు 1997 డిసెంబర్ 28న వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో లలిత తన గానంతో గర్జన చేసింది. పీపుల్స్‌వార్ సానుభూతిపరుల 'తెలంగాణ జనసభ' అనుబంధ విభాగమైన 'తెలంగాణ కళా సమితి' కన్వీనర్‌గా ఊరూరా తిరిగి ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత వివరించింది.



బెల్లి లలిత

తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉధృతం అవుతుండటం ఆనాటి సమైక్య పాలకులు జీర్ణించుకోలేకపోయారు. అప్పటికే ప్రజా గాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిపి, బహుజన నేత మారోజు వీరన్నను పొట్టన పెట్టుకున్నారు. ఈ తరుణంలో1999 మే 26న ఇంటి నుండి వెళ్ళిన లలిత తిరిగిరాలేదు. 1999 మే 29న దర్గాబావిలో శరీర భాగాలు ఉన్నాయన్న వార్తతో భువనగిరి ఉలిక్కి పడింది. పదమూడు రోజులు గాలించగా పలు బావులు, చెరువుల్లో 17 ముక్కలైన లలిత శరీర భాగాలు లభ్యమయ్యాయి. 1999 జూన్ 11న జరిగిన అంత్యక్రియలకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. నాటి పాలకులే... మాజీ నక్సలైట్‌ను ఆయుధంగా మార్చుకొని లలితను పాశవికంగా హత్య చేయించారని ప్రజా సంఘాలు నిరసించాయి. ఆరు దశాబ్దాల ఆకాంక్షకై 17 ముక్కలైన లలిత అమరత్వానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ కనీస గౌరవం దక్కలేదు.

– పి. నరేష్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి

(నేడు బెల్లి లలిత 25వ వర్ధంతి)

ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు

- డీఎస్పీని చెట్టుకు కట్టేస్తానన్న వ్యాఖ్యలపై దళిత సంఘాల ఫిర్యాదు



చీరాల: బాపట్ల జిల్లా చీరాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణ మోహన్‌పై చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను 'చెట్టుకు కట్టేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్తా మన్న' వ్యాఖ్యలపై దళిత సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. నాయుడు నాగార్జునరెడ్డి, తేళ్ల రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమంచిపై చర్యలకు ఈసీ ఆదేశాలివ్వడంతో వన్‌టౌన్ ఎస్‌ఐ వేమన కేసు నమోదు చేశారు.

కవులు, కళాకారులను విడుదల చేయాలి

- ప్రజానాట్యమండలి నేత పెంచలయ్య డిమాండ్



తిరుపతి కల్చరల్: దేశవ్యాప్తంగా తమ కలాలను, గళాలను సమాజహితం కోసం ప్రజాతంత్ర పద్ధతిలో వినియోగిస్తున్న కవులు, కళాకారులు, రచయితలపై పాలకులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి నిర్బంధంలో ఉన్నవారందరినీ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి (ఇఫ్టా) 81వ వార్షికోత్సవం, 'రెడ్‌స్టార్' మాదాల రంగారావు 76వ జయంతి వేడుకలను శనివారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పెంచలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న కవులు, కళాకారులు, రచయితలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపా వంటి చట్టాలను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కవులు, కళాకారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, టి.జనార్ధన్ పాల్గొన్నారు.

సిరుల విరులు.. కొండ చీపుర్లు

ఏజెన్సీలోని కొండ ప్రాంతాల్లో విస్తృతంగా చీపురు గడ్డి పెంపకం



- అడవుల్లోని ఆర్వోఎఫ్ఆర్, పోడు భూముల్లో సాగు
- బీడు వారిన భూములు సైతం గడ్డి సాగుతో వినియోగంలోకి..
- గిరిజన సమూహాల జీవనోపాధికి ఊతం
- నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్‌తో ప్రోత్సహిస్తే మరింత ప్రయోజనం
- ఆంధ్రప్రదేశ్ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ నివేదిక



సాక్షి, అమరావతి: మనం ఇళ్లల్లో ఉపయోగించే మెత్తని గడ్డి మాదిరిగా ఉండే కొండ చీపుర్లు గిరిజనులకు జీవనోపాధిగా మారాయి. కొండ చీపురు గడ్డి పెంపకంతో రాష్ట్రంలోని వేలాది గిరిజన కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 'కొండ చీపురుతో ఊడ్చేద్దాం' అనే నినాదంతో వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా గిరిజనుల జీవనోపాధిని మరింత మెరుగుపరచవచ్చని నివేదికలో తెలిపింది.

మన ప్రాంతానికి వలసజాతే..!

మన ప్రాంతానికి వలసవచ్చిన చీపురు గడ్డి జాతులను వృక్షశాస్త్రంలో 'థైసనోలెనా మాక్సిమా', 'థైసనోలెనా లాటిఫోలియా'గా పిలుస్తారు. ఈ తరహా గడ్డి జాతులు హిమాలయాల్లోని ఎత్తయిన ప్రాంతాలు, తూర్పు కనుమల్లో ఎక్కువగా పెరుగుతాయి. మేఘాలయ, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర, సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లో ఈ గడ్డి జాతులు ఎక్కువగా కనిపిస్తాయి. అలాగే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతంలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, సీతంపేట, భామిని, కొత్తూరు, కుమారాడ, కురుపాం, గుమ్మ లక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరు, మక్కువ, పాచిపెంట తదితర మండలాల పరిధిలో ఈ చీపురు గడ్డి సాగు ద్వారా వేలాది మంది గిరిజనులు ఉపాధి పొందుతున్నారు.

ఎకరాకు రూ.50 వేలకు పైగా ఆదాయం

ఎటువంటి సాగుకు ఉపయోగించని భూములను చీపురు గడ్డి పెంపకానికి గిరిజనులు వినియోగిస్తున్నారు. ఒక్కో చీపురును కనీసం రూ.35 నుంచి రూ.70 వరకు అమ్ముతుంటారు. ఒక ఎకరాలో చీపురు గడ్డి సాగు చేసిన గిరిజన కుటుంబానికి ఎకరాకు కనీసం రూ.50 వేల ఆదాయం వస్తోంది. చీపురు సాగు, చీపురు నేసే పద్ధతి తదితరాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే వారి జీవనోపాధిని మరింత మెరుగుపరచవచ్చని ఆంధ్రప్రదేశ్ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ నివేదికలో స్పష్టం చేసింది.

ఒకసారి నాటితే.. ఇరవై ఏళ్లకు పైగా ఆదాయం

ఎత్తయిన కొండవాలు ప్రాంతాలు ఈ చీపురు గడ్డి సాగుకు అనుకూలం. సముద్ర మట్టానికి కనీసం 1,500 అడుగుల నుంచి గరిష్టంగా 5 వేల అడుగుల ఎత్తులో ఉండే అటవీ భూములు ఈ గడ్డి సాగుకు దోహదం చేస్తున్నాయి. ఐదు అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు పెరిగే ఈ చీపురు గడ్డి సాగు వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల తరబడి బీడు వారిన పోడు భూములు వినియోగంలోకి వస్తున్నాయి. భూమి కోతను నివారించడంతో పాటు భూసారాన్ని కూడా కాపాడుతోంది. అలాగే ఈ గడ్డి సాగు పర్యావరణ హితంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా గిరిజనుల ఉపాధికి ఊతమిస్తోంది. హుకుంపేట, పెదబయలు, సీతంపేట, మారేడుమిల్లి తదితర మండలాల్లోని ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూములు, అటవీ పోడు భూముల్లో సాగవుతున్న చీపురు గడ్డిపై ఏపీ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అధ్యయనం చేసింది. ఈ సాగు ద్వారా ఆ మండలాల్లోని పలు గ్రామాల్లో 232 ఎకరాల్లో 300కు పైగా గిరిజన కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని తెలిపింది. ముఖ్యంగా అత్యంత బలహీన గిరిజన సమూహాలు(పీవీటీజీ)లకు చెందిన మూకదొర, బగత, కొండ దొర, సవర, కొండ రెడ్డి వంటి తెగలు ఉపాధి పొందుతున్నాయని నివేదికలో పేర్కొంది. కొండ చీపురుకు ఉపయోగించే గడ్డి రకాలను ఒకసారి నాటితే 20 ఏళ్లకుపైగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపింది.

పద్మావతి, కామాక్షితాయి అమ్మవార్ల సేవలో 'సుప్రీం' న్యాయమూర్తి



తిరుచానూరు ఆలయం వెలుపల కుటుంబ సభ్యులు, అధికారులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్

చంద్రగిరి(తిరుపతి జిల్లా)/బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈఓ రమేశ్ బాబు స్వాగతం పలికారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మధు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ రవికుమార్ శ్రీవారి మెట్టు నడక మార్గంలో రాత్రి 9.30 గంటలకు తిరుమల చేరుకున్నారు.

కామాక్షితాయి సన్నిధిలో జస్టిస్ రవికుమార్

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం మండలం, జొన్నవాడలోని స్వయంభూ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. జిల్లా దేవదాయశాఖాధికారి జంజనం శ్రీనివాసరావు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. లక్ష్మీ గణపతిస్వామి, మల్లికార్జునస్వామి, శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏ రంగంలోనూ మహిళల ముందంజ

ఐసీఏఐ దక్షిణ భారత ప్రాంతీయ మండలి చైర్‌పర్సన్ గీతా ఏబీ



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు లేని రంగం ఏదీ లేదని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) దక్షిణ భారత ప్రాంతీయ మండలి చైర్‌పర్సన్ గీతా ఏబీ అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీఏ నేషనల్ కాన్ఫరెన్స్-2024లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ ప్రవేశించి అగ్రస్థానంలో నిలుస్తున్నారన్నారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషుల కంటే ఎక్కువగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. చార్టర్డ్ అకౌంటెంట్ రంగంలో కూడా మహిళలు ఉత్తమ సేవలు అందిస్తున్నారని, మరింత ఎక్కువ మంది యువతులు ఈ రంగంలోకి రావాలని సూచించారు.

ఐసీఏఐ కేంద్ర కౌన్సిల్ సభ్యుడు, ప్రోగ్రాం డైరెక్టర్ డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సీఏలు వృత్తి ధర్మాన్ని పాటిస్తూనే దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారన్నారు. సీఏ గిరీష్ అహుజా (న్యూఢిల్లీ), వి.రామ్‌నాథ్ (కోయంబత్తూరు), సీఏ సుధీర్, ధారా అషీస్ గాంధీ (ముంబై) ఎం.పీ.వి జయ్‌కుమార్ (చెన్నై) తదితరులు వివిధ అంశాలపై సీఏలకు అవగాహన కల్పించారు. ఒత్తిడిని తగ్గించుకొని పని సామర్థ్యాన్ని పెంచుకోవడం ఎలా అనే అంశంపై ఇస్కాన్ ప్రతినిధులు దేవమిరా దాస్, చక్రధరి దాస్ వివరించారు.

ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ మాట్లాడుతూ తమ బ్రాంచ్ తరఫున నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఐసీఏఐ తరఫున సీఏ కోర్సు చదువుతున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, సాంకేతిక పరమైన అంశాల్లో శిక్షణ తరగతులతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను తమ బ్రాంచ్ తరఫున నిర్వహించామని వివరించారు. ఐసీఐఏ విజయవాడ కార్యదర్శి జయంత్ ఉప్పులూరి, ఉపాధ్యక్షుడు కె.నారాయణ, కోశాధికారి మనీష్ కుమార్ జైన్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీఏలు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీఏఐ సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ నటరాజ్, బీసీసీఐ కార్యదర్శి జై షా

తిరుమల: తిరుమల శ్రీవారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.నటరాజ్, బీసీసీఐ కార్యదర్శి జై షా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు, మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ

యూఏఈ కొత్త షరతు

- విదేశీయులు ఏర్పాటు చేసే కంపెనీల్లో తమ దేశ పౌరులకు ఉద్యోగాలు కచ్చితంగా ఇవ్వాలనే నిబంధన
- జూన్ నెలాఖరులోగా ఈ నిబంధన అమలులోకి తీసుకు రావాలని ఆదేశం

మోర్తాడ్(బాల్కొండ): విదేశీ వలస కార్మికులకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలను కల్పించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) తమదేశ పౌరుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడానికి కొత్త షరతు విధించింది. తమ దేశంలో కంపెనీలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్న విదేశీయులు యూఏఈ పౌరులకు ఉద్యోగ అవకాశాలను అందించాలనే నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. విదేశాలకు చెందిన 50 మంది కార్మికులు ఉంటే తమ దేశ పౌరుడు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని యూఏ ఈ ప్రభుత్వం ఆదేశించింది. ఈ కొత్త నిబంధనను జూన్ నెలాఖరులోగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. విదేశీ వలస కార్మికులకు వేతనం ఎంత ఇస్తున్నా తమకు సంబంధం లేదని, తమ పౌరునికి మాత్రం 3 వేల ధరమ్స్ మన కరెన్సీలో రూ.60 వేల వరకు జీతం ఇవ్వాల్సిందే అని తీర్మానించింది. యూఏఈ పరిధిలోని దుబాయ్, షార్జా, అబు దాబీ తదితర ప్రాంతాల్లో తెలంగాణ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దాదాపు 500 కంపెనీలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా మ్యాన్ పవర్ సప్‌లైయింగ్ కంపెనీలు ఉన్నాయి. వీటితోపాటు సొంతంగా కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, వ్యాపార సంస్థలను నిర్వహిస్తున్నవారు ఉన్నారు. విదేశీ వలస కార్మికుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని యూఏఈ పౌరులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే రాను రాను ఎక్కువ ఉద్యోగాలు అక్కడి వారికే ఇవ్వాల్సి ఉంటుందని దుబాయ్‌లోని తెలుగువ్యాపారి ఎస్‌వీ రెడ్డి వెల్లడించారు. ఒమాన్, కువైట్ దేశాల తరహాలో యూఏఈ తమ దేశ పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తుందని ఇందులో భాగంగానే కొత్త నిబంధన అమలులోకి తెచ్చిందన్నారు.

తొమ్మిదేళ్ల బాలికతో దేవదేవుని వివాహం

- రాయదుర్గంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం
- వైభవంగా శ్రీప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



పసుపు కొమ్ముతో ఉన్న మంగళసూత్రాన్ని బాలిక మెడలో కడుతున్న తల్లి

రాయదుర్గంటౌన్: అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో శ్రీప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి కల్యాణం తొమ్మిదేళ్ల బాలికతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి ఇక్కడ కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా అరవ తెగకు చెందిన బాలికతో దేవదేవుని కల్యాణం జరిపించారు. స్వామి వారిని వివాహమాడిన ఆ బాలికకు సుగుణ సంపన్నుడైన భర్త లభిస్తాడని భక్తుల నమ్మకం. ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మశాలి వంశం అరవ తెగకు చెందిన బాలికతో శ్రీవారికి పెళ్లి చేసే సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది. ఈ ఏడాది రాయదుర్గం పట్టణానికి చెందిన అరవ రమేష్, జయమ్మ దంపతుల కుమార్తె మౌనికతో శ్రీవారి వివాహం జరిపించారు. పెళ్లి పెద్దలుగా శ్రీవారి తరఫున బ్రాహ్మణులు, ఆలయ పాలక కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు వ్యవహరించారు. శనివారం ఉదయం మేళతాళాలతో పెళ్లి కూతురు అయిన పద్మావతి (మౌనిక)ని ఊరేగింపుగా మార్కండేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పెళ్లికూతురిని అలంకరించి కోటలోని శ్రీవారి సన్నిధి వరకు ఊరేగింపుగా తెచ్చారు. అనంతరం శ్రీవారి ఉత్సవ విగ్రహం ముందు కూర్చోబెట్టారు. వేద మంత్రోచ్ఛారణ మధ్య వివాహం జరిపించారు. అభిజిత్ లగ్న శుభపుష్కరాంశమునందు పురోహితులు మంగళసూత్రాన్ని బాలిక మెడకు తాకించి శ్రీవారి పక్కనే ఉన్న పద్మావతి ఉత్సవ విగ్రహానికి కట్టారు. పసుపు కొమ్ముతో ఉన్న మంగళసూత్రాన్ని బాలిక మెడలో తల్లి కట్టడంతో పెళ్లితంతు ముగిసింది.

ఏసీబీ వలలో రావులపాలెం సీఐ


తక్కువ సెక్షన్ల నమోదుకు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆంజనేయులు



రావులపాలెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం టౌన్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ డి.శ్రీహరిరాజు కథనం ప్రకారం.. గత నెల 16న రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కోడిపందాల కేసు నమోదు చేశారు. మండలంలోని పొడగట్లపల్లిలో నిర్వహించిన కోడిపందాలపై పోలీసులు దాడి చేసి, అప్పట్లో పలువురిని అరెస్టు చేశారు. కొన్ని వాహనాలను, కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కోడిపందాలు నిర్వహించిన స్థల యజమాని కుంచెర్లపాటి లక్ష్మణరాజు నుంచి సీఐ ఆంజనేయులు అప్పట్లో కొంత మొత్తం లంచంగా తీసుకున్నాడు. అనంతరం చార్జిషీటులో తక్కువ సెక్షన్లు నమోదు చేసేందుకు, లక్ష్మణరాజుపై రౌడీ షీట్ తెరవకుండా ఉండేందుకు మరో రూ.50 వేలు లంచం ఇవ్వాలని పలుమార్లు డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన లక్ష్మణరాజు రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల పథకం ప్రకారం సీఐ ఆంజనేయులుకు లక్ష్మణరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం రూ.50 వేలు లంచం ఇచ్చాడు. ఆ మొత్తాన్ని తీసుకుంటున్న సీఐ ఆంజనేయులును అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు.

మల్లన్న సేవలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



స్వామి అమ్మవార్ల జ్ఞాపికను సీఎం దంపతులకు అందజేస్తున్న వేదపండితులు

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంట చేరుకున్న ఆయన శ్రీశైలంలోని వీఐపీ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ నుంచి నేరుగా స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి ప్రధాన రాజగోపురం వద్దకు రాగా, ఆలయ అర్చకులు వేద పండితులు ఆహ్వానం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఆశీర్వచనాలు పలికి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో ఛత్రపతి శివాజీకి ఖడ్గ ప్రదానం చేసిన అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు. దర్శనానంతరం మోహన్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ సనాతన ధర్మం సంస్కృతి, సంప్రదాయాలలో భారతదేశం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు సున్నిపెంట నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. నంద్యాల ఏడీఎస్పీ ప్రవీణ్ కుమార్, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ప్రసాద రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

మోదీ సర్కారుకు ఎన్నికల కమిషన్ అనుకూలం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపణ



పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలను ఎన్నికల కమిషన్ పారదర్శకంగా నిర్వహించలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం పాడేరు వచ్చిన ఆయన స్థానిక వీఆర్ కల్యాణ మండపంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేసిందని ఆరోపించారు. ప్రధాని మోదీకి మేలు చేసేలా ఎన్నికల యంత్రాంగం వ్యవహరించిందని, ఎన్నికలు జరిగి పదిరోజులు కావస్తున్న బూత్‌ల వారీగా ఓటింగ్ శాతాన్ని కమిషన్ ప్రకటించకపోవడం సరికాదన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశం కల్పించలేదని, ఎన్నికల సందర్భంగా బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ త్వరగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవెంట్ మేనేజ్‌మెంట్ అవకాశాలపై 31న సదస్సు

50 కేటగిరీల్లో ప్రతిభావంతులకు అవార్డులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీసీఈఐ ప్రతినిధులు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 31న అంతర్జాతీయ ఈవెంట్ మేనేజర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(ఏపీసీఈఐ) రాష్ట్ర అధ్యక్షుడు వి.రవిశంకర్ తెలిపారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో అవకాశాలపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహక కమిటీ కన్వీనర్ హరీష్ రవ్వ మాట్లాడుతూ నేటి సమాజంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగం ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యువతకు ఈవెంట్ రంగం పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం ఉంటుందని, అందులో భాగంగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశామన్నారు. ముంబై, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఈవెంట్ మేనేజర్లు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాస్టర్ క్లాస్ ఉంటుందన్నారు. అనంతరం ఈవెంట్ సంబంధిత 50 కేటగిరిలకు చెందిన ప్రతిభావంతులను ఎంపికచేసి వారికి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఏపీసీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.వి.జయశంకర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎం.గుప్తా, ఈవెంట్ కో కన్వీనర్ ప్రదీప్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య!?

- కుటుంబ కలహాలతో అఘాయిత్యం
- రాజమహేంద్రవరంలో ఘటన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కుటుంబ కలహాల కారణంగా అనుమానాస్పద పరిస్థితుల్లో దంపతులు మృతిచెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే, సంఘటనా స్థలంలో ఆధారాలను బట్టి భార్యను ముందు చంపి ఆ తర్వాత భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వివరాలు ఏమిటంటే..కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన శ్రీధర్ (28)కు, అదే జిల్లా ప్రత్తిపాడుకు చెందిన దేవి (22)కి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు. తాపీ పనిచేసుకునే శ్రీధర్‌కు ఏడాది కిందట ప్రమాదం జరగడంతో వేరొకరిపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. భార్య దేవికి ఫిట్స్ ఉన్నాయి. వీరిద్దరూ తరచూ ఘర్షణ పడేవారు. ఈ నేపథ్యంలో భార్య దేవి నెలరోజుల కిందట పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను కాపురానికి తీసుకొచ్చేందుకు శ్రీధర్ వారం కిందట అత్తారింటికి వెళ్లాడు. పిల్లలను ప్రత్తిపాడులో వదిలేసి భార్యాభర్తలిద్దరూ కలిసి ఆనంద్‌నగర్‌లోని ఇంటికి శనివారం ఉ.10.30 గంటలకు వచ్చారు. వస్తూ శ్రీధర్ తన వెంట మద్యం బాటిల్ తెచ్చుకున్నాడు. అప్పటినుంచి మధ్యాహ్నం వరకూ తలుపువేసి ఉండడం, ఇంటి లోపలకు వెళ్లిన వారు బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వారు తలుపులు ఎంత తట్టినా తీయలేదు. ఇంటి వెనుక వైపు నుంచి వెళ్లి తలుపులు తీసి చూడగా భార్యాభర్తలిద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. దీంతో ఈ విషయాన్ని మూడో పట్టణ పోలీసులకు తెలిపారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భార్య మెడకు చున్నీ ఉండడం, ఆమె కింద పడిపోయి ఉండడంతో ఆమెను చంపి, శ్రీధర్ ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- వాటి విలువ రూ.40 లక్షలు
- నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి మంగళం: ఎర్ర స్మగ్లర్లు అక్రమంగా తరలిస్తున్న 16 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు ఒక టెంపో ట్రావెల్, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు శనివారం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు చెప్పారు. ఈ మేరకు వివరాలు.. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ(రిజర్వు) కె.సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేఎస్కే లింగాధర్, కే.సురేష్‌బాబు టీమ్‌లు శుక్రవారం సాయంత్రం తిరుపతి నుంచి రాపూరు వరకు లోడింగ్, డంపింగ్ పాయింట్లను తనిఖీ చేస్తున్నారు. పెంచలకోన రాపూరు నుంచి ఎగువపల్లి అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున రెండు వాహనాలు అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడకు చేరుకున్నారు. వాహనాల్లో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండంతో వారిని చుట్టు ముట్టారు. అయితే అందులో కొందరు పారిపోగా నలుగురిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారు తమిళనాడు తిరువన్నామలైకు చెందిన అన్బళగన్ (41), చిత్తూరు టౌన్ కు చెందిన అసిఫ్ బాషా (21),ముత్తు (33), సెల్వం (30)లుగా గుర్తించారు. వీరిపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఎస్ఐ సీహెచ్ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. వీటి విలువ రూ.40 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పంజాబ్‌లో చతుర్ముఖం

13 స్థానాలకు జూన్ 1న పోలింగ్

- విడిగా పోటీ చేస్తున్న ఆప్, కాంగ్రెస్
- వాటితో పాటు బీజేపీకీ ప్రతిష్టాత్మకమే

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పెద్దగా రాణించని రాష్ట్రాల్లో పంజాబ్ ఒకటి. 13 లోక్‌సభ స్థానాల్లో ఎనిమిది కాంగ్రెస్ హస్తగతం కాగా బీజేపీ రెండింటికే పరిమితమైంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అద్భుత విజయంతో గద్దెనెక్కింది. దాన్ని లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని ఆశ పడుతోంది. దాంతో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా ఒంటరిగానే బరిలో దిగింది. అకాలీదళ్ దూరమవడంతో బీజేపీ కూడా సొంతంగానే పోటీ చేస్తోంది. దాంతో రాష్ట్రంలో చతుర్ముఖ పోరు నెలకొంది. ఆప్, బీజేపీ పోటీని తట్టుకుని సిట్టింగ్ స్థానాలను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు సవాలే...

- సాక్షి, నేషనల్ డెస్క్



జలంధర్

కాంగ్రెస్‌కే గాక ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ సీఎం చరణ్‌సింగ్ చన్నీకి సైతం ఇక్కడ గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. 2009, 2014, 2019ల్లో ఇక్కడ కాంగ్రెస్ వరుసగా గెలిచింది. 2023 ఉప ఎన్నికలో ఆప్ నేత సుశీల్‌కుమార్ రింకు నెగ్గారు. ఇప్పుడాయన బీజేపీ అభ్యర్థిగా పోటీలోకి దిగడం విశేషం! ఆప్ నుంచి పవన్‌కుమార్ టిను, అకాలీదళ్ నుంచి మొహింద్ సింగ్ బరిలో ఉన్నారు. బీఎస్పీ, సీపీఎం, అకాలీదళ్ (అమృత్‌సర్) కూడా పోటీ చేస్తున్నాయి. జలంధర్‌లో కాంగ్రెస్ ఏకంగా 13సార్లు ఇక్కడ గెలవడం విశేషం!

గురుదాస్‌పూర్

ఇక్కడా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే! సిట్టింగ్ ఎంపీ, బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ స్థానంలో దినేశ్ సింగ్ బబ్బుకు బీజేపీ టికెటిచ్చింది. అకాలీదళ్ అండ లేకపోవడం పార్టీకి ప్రతికూలం. మోదీపైనే బీజేపీ భారం వేసింది. కాంగ్రెస్ నుంచి సుఖ్‌జిందర్ సింగ్ రాంధ్వ, ఆప్ నుంచి అమన్‌షేర్ సింగ్ కల్సి, అకాలీదళ్ తరఫున దల్జీత్‌సింగ్ చీమ పోటీలో ఉన్నారు. అకాలీదళ్ (అమృత్‌సర్) సైతం అభ్యర్థిని పోటీకి పెట్టింది.

పటియాలా

మాజీ సీఎం అమరిందర్‌సింగ్ భార్య ప్రణీత్ కౌర్ ఇక్కడ పోటీలో ఉన్నారు. 2019 ఇక్కడ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ప్రణీత్ ఈసారి బీజేపీ టికెట్‌పై బరిలో దిగడం విశేషం. ఆప్ నుంచి దల్బీర్ సింగ్, అకాలీదళ్ తరఫున నరీందర్ కుమార్ శర్మ, కాంగ్రెస్ నుంచి ధరంవీర్ గాంధీ పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ప్రణీత్, ధరంవీర్ మధ్యే నెలకొంది. సంప్రదాయంగా కాంగ్రెస్‌కే మద్దతిచ్చే ఇక్కడి ఓటర్లకు నచ్చజెప్పి బీజేపీకి ఓటేయించడం ప్రణీత్, అమరీందర్‌లకు సవాలుగా మారింది. ఆమె ఫిరాయింపుదారు అంటూ రైతులు నిరసన తెలుపుతుండటం తలనొప్పిగా మారింది. అయితే గణనీయంగా ఉన్న హిందూ ఓటర్లపై అమరీందర్ దంపతులు ఆశలు పెట్టుకున్నారు.

అమృత్‌సర్

ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా, బీజేపీ నుంచి తరణ్‌జిత్ సింగ్ సంధు బరిలో ఉన్నారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి సంధు ఇటీవలే బీజేపీలో చేరారు. రాష్ట్రంలో 22 శాతం మేర ఉన్న జాట్ సిక్కు వర్గానికి చెందిన వ్యక్తి. ప్రచారంలోనూ దూసుకెళ్తున్నారు. కెప్టెన్ అమరిందర్ సింగ్ చేరిక బీజేపీకి సానుకూలాంశం. ఆప్ నుంచి మంత్రి కులదీప్ సింగ్ దలైవాల్ రంగంలో ఉన్నారు.

ఆనంద్‌పూర్ సాహిబ్

కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మనీశ్ తివారీ బదులు విజయ్ ఇందర్ సింగ్లా బరిలో ఉన్నారు. ఆప్ నుంచి మాల్వీందర్ సింగ్, అకాలీదళ్ తరఫున ప్రేమ్‌సింగ్ చందూమజ్రా, బీజేపీ తరఫున సుభాష్ శర్మ పోటీ చేస్తున్నారు. బీఎస్పీ, అకాలీదళ్ (అమృత్‌సర్) సైతం పోటీలో ఉన్నాయి. ఇక్కడ 2014లో గెలిచిన అకాలీదళ్ నేత ప్రేమ్‌సింగ్ 2019లో ఓటమి పాలయ్యారు.

లుధియానా

పంజాబ్‌లో ముఖ్యమైన పారిశ్రామిక ప్రాంతం. ఒకప్పుడు కాంగ్రెస్–అకాలీదళ్ మధ్యే పోటీ ఉండేది. 2014, 2019ల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన మాజీ సీఎం బియాంత్ సింగ్ కుమారుడు రవనీత్ సింగ్ బిట్టు ఈసారి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు! 65.96 శాతం మంది హిందువులుండటం బీజేపీకి అనుకూలిస్తుందని భావిస్తున్నారు. దాంతో కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ బరిలో దిగారు. ఆప్ నుంచి అశోక్ పరాశర్ పప్పీ, అకాలీదళ్ తరఫున రంజిత్ సింగ్ ధిల్లాన్ బరిలో ఉన్నారు. అకాలీదళ్ (అమృత్‌సర్)తో పాటు పలువురు స్వతంత్రులూ గట్టి పోటీ ఇస్తున్నారు.

పోలింగ్ జరగనున్న లోక్‌సభ స్థానాలు...

అమృతసర్, గురుదాస్‌పూర్, ఖదూర్‌సాహిబ్, హోషియార్‌పూర్, జలంధర్, ఆనందపూర్ సాహిబ్, లుధియానా, ఫతేగఢ్ సాహిబ్, ఫరీద్‌కోట్, ఫిరోజ్‌పూర్, భటిండా, సంగ్రూర్, పాటియాలా

రాజస్తాన్‌లోని ఫలోదీలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత

ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారి

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో ఎండలు మండిపోతున్నాయి. ప్రధానంగా రాజస్తాన్‌లో ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. రాజస్తాన్‌లోని ఫలోదీలో తాజాగా 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. దేశంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత రికార్డు కావడం ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 2019 జూన్ 1న రాజస్తాన్‌లోని చురూలో 50.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హిమాలయ రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు ఈశాన్యంలోని అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ ఎండల ధాటికి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాజస్తాన్‌లోని బార్మర్‌లో 48.8, జైసల్మేర్‌లో 48, బికనెర్‌లో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో 40.5 డిగ్రీలు, అస్సాంలోని సిల్చార్‌లో 40, లుమిడింగ్‌లో 43, అరుణాచల్‌లోని ఈటానగర్‌లో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ముస్లింల ఓట్ల కోసం 'ముజ్రా'

'ఇండియా' కూటమిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

- రిజర్వేషన్లు కాజేయాలని చూస్తే సహించబోనని హెచ్చరిక
- బిహార్, ఉత్తరప్రదేశ్‌లో మోదీ ఎన్నికల ప్రచారం

పాటలీపుత్ర/ఘాజీపూర్: విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. విపక్ష కూటమి బానిసగా మిగిలిపోయిందని, ముస్లిం ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి ముజ్రా(వేడుకల్లో అతిథులను అలరించడానికి చేసే నృత్యం) చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కోవడానికి ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటానని తేల్చిచెప్పారు. రిజర్వేషన్ల జోలికి వస్తే సహించబోనని హెచ్చరించారు. శనివారం బిహార్‌లోని పాటలీపుత్ర, కారాకాట్, బక్సర్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. ప్రతిపక్షాలు పొరుగు దేశాన్ని చూపించి మనల్ని బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడడం లేదని, పాకిస్తాన్ ప్రయోజిత



ఉగ్రవాదాన్ని, అవినీతిని, నక్సలైట్ల హింసాకాండ అంతం చేయడానికి కృషి చేస్తున్నానని చెప్పారు. సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటానికి బిహార్ కొత్త దిశను ఇచ్చిందని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

కోర్టులు కూడా జోక్యం చేసుకోలేవు

''పంజాబ్, తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు, తమిళనాడులో డీఎంకే నేతలు, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు బిహార్ వలస కూలీలను దూషిస్తూ మాట్లాడారు. తద్వారా బిహారీలను కించపర్చారు. బిహారీలను అవమానిస్తే కనీసం నిరసన తెలిపే ధైర్యం ఆర్జేడీకి లేకుండాపోయింది. ఆర్జేడీ నాయకులకు లాంతర్ పట్టుకొని ముజ్రా డ్యాన్స్ చేయడం తప్ప ఇంకేమీ తెలియదు. ఓటు జిహాద్‌కు పాల్పడుతున్నవారిపై విపక్షాలు ఆధారపడుతున్నాయి, వారి మద్దతు పొందుతున్నాయి.

ఎన్నికల ఫలితాల తర్వాత చొక్కాలు చించేసుకుంటారు

మన సైనికులు 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' పొందకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాతే సైనికులకు మేలు జరిగింది. పనులు ఆలస్యం చేయడంతో, హక్కులు లాక్కోవడంలో కాంగ్రెస్ ఆరితేరింది. 'ఇండియా' కూటమి ఓటమి దిశగా పయనిస్తోంది. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విపక్ష నాయకులు పరస్పరం చొక్కాలు చించేసుకుంటారు. ఎన్నికల్లో ఓటమికి రాజకుటుంబం(సోనియా గాంధీ కుటుంబం) కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను బాధ్యుడిని చేస్తుంది. అనంతరం విదేశాలకు విహారానికి వెళ్లిపోతుంది. విపక్ష కూటమి ఒక గాలిబుడగ. అది ఇప్పటికే పేలిపోయింది'' అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు.

ఇంత దారుణంగా మాట్లాడిన ప్రధాని

దేశ చరిత్రలోనే లేరు: ప్రియాంక

న్యూఢిల్లీ/గోరఖ్‌పూర్(యూపీ): ప్రతిపక్ష ఇండియా కూటమినుద్దేశించి 'ముజ్రా'అంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా మండిపడ్డారు. ఇంత దారుణంగా మాట్లాడిన ప్రధానమంత్రి దేశ చరిత్రలోనే లేరని పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి పదవిని దేశం యావత్తూ గౌరవిస్తుంది. అటువంటి పదవికున్న ఔన్నత్యాన్ని కాపాడండి'అని మోదీకి హితవు పలికారు. యూపీలోని గోరఖ్‌పూర్‌లో శనివారం ఆమె మాట్లాడారు. 'బిహార్‌లో ప్రధాని మోదీ ఏమన్నారో విన్నారా? దేశ చరిత్రలోనే అటువంటి భాషను వాడిన ప్రధాని మరొకరు లేరు. అటువంటి మాటలు ప్రధాని నోట రాకూడదు. సహనం కోల్పోయిన మోదీ దేశానికి, దేశ ప్రజలకు ప్రతినిధిననే విషయం మర్చిపోతున్నారు. ఆయన అసలు రూపం బట్టబయలైంది'అని ప్రియాంక అన్నారు. 'దేశమే తన కుటుంబమని చెప్పుకుంటున్న వ్యక్తి అనాల్సిన మాటలు కావవి. కుటుంబసభ్యులు పరస్పరం గౌరవించుకోవాలి. ఎప్పటికీ అది అలాగే కొనసాగాలి' అని ప్రియాంక అన్నారు.

ఎలక్షన్ బీట్

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ గణాంకాలు

- వెబ్‌సైట్‌లో పొందుపర్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- తొలి ఐదు దశల పోలింగ్‌లో 65.46 శాతం ఓటింగ్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక ఓటర్లు ఉన్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలుస్తోంది. దేశంలో 96.88 కోట్ల మంది అర్హులైన ఓటర్లున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆరు దశల పోలింగ్ ముగిసింది. మొదటి ఐదు దశాల పోలింగ్‌కు సంబంధించి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా గణాంకాలను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం వెల్లడించింది. ఏయే నియోజకవర్గంలోఎంతమంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ఓటు వేశారు? ఓటింగ్ శాతం ఎంత నమోదైంది? అనే వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. తొలి ఐదు దశల్లో 429 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఆయా స్థానాల్లో మొత్తం 76.41 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 50.72 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలియజేసింది. అంటే మొదటి ఐదు దశల పోలింగ్‌లో సగటున 65.46 శాతం ఓటింగ్ నమోదైనట్లు స్పష్టమవుతోంది. పోలింగ్ బూత్‌లవారీగా మొత్తం ఓటర్లు, ఓటు వేసినవారి సంఖ్య, నమోదైన ఓటింగ్ శాతం వంటి సమాచారం ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమంటూ సుప్రీంకోర్టు వెల్లడించిన మరుసటి రోజే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలను ఈసీ బయటపెట్టడం గమనార్హం. ఇవి కచ్చితమైన గణాంకాలని, ఇందులో ఎలాంటి మార్పులు చేర్పులు చేయడానికి వీలుండదని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలో ఓట్లను భద్రపర్చడం పూర్తి పారదర్శకంగా జరిగిందని వెల్లడించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారైన తర్వాత నియోజకవర్గంలోని మొత్తం ఓటర్ల తుది జాబితాను ఆ అభ్యర్థులకు అందజేసినట్లు పేర్కొంది. ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతం వివరాలు తమ యాప్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఓటింగ్ శాతం గణాంకాలను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం జరగడం లేదని తేల్చిచెప్పింది. ఎన్నికల్లో ప్రతి దశలో అత్యున్నత స్థాయి పారదర్శకత పాటించేందుకు కట్టుబడి ఉన్నట్లు వివరించింది. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం తెలిపారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు.

దశల వారీగా పోలింగ్ గణాంకాలు

దశ	లోక్‌సభ స్థానాలు	మొత్తం ఓటర్లు	ఓటు వేసినవారు	ఓటింగ్ శాతం
1	102	16.64 కోట్లు	11 కోట్లు	66.14
2	88	15.86 కోట్లు	10.58 కోట్లు	66.71
3	94	17.24 కోట్లు	11.32 కోట్లు	65.68
4	96	17.71 కోట్లు	12.25 కోట్లు	66.71
5	49	8.96 కోట్లు	5.57 కోట్లు	62.20

రాజ్యాంగాన్ని మార్చేస్తారు: రాహుల్

అమృత్‌సర్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నెగ్గితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అమృత్‌సర్ కాంగ్రెస్ అభ్యర్థి గుర్జీత్ సింగ్ ఔజ్లాకు మద్దతుగా రాహుల్ శనివారం పంజాబ్‌లో తొలిసారిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇవి సాధారణ ఎన్నికలు కావన్నారు. ఈ ఎన్నికల్లో నరేంద్ర మోదీ, బీజేపీ సీనియర్ నాయకులు రాజ్యాంగాన్ని లక్ష్యంగా చేసుకున్నారన్నారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో తొలిసారిగా బీజేపీ నేతలు బాహటంగా రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, మార్చేస్తామని, గిరాటేస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమన్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటున్న మోదీ, బీజేపీ నాయకులు ఉంటే మరోవైపు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్న కాంగ్రెస్ ఉందన్నారు. గడిచిన పదేళ్లలో దేశంలోని రైతుల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రైతులపై దాడులు జరిగాయని, మూడు నల్ల చట్టాలను తెచ్చారని'' వ్యతిరేకంగా ఉద్యమిస్తే రైతులను ఉగ్రవాదులన్నారని రాహుల్ మండిపడ్డారు.

ఇండియా కూటమి అభ్యర్థి గృహ నిర్బంధం

ఆరోపించిన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అంబేడ్కర్ నగర్ లోక్‌సభ స్థానానికి శనివారం ఆరోవిడతలో పోలింగ్ జరిగింది. ఈ స్థానం నుంచి ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అభ్యర్థి లాల్జీ వర్మను అధికారులు గృహ నిర్బంధంలో ఉంచారని కాంగ్రెస్, ఎస్పీలు ఆరోపించాయి. ఎన్నికల కమిషన్ కలుగజేసుకోవాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కోరారు. అధికార బీజేపీ కనుసన్నల్లోనే ఆయన్ను అధికారులు బయటకు రాకుండా చేశారన్నారు. ఓటమి భయంతోనే బీజేపీ ఇలాంటి బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

మెహబూబాకు ఔట్ గోయింగ్ కాల్స్ కట్

శ్రీనగర్: అధికారులు తన సెల్‌ఫోన్ నుంచి ఔట్ గోయింగ్ కాల్స్ ఆపేశారని పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం మొదలై శనివారం ఉదయం కూడా ఇదే అసౌకర్యం కొనసాగిందని ఆమె అన్నారు. ఇలా అకస్మాత్తుగా సేవలను ఎందుకు నిలిపివేశారో అర్థం కాలేదని అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి కూడా అయిన మెహబూబా ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాదు, పోలింగ్ వేళ నియోజకవర్గంలోని తమ కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. బాధితుల కుటుంబాలతో కలిసి ఆమె బిజ్‌బెహారా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలపగా అనంత్‌నాగ్ ఎస్ఎస్‌పీ, దక్షిణ కశ్మీర్ డీఐజీ ఆదేశాల మేరకే అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని మెహబూబా తెలిపారు.



లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం జరిగిన ఆరో విడత పోలింగ్‌లో ఢిల్లీలో ఓటేసిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, విదేశాంగ మంత్రి జై శంకర్, ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, కేజ్రీవాల్



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు



సీపీఎం నేతలు బృందా కారత్, ప్రకాశ్ కారత్

ఆరో విడతలో 61.11 శాతం

- ఆరు రాష్ట్రాలు, రెండో యూటీల్లోని 58 లోక్‌సభ స్థానాల్లో ముగిసిన పోలింగ్
- జూన్ 1న తుది విడతలో 57 స్థానాలకు పోలింగ్, 4న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం ఆరో విడతలో 58 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడపటి సమాచారం అందేసరికి 61.11 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్లో అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు, ఢిల్లీలో ఒకట్రెండుచోట్ల ఈవీఎంలు మొరాయించడం మినహా పోలింగ్ సజావుగా సాగింది. ఈ విడతలో కూడా బెంగాల్లోనే అత్యధికంగా 79.40 శాతం పోలింగ్ నమోదైంది. జార్ఖండ్‌లో 63.76 శాతం, ఒడిశాలో 69.32, హరియాణాలో 60.06, ఢిల్లీలో 57.67, బిహార్లో 55.24, యూపీలో 54.03 శాతం పోలింగ్ జరిగింది. జమ్మూకశ్మీర్లోని అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ స్థానంలో 54.15 శాతం పోలింగ్ జరగడం విశేషం. అక్కడ గత కొన్ని దశాబ్దాల్లో ఇదే అత్యధికం. దీంతో జమ్మూకశ్మీర్‌లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అక్కడి 5 లోక్‌సభ స్థానాల్లో కలిసి 58 శాతం పోలింగ్ నమోదైంది. ఇది గత 40 ఏళ్లలో అత్యధికమని ఈసీ పేర్కొంది. అక్కడి బారాముల్లా (59 శాతం), శ్రీనగర్ (34.4 శాతం) స్థానాల్లోనూ ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైంది. ఒడిశాలో 6 లోక్‌సభ స్థానాలతో పాటు వాటి పరిధిలోని 42 అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరిగింది. శనివారంతో 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 486 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ముగిసింది. మిగిలిన 57 స్థానాలకు జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి.

ఓటేసిన ప్రముఖులు

రాజధాని ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలకూ ఈ విడతలోనే పోలింగ్ జరిగింది. దాంతో ప్రముఖులంతా ఓటింగ్‌కు తరలి వచ్చారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్‌సింగ్ పురి, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వద్రా దంపతులు, హరియాణా సీఎం నయాబ్‌సింగ్ సైనీ తదితరులు ఓటు వేశారు. ప్రియాంక కూతురు మిరాయా తొలిసారి ఓటేశారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆప్‌కు ఓటేయగా... ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దంపతులు కాంగ్రెస్‌కు ఓటేయడం విశేషం. సోనియా, రాహుల్ ఓటేసిన న్యూఢిల్లీ లోక్‌సభ స్థానంలో ఆప్, కేజ్రీవాల్‌కు ఓటున్న చోట చాందినీచౌక్ స్థానంలో కాంగ్రెస్ బరిలో ఉండటమే ఇందుకు కారణం. ఢిల్లీలో రెండు పార్టీలూ కలిసి పోటీ చేస్తుండటం తెలిసిందే.

బెంగాల్లో బీజేపీ అభ్యర్థిపై దాడి!

బెంగాల్లోని ఝార్‌గ్రాంలో తృణమూల్ కార్యకర్తలు తన కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారని బీజేపీ అభ్యర్థి ప్రణత్ తుడు ఆరోపించారు. తనతో పాటు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు తెలిపారు. బీజేపీ ఖుర్దా అసెంబ్లీ అభ్యర్థి, చిలికా సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ తన అనుచరులతో పాటు ఓ పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎంను పగలగొట్టారు. పోలింగ్ అధికారిని తీవ్రంగా గాయపరిచారు. ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

మీ ఇంటిని చక్కదిద్దుకోండి..!

- సమస్యల్ని పరిష్కరించుకునే సత్తా మాకుంది
- పాక్ నేత 'శాంతి' వ్యాఖ్యలకు బదులిచ్చిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న చౌదరి ఫవాద్ హుస్సేన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భారత్‌లో విద్వేషం, ఉగ్రవాద శక్తులను శాంతి సామరస్యాలు ఓడించాలని ఆకాంక్షించారు. దీనికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దీటైన సమాధానమిచ్చారు. 'చౌదరి సాహిబ్, నేను, మా దేశ ప్రజలకు సమస్యల్ని పరిష్కరించుకునే సమర్థత ఉంది. మీ ట్వీట్ అవసరం లేదు. పాకిస్తాన్‌లో ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగోలేవు. మీ దేశం సంగతి చూసుకోండి. ఎన్నికలు భారత్ అంతర్గత వ్యవహారం. ఉగ్రవాదానికి అతిపెద్ద స్పాన్సర్‌గా ఉన్న పాకిస్తాన్ మా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోం'అని హెచ్చరించారు. ఆ తర్వాత కేజ్రీవాల్ అభిప్రాయాలపై చౌదరి ఫవాద్ హుస్సేన్ స్పందించారు. 'ఉగ్రవాదానికి సరిహద్దులతో సంబంధంలేదు. పాక్‌లో ప్రస్తుతం పరిస్థితులు బాగానే ఉన్నాయి. మెరుగైన సమాజం కావాలనే ఎవరైనా కోరుకుంటారు'అని పేర్కొన్నారు. ఈ పరిణామంపై బీజేపీ స్పందించింది. 'ఆప్ నేత అవినీతి రాజకీయాలకు పాక్ నుంచి కూడా వంతపాడుతున్నారు. ఢిల్లీలో ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారీ పాక్ నుంచి స్పందిస్తుంటారు. దేశ శత్రువులతో కేజ్రీవాల్ అంటకాగుతున్నారనడానికి ఇదే రుజువు' ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు.

చైనా ఆక్రమణలపై మోదీ మౌనం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎద్దేవా

సిమ్లా: చైనా భారత భూభాగాన్ని ఆక్రమించి ఇళ్లు, రోడ్డు నిర్మిస్తోందని, అయినా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని రొహ్రూలో శనివారం ఎన్నికల సభలో మాట్లాడుతూ '56 అంగుళాల ఛాతి ఎటుపోయింద'ని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను, రాజ్యాంగాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించకపోతే దాని ద్వారా అందిన ప్రజాస్వామ్యం, హక్కులను లాగేసుకుంటారని అన్నారు. మోదీ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాస్తుందని, కాంగ్రెస్ పేదల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు.

వాగులోకి నడిపించిన

గూగుల్ మ్యాప్

- కేరళలో నీట మునిగిన కారు
- నలుగురు హైదరాబాదీలకు తప్పిన ప్రాణాపాయం

కొట్టాయం: కేరళలోని కొట్టాయం జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. నలుగురు హైదరాబాదీలు అదృష్టవశాత్తూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి కేరళ పర్యటనకు వచ్చిన నలుగురు మిత్రులు శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గూగుల్ మ్యాప్ ఆధారంగా దారి తెలుసుకుంటూ కారులో అళప్పుజాకు బయలుదేరారు. భారీ వర్షం కురుస్తుండడంతో రహదారిపై నీరు నిలిచిపోయింది. వారికి ఈ ప్రాంతం కొత్త కావడంతో గూగుల్ మ్యాప్ ఆధారంగా అలాగే ముందుకెళ్లారు. దాంతో కురుప్పంతార గ్రామం వద్ద కారు రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కారు క్రమంగా మునిగిపోసాగింది. దాంతో వారు గట్టిగా కేకలు వేశారు. అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసుతోపాటు స్థానికులు వెంటనే అప్రమత్తమై కారు డోర్లు తెరిచారు. కారులోని నలుగురు వ్యక్తులు ఈదుకుంటూ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. కారు పూర్తిగా నీటమునిగింది. అనంతరం క్రేన్ సాయంతో పోలీసులు కారును బయటకు తీశారు. బాధితుల్లో ఒక మహిళ ఉన్నారు.

రాజ్‌కోట్‌లో పెను విషాదం

- టీఆర్‌పీ గేమ్ జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం
- నలుగురు చిన్నారులు సహా 27 మంది మృతి



రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. వేసవి సెలవులు, వారాంతం కూడా కావడంతో సరదాగా ఆడుకునేందుకు వెళ్లిన నలుగురు చిన్నారులు సహా మొత్తం 27 మంది అగ్ని ప్రమాదానికి బలయ్యారు. నానా–మవా రోడ్డులోని టీఆర్‌పీ గేమ్ జోన్‌లో సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. అందరూ ఆటల్లో మునిగి ఉన్న వేళ ఆ ప్రాంతాన్ని ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టాయి. దీంతో, అందులో చిక్కుకుపోయిన వారంతా హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని దాదాపు ఐదుగంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంతోపాటు బలమైన గాలులు వీస్తున్న కారణంగా ఫైబర్ డోమ్ పూర్తిగా కుప్పకూలింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. శిథిలాలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నట్లు రాజ్‌కోట్ కలెక్టర్ ప్రభావ్ జోషి చెప్పారు. ఇప్పటి వరకు 27 మృతదేహాలను వెలికితీశామన్నారు. పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయన్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించామని చెప్పారు. ఘటన నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న గేమింగ్ జోన్లు అన్నిటినీ వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రమాదం సంభవించిన గేమ్ జోన్‌లో తక్షణమే సహాయ కార్యక్రమాలను చేపట్టాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సీఎం భూపేంద్ర పటేల్ తెలిపారు. ఘటనకు దారి తీసిన కారణాలపై సిట్‌తో ప్రత్యేక విచారణ చేయిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారంగా ప్రకటించారు. కాగా, రాజ్‌కోట్‌లో విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

యజమాని అరెస్ట్

టీఆర్‌పీ గేమ్ జోన్ యజమాని యువరాజ్ సింగ్ సోలంకీ, మేనేజర్‌తోపాటు మొత్తం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పదేళ్లలో రూ. 8,820 కోట్ల కేటాయింపు

సాక్షి, చెన్నై: గత పదేళ్లలో మెట్రో రైలు పనులకు చెన్నైలో రూ. 8820 కోట్లను మాత్రమే కేంద్రం కేటాయించినట్టు సమాచార హక్కు చట్టం ద్వారా ఓ సామాజిక కార్యకర్త వివరాలను సేకరించారు. వివరాలు.. డీఎంకే అధికారంలోకి వచ్చినానంతరం చెన్నైలో సుమారు 65 వేల కోట్లతో మెట్రో రైలు రెండో పేజ్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అంతకు ముందుగా ఫేజ్ ఓన్‌లో రెండు మార్గాలపనులను ముగించి రైలు సేవలు సాగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మూడు మార్గాల పనులతోపాటు గతంలో జరిగిన పనులకు కేంద్ర ప్రభుత్వం ఏ మేరకు నిధులను కేటాయించిందనే వివరాలను ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలను సేకరించారు. ఇందులో గత పదేళ్లలో కేంద్రం మెట్రో రైలు సేవలకు రూ. 8,820 కోట్లు మాత్రమే తమిళనాడుకు కేటాయించినట్లు తేలింది.

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకున్న 16 రోజుల్లోనే అనుమతి

సాక్షి, చెన్నై: ప్రభుత్వ సేవలైన పట్టా మార్పిడి తదితర 26 రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 16 రోజులలో లబ్ధిదారులకు అనుమతి ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు సంబంధించి సిద్ధం చేసిన చట్ట సవరణలోని అంశాలను వివరిస్తూ.. లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ డివిజన్ల వారీగా రెవెన్యూ అధికారులకు ఆ శాఖ కమిషనర్ శనివారం లేఖ రాశారు.

రూ.1.5 కోట్ల విలువైన నార్కోటిక్ మాత్రలు సీజ్

అన్నానగర్: మండపం సమీపంలో శనివారం వేదలై బీచ్ నుంచి శ్రీలంకకి అక్రమంగా తరలించేందుకు యత్నించిన రూ.1.5 కోట్ల విలువైన నార్కోటిక్ మాత్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రామనాథపురం జిల్లా మండపం సమీపంలోని వేదలై సముద్ర తీర ప్రాంతం నుంచి శ్రీలంకకు అక్రమంగా మాదక ద్రవ్యాలు తరలిస్తున్నట్లు నార్కోటిక్స్ ఇంటిలిజెన్స్ విభాగానికి ముందస్తు సమాచారం అందింది. దీంతో శనివారం తెల్లవారుజామున 5 గంటలకు వేదలై బీచ్ ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆ సమయంలో అటుగా వస్తున్న కారును పోలీసులు అడ్డుకున్నారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయారు. పోలీసులు కారులో సోదా చేయగా, కార్డ్‌బోర్డ్ పెట్టెల్లో మత్తు మందు మాత్రల కట్టలు కనిపించాయి. పట్టుబడిన డ్రగ్స్ అంతర్జాతీయ విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని తెలిపారు. కారు నుంచి తప్పించుకున్నదెవరు? డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకొచ్చారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

900 హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయండి

- ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల వినతి

తిరువొత్తియూరు: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 900 ప్రధాన ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. వివరాలు.. తమిళనాడు ప్రాథమిక విద్యా శాఖ ఆధ్వర్యంలో 31,214 ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు పనిచేస్తున్నాయి. వీటిలో దాదాపు 35 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2013-2014 తర్వాత తమిళనాడు ప్రభుత్వం సెకండరీ టీచర్ల నియామకం చేపట్టలేదు. ఈ విధంగా, విద్యార్థుల సంఖ్య ఆధారంగా, ప్రస్తుతం ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు ఉండేవి. వీటిని పరిష్కరించడానికి, గ్రాడ్యుయేట్‌లను ప్యాకేజీ జీతంపై నియమించారు. వారు విద్యార్థులకు బోధన తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితిలో కోర్టుల్లో కేసుల పెండింగ్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సుమారు 900 ప్రధాన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ పోస్టులను వీలైనంత త్వరగా పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు పాఠశాల విద్యాశాఖకు విన్నవించారు. వీరిలో చాలా మంది ఉపాధ్యాయులు 20 ఏళ్లకు పైగా ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్నారు. వారి పదవీ విరమణకు కేవలం రెండేళ్లు మాత్రమే సమయం ఉండడం గమనార్హం.

గ్రూప్ -2, 2ఏ పాఠ్యాంశాల్లో మార్పులు

సాక్షి, చెన్నై: తమిళనాడు పబ్లిక్ సర్వీసు కమిషన్(టీఎన్‌పీఎస్సీ)నిర్వహించే గ్రూప్ -2, 2ఏ పోస్టుల భర్తీ పరీక్షలకు సంబంధించిన పాఠ్యాంశాలలో మార్పులు చేశారు. ఈ మార్పునకు సంబంధించిన వివరాలు, కొత్త పాఠ్యాంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని టీఎన్‌పీఎస్సీ వెబ్ సైట్‌లో శనివారం పొందుపరిచారు. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న గ్రూప్ -2, గ్రూప్ 2ఏ పోస్టులను టీఎన్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పదవులకు ఒకే సమయంలో మెయిన్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతోంది. గ్రూప్- 2 పదవికి అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతోంది. ఈ పరిస్థితులలో అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ విధానంలో స్వల్ప మార్పులు జరిగాయి. గ్రూప్ 2, గ్రూప్ 2ఏ పోస్టులకు వేర్వేరుగా పరీక్షల నిర్వహణకు నిర్ణయించారు. దీంతో గ్రూప్ 2 పదవుల మెయిన్స్ పాఠ్యాంశంతో పాటూ గ్రూప్ 2ఏ పాఠ్యాంశాలలో మార్పులు అనివార్యంగా మారాయి. కొత్త పాఠ్యాంశాలను వేర్వేరుగా రూపొందించిన టీఎన్‌పీఎస్సీ వర్గాలు ఆ వివరాలను తమ వెబ్ సైట్‌లో పొందుపరిచారు. తమిళంలో అర్హత పరీక్షకు సామాజిక, పర్యావరణ, ప్రస్తుత పరిస్థితులు, ఆర్థిక అంశాలు, శాస్త్ర, సాంకేతికత, సాంస్కృతిక, తదితర అంశాల మేళవింపుతో కొత్త పాఠ్యాంశాల రూపకల్పన చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కొంగణాపురం సంతలో రూ. 6 కోట్ల వ్యాపారం

- 11 వేల మేకల విక్రయం

తిరువొత్తియూరు: సేలం జిల్లా ఎడప్పాడి సమీపంలో ప్రసిద్ధి చెందిన కొంగణాపురంలో శనివారం సంత జరిగింది. సేలం, నామక్కల్, ఈరోడ్, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల నుంచి రైతులు, వ్యాపారులు 11 వేల మేకలకు పైగా అమ్మకానికి తీసుకొచ్చారు. తమిళనాడులోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు మేకల కొనుగోలుకు తరలివచ్చారు. ఈ కారణంగా మార్కెట్‌లో 10 కిలోల మేకలు రూ,5200 నుంచి రూ. 9,400 వరకు, 20 కిలోల గొర్రెలు రూ. 10,400 నుంచి రూ. 12,800, 30 కిలోల గొర్రెలు రూ. 15,600 నుంచి రూ. 23,500 వరకు అమ్ముడయ్యాయి. వీటితో పాటు కోళ్లు, కూరగాయలు కూడా విక్రయానికి ఉంచారు.

ప్రైవేటు బస్సుల్లో సోదాలు



ప్రభుత్వ బస్సు కండెక్టర్‌తో పోలీసుల వాగ్వాదం



నువ్వా..నేనా..?

'ప్రభుత్వ బస్సులలో పోలీసులు తప్పనిసరిగా టికెట్లు తీసుకోవాల్సిందే' అన్న రవాణా శాఖ ఆదేశాలు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. రూల్స్ పేరుతో తమ ఉచిత ప్రయాణానికి అడ్డుకట్ట వేయడంతో.. ఇదే అదునుగా పోలీసుశాఖ కూడా కొరడా ఝులిపిస్తోంది. నిబంధనలను ఉల్లంఘన పేరిట ప్రభుత్వ బస్సుల డ్రైవర్లకూ జరిమానాల మోత మోగించే పనిలో రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు నిమగ్నం కావడం చర్చకు దారి తీసింది. ఇదే సమయంలో ప్రజా ప్రయాణానికి ఆటకం కలిగించే రీతిలో పోలీసులు వ్యవహరించడం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని, ఉన్నతాధికారులు స్పందించకుంటే తామూ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని కార్మిక సంఘాలు ప్రకటించడం గమనార్హం.

రూల్స్ వార్!

- రాష్ట్రంలో రవాణా శాఖ వర్సెస్ పోలీసు శాఖ?
- నిబంధనల ఉల్లంఘన పేరిట కొరడా
- డ్రైవర్లకు జరిమానాల మోత
- రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు
- పోలీసులకు ఉచిత రవాణా రద్దు చేయడమే కారణమా?
- రెండు విభాగాల సీఎస్‌ల భేటీ

సాక్షి, చెన్నై : ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులలో పోలీసులు ఉచిత ప్రయాణం వ్యవహారం ఆది నుంచి ఓ వివాదంగా ఉంటోన్న విషయం తెలిసిందే. యూనిఫాం ధరించి విధులకు వెళ్లే పోలీసుల నుంచి కండెక్టర్లు బలవంతంగా టికెట్లు తీసుకోమని డిమాండ్ చేయడం, టికెట్ నగదును వసూలు చేయడం రోజూ అనేక చోట్ల జరుగుతోంది. కొన్ని చోట్ల కండెక్టర్లు వర్సెస్ పోలీసులు అన్నట్లుగా పరిస్థితులు మారాయి. ఈ కారణంగా బస్సుల్లో వాగ్వాదాలు సర్వసాధారణంగా మారాయి. రోజూ ఏదో ఒక చోట ఈ వివాదం వెలుగు చూస్తూనే ఉంది. రెండు రోజుల క్రితం తిరునల్వేలి మీదుగా తూత్తుకుడికి వళ్లియూరు మీదుగా వెళ్లిన బస్సులో ఆర్ముగ పాండి అనే పోలీసు, కండెక్టర్ మధ్య జరిగిన వివాదం వీడియో రాష్ట్రంలో వైరల్‌గా మారింది. ఈ వివాదం తదుపరి రవాణా సంస్థ విడుదల చేసిన ఓ ప్రకటన పోలీసుల్లో ఆగ్రహాన్ని పెంచింది. ప్రభుత్వ బస్సులలో పోలీసులకు ఉచిత ప్రయాణానికి అవకాశం లేదని అందులో స్పష్టం చేశారు. చేతిలో వారెంట్ ఉన్న సమయం మినహాయించి, తక్కిన సమయాలలో తప్పని సరిగా టికెట్లు తీసుకోవాల్సిందేనని జారీ చేసిన ఆదేశాలను పోలీసులు తీవ్రంగానే పరిగణించారు. రవాణా సంస్థ అధికారులు తమ విషయంలో నిబంధనలను నిక్కచ్చిగా పాటిస్తున్నప్పుడు తామెందుకు చూసీచూడనట్లు వ్యవహరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నిబంధనలు ఉల్లంఘించి దూసుకెళ్తున్న ప్రభుత్వ బస్సుల డ్రైవర్ల భరతం పట్టే విధంగా జరిమానాల మోత మోగించే పనిలో నిమగ్నమయ్యారు.

కక్ష సాధిస్తున్నారు..

పోలీసులు వసూలు చేస్తున్న జరిమానా డ్రైవర్లు వారి జీతాల నుంచి కట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వళ్లియూరు ఘటనతో పోలీసులు తమపై కక్ష సాధింపులో నిమగ్నమయ్యారని, వేధిస్తున్నారని మండిపడ్డాయి. ఈ వ్యవహారంలో తక్షణం హోంశాఖ కార్యదర్శితో రవాణా కార్యదర్శి సంప్రదింపులు జరపాలని వివాదానికి ముగింపు పలకాలని డిమాండ్ చేశాయి. సీఎం స్టాలిన్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. లేని పక్షంలో తాము సైతం తీవ్రంగానే స్పందించాల్సి ఉంటుందన్న హెచ్చరించారు. అదే సమయంలో పోలీసు ఉన్నతాధికారులు తరపున పేర్కొంటూ, ప్రభుత్వ బస్సులలో తనిఖీలకు ప్రత్యేకంగా తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. సాధారణంగా జరిగే తనిఖీలలో భాగంగానే జరిమానాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా సంస్థలో వేలాది బస్సులు ఉన్నాయని గుర్తు చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్లకు మాత్రమే జరిమానా విధించామని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత తమకు కూడా ముఖ్యం అని నిబంధనలు ఉల్లంఘించే వారందరూ తమకు సమానమేనని పేర్కొనడం గమనార్హం. ఈ వివాదం నేపథ్యంలో వళ్లియూరు బస్సులో జరిగిన వివాదానికి ముగింపు పలికే విధంగా శనివారం సాయంత్రం ఆ బస్సు కండెక్టర్, పోలీసు ఆర్ముగ పాండి ఇద్దరూ పరస్పరం క్షమాపణలు చెప్పుకుని ఆలింగనం చేసుకోవడం కొసమెరుపు. ఈ వ్యవహారంతో వివాదం సమసి పోయేనా లేదా ఇంకా కొనసాగేనా? అన్నది వేచి చూడాల్సిందే. అదే సమయంలో సీఎం స్టాలిన్ ఆదేశాలతో హోం శాఖ కార్యదర్శి అముదా, రవాణా కార్యదర్శి ఫనీంద్ర రెడ్డి సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ వివాదాన్ని కొలిక్కి తెచ్చేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిసింది.

హద్దు మీరితే ఫైన్..

ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులు వేగంగా దూసుకెళ్లినా, సిగ్నల్స్‌ను దాటినా పెద్దగా పట్టించుకోని పోలీసులు తాజాగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని కొరడా ఝుళిపించే పనిలో పడ్డారు. శుక్రవారం చెన్నై శివార్లలోని కిలాంబాక్కం సబర్బన్ బస్‌టెర్మినల్ వెలుపల నో పార్కింగ్‌లో బస్సులను ఆపేశారంటూ రవాణా సంస్థకు చెందిన 24 బస్సులకు తలా రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. ఇది చర్చకు దారి తీసిన నేపథ్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బస్సుల డ్రైవర్ల భరతం పట్టే విధంగా పోలీసులు దూసుకెళ్లారు. సీటు బెల్టు ధరించ లేదని, యూనిఫాం వేసుకోలేదని, సిగ్నల్స్ దాటారని, నో పార్కింగ్ ప్రదేశంలో బస్సులు ఆపేశారని, ఓవర్ లోడింగ్‌తో బస్సులను నడుపుతున్నారని.. ఇలా రకరకాల కారణాలతో జరిమానా విధింపుపై దృష్టి పెట్టారు. తిరునల్వేలి వళ్లియూరులో మూడు బస్సుల డ్రైవర్లకు తలా రూ. 500, ఉలందూరు పేటలో వన్‌వేలో వచ్చిన మరో ఐదు బస్సుల డ్రైవర్లకు తలా రూ. 500 అంటూ జరిమానా విధించారు. ఇలా 20కు పైగా బస్సులకు జరిమాన విధించారు. చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి తదితర నగరాలలోని నగర రవాణా సంస్థ బస్సులు సిగ్నల్ దాటితే చాలు జరిమానా విధించే దిశగా ట్రాఫిక్ పోలీసులు దూసుకెళ్లడం చర్చకు దారి తీసింది. తమను పోలీసులు వేధిస్తున్నారని, జరిమానా వసూలు పేరిట అర్ధగంట పాటు సమయం వృథా చేయిస్తున్నారని డ్రైవర్లు, కండెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఫలితంగా సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవడంలో ఇబ్బంది ఎదురవుతోందని వాపోతున్నారు. దీంతో రూటు మార్చిన పోలీసుల కేవలం ప్రభుత్వ బస్సులనే కాకుండా, ఆయా మార్గాలలో నడిచే ప్రైవేటు బస్సులను సైతం గురి పెట్టారు. ఎయిర్ హారన్లు ఉపయోగించే బస్సులకు జరిమానా విధించారు. వాటిని తొలగించారు. యూనిఫాం, సీటు బెల్టు అంటూ ప్రైవేటు బస్సు డ్రైవర్లకు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు.



సిగ్నల్ దాటారని జరిమానా



ఫైన్ వసూలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



ప్రభుత్వ బస్సుల్లో తనిఖీలు

'అమ్మ'కు మతతత్వ ముసుగా?

- అన్నామలై వ్యాఖ్యలపై అన్నాడీఎంకే గరంగరం
- ఖండించిన శశికళ



జయలలిత (ఫైల్)

సాక్షి, చెన్నై: దివంగత సీఎం జయలలితకు మతతత్వ ముద్రను ఆపాదించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిమగ్నమయ్యారంటూ అన్నాడీఎంకే వర్గాలు ఆరోపించాయి. ఆయన వ్యాఖ్యలను ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. అన్నామలై తెలివి తక్కువ తనంతో మాట్లాడుతున్నారని జయలలిత నెచ్చెలి శశికళ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. ఇటీవల దివంగత అన్నాడీఎంకే అధినేతలు ఎంజీఆర్, జయలలిత పేర్లను పదేపదే బీజేపీ వర్గాలు ప్రస్తావించడం జరుగుతోంది. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం వారి జపం చేశారు. దీనిని అన్నాడీఎంకే తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. వారి ఉనికి కాపాడుకునేందుకు తమ నేతల పేర్లు ఉపయోగించుకుంటున్నారని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జయలలిత కూడా మతతత్వ వాది అని చాటే విధంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీవ్ర వ్యాఖ్యలు చేయడం శనివారం దుమారం రేపాయి.

అన్నాడీఎంకే వర్గాల ఆగ్రహం

అన్నామలై వ్యాఖ్యలపై అన్నాడీఎంకే సీనియర్లు జయకుమార్, ఆర్‌బీ ఉదయకుమార్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమ అమ్మ జయలలిత ఖ్యాతికి కళంకం తెచ్చే విధంగా అన్నామలై వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అమ్మ జయలలిత మతాలకు అతీతం అని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా చూస్తూ, అందరికీ అన్ని పథకాలను దరిచేర్చిన ఘనత తమ అమ్మ జయలలితకే దక్కుతుందన్నారు. ప్రజా నేతగా అన్ని వర్గాల ప్రజల సంరక్షణ లక్ష్యంగా రేయింబవళ్లు శ్రమించారని, అన్ని మతాలను, వారి నమ్మకాలను గౌరవించారని వివరించారు. తన ఉనికిని కాపాడుకునేందుకు, రాజకీయంగా ఎదిగేందుకు జయలలిత పేరుకు పదే పదే కళంకం సృష్టించే విధంగా అన్నామలై వ్యవహరిస్తున్నారని, ఇందుకు గట్టిగా సమాధానం ఇచ్చేందుకు తాము సిద్ధం అని హెచ్చరించారు. ఆమె హిందూ మతానికి మాత్రమే సొంతం అని అన్నామలై వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందన్నారు. దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ స్పందిస్తూ అన్నామలై తెలివి తక్కువ తనంతో మాట్లాడుతున్నట్లున్నారని మండిపడ్డారు. తన రాజకీయ స్వలాభం కోసం జయలలిత పేరుకు కళంకం తెచ్చే విధంగా వ్యవహరిస్తే సహించబోనని హెచ్చరించారు. అన్నామలై చేస్తున్న వాఖ్యలు చూస్తుంటే, రాజకీయాలపై ఆయనకు కనీస అవగాహన లేనట్లు కనిపిస్తోందని విమర్శించారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- పెద్దలు వ్యతిరేకించడంతో అఘాయిత్యం

అన్నానగర్: మాధవరం సమీపంలోని మాత్తూరు, ఎంఎండీఏ ప్రాంతానికి చెందిన కిరణ్ కుమార్. ఇతని కుమారుడు శ్రీకాంత్ (15) ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇతని ఇంటి పక్కనే సంధ్య(16) అనే బాలిక నివసిస్తోంది. మనాలిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో కిరణ్‌కుమార్ ఉత్తీర్ణుడయ్యాడు. అయితే సంధ్య మాత్రం ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయినట్లు తెలుస్తోంది. ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో శ్రీకాంత్, సంధ్య సన్నిహితంగా మెలిగారు. వారు ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులిద్దరూ వారిని ఖండించారు. దీంతో శనివారం ఉదయం శ్రీకాంత్, సంధ్య ఒకే బైకులో బయటకు వెళ్లారు. తర్వాత తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి మాధవరం డెయిరీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో తిరువొత్తియూరు, ఒడైకుప్పం బీచ్‌లో శ్రీకాంత్, సంధ్య మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వీరి ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తిరువొత్తియూరు పోలీసులు ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ నడుపుతున్న బైకు ఎన్నూర్ బీచ్‌లో ఆగి ఉంది. దీంతో శ్రీకాంత్, సంధ్య ఎన్నూర్ సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని, వారి మృతదేహాలు తిరువొత్తియూర్ బీచ్‌కు కొట్టుకొచ్చాయని తెలుస్తోంది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపాక్కంలో భద్రత కట్టుదిట్టం

- విధుల్లో 2 వేల మంది సిబ్బంది
- ఐపీఎల్ ఫైనల్‌కు ఏర్పాట్లు పూర్తి



చేపాక్కం స్టేడియం


సాక్షి, చెన్నై: ఐపీఎల్ క్రికెట్ పండుగ ముగింపు దశకు చేరింది. ఆదివారం చెన్నై వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇందుకోసం చేపాక్కం ఎంఏ చిదంబరం స్టేడియం పరిసరాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు మార్గాలలో ట్రాఫిక్ మార్పులు జరిగాయి. వివరాలు.. తమిళనాట క్రికెట్ అభిమానులు ఎక్కువే అన్న విషయం తెలిసిందే. ఇక ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు తమదే అన్నట్టు అభిమానులు ఉత్సాహాన్ని చూపిస్తుంటారు. చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌లను తిలకించేందుకు భారీగా వస్తుంటారు. 17వ సీజన్‌లో తొలి మ్యాచ్ చెన్నైలోనే జరిగింది. చివరి మ్యాచ్‌కు కూడా చెన్నై వేదికగా మారింది. ఈ సారి ఫైనల్స్‌లో తమ జట్టు ఉంటుందని భావించిన తమిళ క్రికెట్ అభిమానులకు నిరాశ తప్పలేదు. ఈ పరిస్థితులలో చివరి మ్యాచ్ ఫైనల్స్ ఆదివారం రాత్రి ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా 7.30 గంటలకు ప్రారంభం కానుంది. కేకేఆర్, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఆయా రాష్ట్రాల అభిమానులు చెన్నైకు చేరుకుంటున్నారు. దీంతో విమాన చార్జీలు అమాంతంగా పెరిగాయి. చేపాక్కం పరిసరాలలో హోటళ్లు నిండాయి. స్టేడియం పరిసరాలలో చెన్నై పోలీసుల భద్రతను పెంచారు. 2 వేల మంది సిబ్బంది భద్రతా విధులలో ఉన్నారు. ఆ పరిసర మార్గాలలో ట్రాఫిక్ మార్పులు జరిగాయి. స్టేడియంలోకి వచ్చే అభిమానులను క్షుణ్ణంగా తనిఖీ చేసినానంతరం అనుమతించే విధంగా చర్యలు తీసుకున్నారు. అయితే చెన్నైలో ఆదివారం వర్షం కురిసే అవకాశం ఉండడంతో మ్యాచ్ నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో శనివారం సాయంత్రం నగరంలో పలుచోట్ల చిరుజల్లులు పడడం గమనార్హం.

విద్యార్థి మృతి

అన్నానగర్: చెంగల్పట్టు జిల్లా తిమ్మాపురం మారియమ్మన్ కోయిల్ వీధికి చెందిన కన్నన్ పెద్ద కుమారుడు విష్ణు(11) స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇతని పక్కింటి కరెంట్ తీగ కిందకు వేలాడుతుంది. ఈక్రమంలో అక్కడ విష్ణు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఈ ఘటనపై అచ్చరపాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊటీలో వీసీల మహానాడు

- రేపటి నుంచి రెండు రోజుల నిర్వహణ
- నీలగిరులకు గవర్నర్



గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి, చెన్నై: ఊటీలో విద్యా సంస్థల వైస్ చాన్సలర్ల(వీసీల) మహానాడు జరగనుంది. ఈనెల 27, 28 తేదీలలో ఏర్పాటు చేస్తున్న ఈ మహానాడుకు హాజరయ్యేందుకు గాను.. గవర్నర్ ఆర్‌ఎన్ రవి శనివారం నీలగిరులకు బయలుదేరి వెళ్లారు. ఏటా గవర్నర్ నేతృత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా వీసీల మహానాడు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది గాను ఊటీలోని రాజ్ భవన్ బంగ్లాలో సమావేశం నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. 27, 28 తేదీలలో జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్రంలోని 48 వర్సిటీలకు చెందిన వీసీలు హాజరు కానున్నారు. వీరికోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహానాడు నిమిత్తం ఒక రోజు ముందుగానే గవర్నర్ ఆర్‌ఎన్ రవి నీలగిరులలోని ఊటీకి బయలుదేరి వెళ్లారు. ఊటీ రాజ్ భవన్‌లో బస చేస్తున్న ఆయన ఆదివారం విశ్రాంతి తీసుకోనున్నారు. మహానాడు అనంతరం ఈనెల 29న కోత్తగిరిలో గవర్నర్ పర్యటించనున్నారు. గవర్నర్ రాకతో నీలగిరులలో భద్రతను కట్టుదిట్టం చేశారు. చెన్నై నుంచి విమానంలో కోయంబత్తూరుకు చేరుకున్న గవర్నర్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఊటీకి వెళ్లారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఊటీ మార్గంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

భారీ వర్షాలనూ ఎదుర్కొనేందుకు సిద్ధం

- సీఎస్ శివదాస్ మీన వెల్లడి
- వర్షపు నీటి కాలువ పనుల పరిశీలన



వర్షపు నీటి కాలువల రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎస్ శివదాస్‌మీన, కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్



పూడికతీత పనులను పరిశీలిస్తూ..

సాక్షి, చెన్నై: చెన్నైలో హఠాత్తుగా 15 సెం.మీ నుంచి 20 సెం.మీ వరకు వర్షం కురిసినా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీన వ్యాఖ్యానించారు. చెన్నైలో జరుగుతున్న వర్షపు నీటి కాలువల పనులు, పూడిక తీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. అన్ని వివరాలన సీఎస్‌కు కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తదితర అధికారులు వివరించారు. టీ నగర్ పరిసరాలలో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో నైరుతి రుతు పవనాల ప్రభావంతో జూన్ లేదా జూలైలో మోస్తరుగా వర్షాలు కురుస్తాయన్నారు. అయితే ఈశాన్యరుతు పవనాల సీజన్ లోనే అధిక వర్ష పాతం నమోదు అవుతూ వస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలతో మరింత ఆశాజనకంగా వర్షాలు పడుతాయనే సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. తన నేతృత్వంలోని సమన్వయ కమిటీ ఆయా జిల్లాల కలెక్టర్లను ఇప్పటికే ఆదేశించిందని, అన్ని పనులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమీక్షిస్తూ వస్తున్నామని వివరించారు.

పూడిక తీత పనులు

చెన్నై నగరంలో పూడికతీత పనులు శర వేగంగా సాగుతున్నాయని సీఎస్ పేర్కొన్నారు. చెన్నైలో కొత్తగా నిర్మిస్తున్న వర్షపు నీటి కాలువల పనులు ఈశాన్య రుతు పవనాల సీజన్‌లో ముగిస్తామన్నారు. ఉత్తర, దక్షిణ చెన్నైలలో జరుగుతున్న కొన్ని పనులు ముగియడానికి మరి కొంత సమయం పడుతుందన్నారు. సెంట్రల్ చెన్నైలో కొన్నిచోట్ల మాత్రమే పనులు ముగియాల్సి ఉందన్నారు. 24 గంటలలో 15 లేదా 20 సెం.మీ వర్షం పడ్డ పక్షంలో దానిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. అయితే, హఠాత్తుగా మరింత అత్యధిక స్థాయిలో కురిసిన పక్షంలో కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడం సహజమని, వాటిని తొలగించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. కోయంబత్తూరు, మదురై వంటి నగరాలలోనూ ముందు జాగ్రత్తలు విస్తృతం చేశామన్నారు. జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. అకాల వర్షాలకు డెల్టాలో పంట నష్టం వాటిల్లినట్టు సమాచారం వచ్చిందని, దీంతో నష్టం వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించామన్నారు.

జలకళ..

పశ్చిమ కనుమల వెంబడి ఉన్న కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేనిలలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఇక్కడి పాపనాశం జలాశయం రెండు రోజులలో 12 అడుగులు, సేర్వలారు జలాశయంలో 20 అడుగులకు నీటి మట్టం పెరిగింది. కడయం, రామనది, మణిముత్తారు, గోదై నది, పెరుంజాని, సురిలి, పేచ్చిపారై, సోత్తుపారై వంటి నదులు, తిరుప్పరప్పు జలపాతం, కుట్రాలం జలపాతంలో ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో నదీ తీరల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తిరుచ్చి ముక్కొంబు నుంచి కొల్లిడం నదిలోకి నీటిని విడుదల చేస్తుండటంతో ఆ తీర వాసులను అలర్ట్ చేశారు. బంగాళాఖాతంలో తుపాన్ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని హార్బర్‌లలో మూడవ నంబరు ప్రమాద సూచికను ఎగుర వేశారు. పుదుచ్చేరి, నాగపట్నం సముద్ర తీరాలలో అలల తాకిడి మరింత ఎక్కువగా ఉంది. ఇక తుపాన్ నేపథ్యంలో చెన్నై నుంచి అండమాన్‌కు వెళ్లాల్సిన రెండు విమానాల సేవలను రద్దు చేశారు.

క్లుప్తంగా

అనుమానంతో భార్య హత్య

అన్నానగర్: తూత్తుకుడి జిల్లా ఆత్తూరు సమీపంలోని మేళ ఆత్తూరు సుబ్రహ్మణ్యపురానికి చెందిన జయకుమార్ (41) డ్రైవర్. ఇతనికి భార్య పాన్ మారి(33), ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మార్చి 1న ఇంట్లో ఉన్న పాన్ మారి హఠాత్తుగా అదృశ్యమైంది. నాలుగు రోజుల తర్వాత మళ్లీ ఇంటికి వచ్చింది. పాన్‌మారి ప్రవర్తనపై అనుమానం రావడంతో జయకుమార్ పాన్ మారిని కొట్టి చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిసింది. ఈ విషయంపై శుక్రవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన జయకుమార్ పాన్‌మారిని కింద పడేసి గొంతుకోసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు జయకుమార్‌ను శనివారం ఉదయం అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు ఇంజెక్షన్ వేసుకున్న బాలుడి మృతి

తిరువొత్తియూరు: చెన్నై పులియంతోపు డికాస్టర్ రోడ్డుకు చెందిన మహమ్మద్ (17) ఓ ఎలక్ట్రీషియన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బ్రాడ్‌వే లోన్ స్క్వేర్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నివసించే కుమార్ (17)తో అతడికి పరిచయం ఏర్పడింది. ఈ స్థితిలో శుక్రవారం బ్రాడ్‌వేలోని ఓ ఇంట్లో ఇద్దరు చిన్నారులు సహా నలుగురు చిన్నారులు మత్తు ఇంజక్షన్ వేసుకున్నట్టు తెలిసింది. కొంతసేపటి తర్వాత బయటకు వచ్చిన మహ్మద్ హఠాత్తుగా వాంతులు చేసుకుని స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స కోసం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఎస్ప్లనేడ్ పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి తరలించారు. బాలుడు చొక్కాలో మత్తు సిరంజి ఉండడంతో ఈమేరకు విచారణ చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అన్నానగర్: కడలూరు సమీపంలో శనివారం ఇంట్లో ఒంటరిగా ఉంటున్న యువకుడు తల, చేయి కాలిపోయి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. కడలూరు జిల్లా దిట్టక్కుడి ఎంజీఆర్ పట్టణానికి చెందిన దీనదయాళన్ (37). ఇతని భార్య హరి జీరాబీ (33). వీరికి ముగ్గురు కుమార్తెలు. మూడేళ్లుగా భార్య, ముగ్గురు పిల్లలను విడిచి వేరుగా జీవిస్తున్నాడు. ఎంజీఆర్ నగర్‌లో దీనదయాళన్ ఒంటరిగా ఉండేవాడు. ఈ స్థితిలో, శుక్రవారం ఉదయం దీనాదయాళన్ ఇంట్లో నుంచి పొగలు రావడంతో పాటు దుర్వాసన వెదజల్లడంతో ఆ ప్రాంత వాసులు దిట్టకుడి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా దీనదయాళన్ ఇంట్లోనే కుళ్లిన స్థితిలో శవమై కనిపించాడు. అలాగే పక్కనే ఉన్న టేబుల్ ఫ్యాన్‌పై తల, కుడిచేయి కాలిన స్థితిలో ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న శునకాల ప్రదర్శన





పోటీల్లో విన్యాసాలు చేస్తున్న శునకాలు

సేలం: ఏర్కాడులో 47వ వేసవి ఉత్సవాలలో భాగంగా శనివారం శునకాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివరాలు.. ఈ వేసవి ఉత్సవాల సందర్భంగా పర్యాటకులను అలరించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలు, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. 22వ తేదీ ఫ్లవర్ షోతో ప్రారంభమైన ఈ వేసవి ఉత్సవాలను 26వ తేదీ వరకు మాత్రమే నిర్వహించనున్నట్టు తొలుత ప్రకటించారు. అయితే పర్యాటకుల, వివిధ పార్టీల అభ్యర్థన మేరకు, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ తరఫున అన్నా పార్క్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్‌షోను ఈ నెల 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. 47వ ఏర్కాడ్ వేసవి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన అధికారులు, ఉద్యోగులందరినీ అభినందిస్తూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఏర్కాడు లేక్ పార్క్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బృందాదేవి సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం పెంపుడు జంతువుల ప్రదర్శన, గుర్రపు సాహస కార్యక్రమాలను పశుసంవర్థక శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పెంపుడు శునకాలతో వచ్చిన పర్యాటకులు పోటీలలో పెద్దఎత్తున పాల్గొన్నారు.







విన్యాసాలు చేస్తున్న శునకాలు

పోలీసులపై దాడి

• అన్నా, తమ్ముడి అరెస్ట్

తిరువొత్తియూరు: తిరుచెంగోడులో అసభ్యకరంగా తిడుతూ పోలీసుపై దాడి చేసిన అన్నా, తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలు.. నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో వైకాసి విశాఖ రథోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దీంతో అన్నా విగ్రహం ప్రాంతంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆ సమయంలో బైక్‌పై వేగంగా వెళ్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఇద్దరు యువకులు అక్కడ సెక్యూరిటీ డ్యూటీలో ఉన్న హోంగార్డులు నరేంద్ర అర్జున్ (32), ముఖిలన్ (30)పై అసభ్య పదజాలంతో దాడి చేశారు. ఇది చూసిన తిరుచెంగోడ్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్ స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ కలయరసి (45) వారిని అడ్డుకున్నారు. ఆమెపై కూడా ఇద్దరు యువకులు దాడి చేశారు. ఈ దృశ్యాలను పక్కనే ఉన్న కొందరు తమ సెల్‌ఫోన్లతో వీడియో తీశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో పోలీసులు ఇద్దరు యువకులను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని విచారించగా తిరుచెంగోడు అంజి రోడ్డు ప్రాంతానికి చెందిన ఆరుముగం కుమారులు విజయ్ (21), తామరైకన్నన్ (27)గా తేలింది. వీరు తిరుచెంగోడులో పూల వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. దీంతో వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

అన్నానగర్: చెరువలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. కాంచీపురం జిల్లా తిరుపెరంబత్తూర్ సమీపంలోని చత్రం ప్రాంతానికి చెందిన సూర్య (24). ఇతను శనివారం స్నేహితులతో కలిసి తిరుపెరంబుదూర్ చెరువులో స్నానానికి వెళ్లాడు. చెరువులో దిగి సూర్య స్నానం చేస్తుండగా నీట మునిగిపోయాడు. స్నేహితులు సూర్య కోసం వెతికినా కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

• 20 గ్రామాలకు సరఫరా నిలిపివేత

తిరువళ్లూరు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో హఠాత్తుగా చెలరేగిన మంటలతో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. దీంతో 20 గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అధికారులు మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. తిరువళ్లూరు జిల్లా తామరపాక్కం సమీపంలో వాణియసత్రం ప్రాంతం ఉంది. ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి 40 పైగా గ్రామాలకు విద్యుత్‌ను సరఫరాచేస్తున్నారు. ఈక్రమంలో సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శనివారం ఉదయం హఠాత్తుగా చెలరేగిన మంటలు క్షణాల్లో వ్యాపించాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. విషయం తెలిసి సిబ్బంది మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తూనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లిన చెన్నై, అంబత్తూరు, సెంగుద్రం, మనలి, మాధవరం అగ్నిమాపక సిబ్బంది



ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగుతున్న మంటలు

రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. దీంతో అలమాది, తామరపాక్కం, వాణియసత్రం ప్రాంతాలు, సమీప ప్రాంతాలకు చెందిన 20 గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపివేసి మరమ్మతు పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

ద్రౌపదీదేవి ఊరేగింపులో రెండు వర్గాల మధ్య ఘర్షణ

• పోలీస్ స్టేషన్ ముట్టడి
• తిరువలంగాడులో ఉద్రిక్తత

తిరుత్తణి: ద్రౌపదీదేవి ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో శనివారం స్థానిక మహిళలు పోలీస్ స్టేషన్ ముట్టడించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు గ్రామంలో ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ మహోత్సవం ఈనెల 17న ధ్వజారోహణంతో ప్రారంభమై 10 రోజుల పాటు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం భక్తుల అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తరువలంగాడు నడి వీధిలో అమ్మవారు ఊరేగింపు సందర్భంగా ఓ ఇంటి వద్ద పశువు చెవిలో యువకులు నాదస్వరం ఊదారు. దీనిపై ఆగ్రహం చెందిన పశువు యజమాని శేఖర్ గ్రామానికి చెందిన ఉదయకుమార్, లక్ష్మణ్‌పై దాడి చేశాడు. దీంతో వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి చక్కదిద్ది గాయాలైన వారిని తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఈ క్రమంలో ఘర్షణకు సంబంధిం ఫిర్యాదు చేసేందుకు శనివారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు ఒకే సమయంలో రెండు వర్గాలకు చెందిన మహిళలు సహా 100 మంది చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సీఐ రాజగోపాల్ రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి మహిళలు

స్టాలిన్ దంపతులకు పెళ్లి పత్రిక అందిస్తున్న అర్జున్, తంబిరామయ్య కుటుంబసభ్యులు



స్టాలిన్‌కు పెళ్లి పత్రిక

తమిళసినిమా: యాక్షన్‌కింగ్‌గా అభిమానులను అలరించిన నటుడు అర్జున్ కూతురు, నటి ఐశ్వర్యకు సినీ దర్శకుడు, నటుడు తంబిరామయ్య కుమారుడు, నటుడు ఉమాపతిల వివాహ వేడుక జూన్‌లో చెన్నైలో జరగనుంది. వీరి వివాహ నిశ్చితార్థం గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన జరిగింది. కాగా ఉమాపతి, ఐశ్వర్యల వివాహ వేడుకను ఘనంగా నిర్వహించడానికి అర్జున్, తంబిరామయ్య కుంటుంబాలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. వివాహ వేడుకను జూన్ 10న చెన్నై, గిరకంబాక్కంలో నటుడు అర్జున్‌కు చెందిన తోటలో నిర్వహించ తలపెట్టినట్లు సమాచారం. కాగా ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులను ఆహ్వానించే పనిలో అర్జున్, తంబిరామయ్య కుటుంబ సభ్యులు నిమగ్నమయ్యారు. అందులో భాగంగా శనివారం వీరి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు. పెద్ద పెట్టెలా ఉన్న ఈ ఆహ్వాన పత్రిక అందరినీ ఆకర్షిస్తోంది.

కోలీవుడ్ టాక్స్

మెట్రో కూలీ ప్రారంభం

తమిళసినిమా: మీరాన్ థియేటర్స్ సంస్థ నిర్మిస్తున్న మొదటి చిత్రం మెట్రో కూలీ. నటుడు అమ్జద్ మీరాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు, దర్శకత్వం బాధ్యతలను ఆయనే నిర్వహిస్తున్నారు. గురుప్రసాద్ సుబ్రమణియన్ సంగీతాన్ని, లండన్‌కు చెందిన శాంటోనియో టెర్సియో ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం, చిత్రంలో అమ్జద్ మీరాన్ నటిస్తున్న సోలైమలై పాత్ర పరిచయ కార్యక్రమాన్ని చెన్నైలోని ఠాగూర్ సినీ స్టూడియోలో శుక్రవారం నిర్వహించారు. దర్శకుడు శశి, నటుడు, నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, నటుడు, సంగీత దర్శకుడు, నిర్మాత విజయ్‌ఆంటోని, దర్శకుల సంఘం అధ్యక్షుడు నాజర్, జీవీ.ప్రకాశ్ కుమార్, దర్శకుడు సత్యప్రభాస్ పినిశెట్టి, భరత్ పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం చెన్నై శివారు ప్రాంతాల్లోని కూలీల ఇతివృత్తంతో రూపొందిస్తున్నట్లు చెప్పారు. రెండు భాగాలను ఒక్కో దాన్ని 7 గంటల నిడివితో రూపొందించి దాన్ని రెండు గంటలకు కుదించి చిత్రంగానూ, అనంతరం ఆ మొత్తాన్ని రెండు ఎపిసోడ్స్‌గా విభజించి సీరియల్‌గానూ, నాలుగు సీజన్లుగా ఓటీటీలోనూ స్ట్రీమింగ్ చేయనున్నట్లు యూనిట్ వర్గాలు పేర్కొన్నాయి.



మెట్రో కూలీ చిత్ర యూనిట్

మెయ్యళగన్ ఫస్ట్‌లుక్ విడుదల

తమిళసినిమా: సూర్య, జ్యోతిక తమ 2డీ ఎంటర్‌టెయిన్‌మెంట్ పతాకంపై నటుడు కార్తీ కథానాయకుడిగా నిర్మిస్తున్న తాజా చిత్రానికి మెయ్యళగన్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఇది కార్తీ నటిస్తున్న 27వ చిత్రం కావడం గమనార్హం. ఈ చిత్రానికి రాజశేఖర కర్పూర సుందరపాండియన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 96 చిత్రం ఫేమ్ ప్రేమ్‌కుమార్ కథ, కథనం, మాటలు, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్న ఇందులో నటుడు అరవిందస్వామి ప్రధాన పాత్రను పోషిస్తుండగా, రాజ్‌కిరణ్, శ్రీదివ్య, స్వాతీ కొండే, దేవదర్శిని, జయప్రకాశ్, శ్రీరంజని, ఇళవరసు, కరుణాకరన్, చరణ్, రచల్ రెబాకా, ఆంటోని, రాజ్‌కుమార్, ఇందుమతి, రాణిసంయుక్త, కయల్ సుబ్రమణి, అశోక్‌పాండియన్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. గోవింద్ వసంత సంగీతాన్ని, మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. శనివారం కార్తీ పుట్టినరోజు సందర్భంగా చిత్రానికి సంబంధించిన రెండు ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేశారు. అందులో ఒకటి కార్తీ ఎద్దుతో ముచ్చటిస్తున్నట్లు ఉండగా, రెండోది కార్తీ, అరవింద రాజ్ కలిసి సైకిల్‌లో వెళుతున్నట్లుగా ఉంది. ఈ పోస్టర్లను చూస్తుంటే మెయ్యళగన్ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే కుటుంబకథా చిత్రమని అనిపిస్తోంది. ఈ చిత్ర షూటింగ్‌ను కుంభకోణం, శివగంగై పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసినట్లు, ప్రస్తుతం డబ్బింగ్, ఎడిటింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో యూనిట్ వర్గాలు పేర్కొన్నాయి.



మెయ్యళగన్ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్

నేను జీవించే ఉన్నా!

తమిళసినిమా: నేటి తరం కథానాయికల విషయ పరిస్థితి ఏమింటే సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉన్నా తప్పే. లేకపోయినా తప్పే. నటి పార్వతీమీనన్‌ది ఇదే పరిస్థితి. అబుదాబిలో హైస్కూల్ వరకూ చదివిన ఈ బ్యూటీ ఆ తరువాత తన ఉన్నత విద్యను కర్ణాటకలో పూర్తిచేశారు. ఆ తరువాత మోడలింగ్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన పార్వతీ మీనన్ మిస్ కర్ణాటక అందాల పోటీలో పాల్గొని కిరీటాన్ని గెలుచుకున్నారు. కాగా మలయాళ చిత్ర పరిశ్రమలోకి నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈమె ఆ తరువాత 2015లో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అజిత్ హీరోగా నటించిన ఎన్నై అరిందాల్ చిత్రంలో అరుణ్‌విజయ్‌కు జంటగా నటించి గుర్తింపు పొందారు. ఆ తరువాత తమిళంతో పాటు కన్నడం, మలయాళం, హిందీ చిత్రాల్లోనూ నటిస్తున్న ఈమె ప్రస్తుతం కథానాయకిగా నటించిన రూపం, ఆలంబనా చిత్రాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. తాజాగా విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం గోట్ చిత్రంలోనూ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ చాలా యాక్టివ్‌గా ఉంటే పార్వతీమీనన్ ఇటీవల కనిపించకుండా పోవడంతో అభిమానులు ఆమెకు ఏమైందోననే ప్రశ్నలు గుప్పిస్తున్నారు. దీంతో వారి ప్రశ్నలకు స్పందించే విధంగా పార్వతీమీనన్ తన గ్లామరస్ ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. అందులో తాను జీవించే ఉన్నానని, మీ ప్రేమతో కూడిన మెసేజ్‌లకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. ఈమె కుటుంబం దుబాయిలో సెటిల్ అయ్యారన్నది గమనార్హం.



పార్వతీమీనన్

ఒక్క రోజు మగాడిలా ఉండాలని ఉంది

తమిళసినిమా: కోరికలే గుర్రాలైతే ఎలా ఉంటుంది? కుడి ఎడమైతే ఎలా ఉంటుంది? చాలా తమాషాగా ఉంటుంది కదూ. చెన్నై బ్యూటీ త్రిష కోరిక కూడా అలాంటి విచిత్రమైనదే. నటిగా రెండు దశాబ్దాల అనుభవం. మధ్యలో ఎత్తుపల్లాలు ఎదురైనా, నేటికీ ఎవర్‌గ్రీన్ హీరోయినే. ఇప్పటికీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలరే. ఇదీ త్రిష రికార్డ్. గ్లామర్ పాత్రలకైనా, ఉమెన్ సెంట్రిక్ కథా పాత్రలకైనా, ఏ భాషలోనైనా రెడీ అంటూ తన సత్తాను చాటుతున్న ఈ సంచలన బహుభాషా నటి త్రిష. ప్రస్తుతం తమిళంలోనే అజిత్ సరసన విడాముయర్చి, కమలహాసన్‌తో కలిసి థగ్‌లైఫ్ చిత్రాల్లో నటిస్తున్న ఈమె మలయాళంలో మోహన్‌లాల్ సరసన రామ్, టోవినో థామస్‌కు జంటగా ఐడెంటిటి, తెలుగులో చిరంజీవికి జంటగా విశ్వంభర చిత్రాల్లో నటిస్తున్నారు. ఇలా ఏక కాలంలో ఐదు భారీ చిత్రాల్లో నటిస్తున్న ఏకైక నటి త్రిషనే అయ్యుంటారు. ఈమె ఇంతకుముందు ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్న వ్యాఖ్యల వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందులో తనకు ఎప్పటి నుంచో ఒక కోరిక ఉందన్నారు. అదేమిటంటే తాను ఒక్క రోజు పురుషుడిగా ఉండాలన్నారు. ఒక కుర్రాడిలా ఉండడం ఎలా ఉంటుంది. అతని శరీర రూపకల్పన, అతని మానసిక స్థితి గురించి తెలుసుకోవాలని ఆశగా ఉంటుందన్నారు. ఈ విషయం గురించి తన తల్లితో పదే పదే చెబుతుంటానని అన్నారు. ఆమె కోరిక నిజంగా విచిత్రంగానూ, విడ్డూరంగానూ ఉంది కదూ!



త్రిష

క్లుప్తంగా

ఇంట్లోకి చొరబడి 2 సెల్‌ఫోన్‌లు చోరీ

- మరిచిపోయిన దొంగ సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ

తిరువొత్తియూరు: ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడిన దొంగ తన సెల్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఆ ఫోన్ ఆధరంగా దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. చెన్నై కొడుంగైయూరు ఎరుక్కంజేరి కృష్ణ మూర్తి రోడ్డుకు చెందిన వ్యక్తి షణ్ముగం (28). పెరంబూరులోని ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నాడు. గురువారం పనికి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చిన సమయంలో రెండు సెల్‌ఫోన్లు ఛార్జింగ్ పెట్టి ఇంటి హాలులో పడుకొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఏదో అలికిడి వినిపించడంతో లైట్ వేయగానే ఓ వ్యక్తి ఇంట్లో నుంచి పారిపోయాడు. షణ్ముగం వచ్చి చూడగా 2 సెల్‌ఫోన్లు కనిపించలేదు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తన బటన్ ఫోన్‌ను అక్కడే ఉంచినట్టు తెలిసింది. దీంతో ఆ ఫోన్ తీసుకున్న షణ్ముగం కొడుంగయూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో మంటలు

- కాలిపోయిన డాక్యుమెంట్లు

కొరుక్కుపేట: చెన్నై, వేలచ్చేరి మెయిన్ రోడ్డులోని తాండీస్వరం నగర్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు, ఏటీఎం సెంటర్ పనిచేస్తోంది. దాని పైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉంది. ఇక్కడ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. విషయం తెలిసి తిరువాన్మియూర్, అశోక్‌నగర్, గిండికి చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పొగ కమ్ముకోవడంతో వాహనదారులు ఊపిరాడక అవస్థలు పడ్డారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు విచారణలో తెలిసింది. బ్యాంకులోని ముఖ్యమైన పత్రాలు కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. మంటలను అదుపు చేసిన తర్వాత బ్యాంక్ మేనేజర్ బ్యాంకులోకి వెళ్లి నష్టాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2 టన్నుల గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

- నలుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నైలో గుట్కా విక్రయాలు సాగిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి 2 టన్నుల గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చెన్నైలో నిషేధిత గుట్కా ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక పోలీసు యంత్రాంగం నిఘా పెట్టింది. ఈ క్రమంలో టీపీ చత్రం ప్రాంతానికి వెళ్లిన 4 ట్రక్కులను ప్రత్యేక బలగాల పోలీసులు నిలిపి సోదాలు చేశారు. అందులో నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి 2 టన్నుల గుట్కా ప్యాకెట్లు, 4 వాహనాలను ప్రత్యేక పోలీసులు స్వాధీనం చేసుకున్నాయి. గుట్కా తరలిస్తున్న సంఘటనకు సంబంధించి పట్టా బాల్‌రాజ్, శివ, ముత్తుకుమార్, విల్సన్ అనే నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో కర్ణాటకలోని బెంగళూరు నుంచి నిషేధిత గుట్కా ఉత్పత్తులను అక్రమంగా తరలించి చెన్నై నలుమూలల దుకాణాలకు విక్రయిస్తున్నట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది నిందితులకు బెయిల్ రద్దు

తిరువొత్తియూరు: ఢిల్లీలోని నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఎన్ఐఏ అధికారులు తమిళనాడుతో పాటు వివిధ రాష్ట్రాల్లోని పాపులర్ బ్రాండ్ ఆఫ్ ఇండియా కార్యాలయాల్లో మొదటి దశ సోదాలు చేసి పలువురిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీనికి సంబంధించి ఎన్ఐఏ అధికారులు పూందమల్లిలోని నేషనల్ ఇన్వెస్టిగేషన్ స్పెషల్ కోర్టుకు 13 మందికి బెయిల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో వారి బెయిల్‌ను రద్దు చేయాలని ఎన్ఐఏ అధికారులు ఇర్తియాస్ (ఎ) అహ్మద్ ఇరత్తి యాస్, మహమ్మద్ అబు తాహిర్, ఖలీల్ మహమ్మద్, సయ్యద్ ఇసాక్, ఖాజా మొయిదీన్, యాసర్ అరాఫత్, బరకతుల్లా, పయస్ అహమ్మద్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనల అనంతరం 8 మంది బెయిల్‌ను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. దీంతో వారంతా గురువారం పురసైవాక్కంలోని ఎన్ఐఏ కార్యాలయంలో లొంగిపోయారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం పూందమల్లిలోని జాతీయ దర్యాప్తు ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి ఇళవళగన్ సమక్షంలో హాజరుపరిచారు. జూన్ 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిందితులను పుళల్ జైలుకు తరలించారు.

ఆవిన్ ఉద్యోగులు ముగ్గురు సస్పెన్షన్

తిరువళ్లూరు: కాకలూరులోని ఆవిన్ పాల కేంద్రంలో భారీగా అవినీతి వెలుగులోకి రావడంతో డిప్యూటీ మేనేజర్‌తో పాటు ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జనరల్ మేనేజర్ రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరువళ్లూరు జిల్లా కాకలూరులో ఆవిన్ పాల కేంద్రం లో కొద్దిరోజులుగా అవినీతి జరుగుతోందని భారీగా పాలను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్టు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. ఇందులో భాగంగానే డీఎస్పీ సత్యశీలన్ నేతృత్వంలోని విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి 1,620 లీటర్ల పాలను అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. 13 గంటల పాటు ఏకధాటిగా విచారణ చేసిన డీఎస్పీ సత్యశీలన్ నేతృత్వంలోని విజిలెన్స్ అధికారులు కోట్లాది రూపాయల మేరకు అవినీతి జరిగిందని నిర్ధారించి నివేదికను చెన్నై ఎండీకి అందజేశారు. నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల సూచన మేరకు ఆవిన్ కేంద్రం డిప్యూటీ మేనేజర్ కనీషా, అసిస్టెంట్ మురళి, జూనియర్ అసిస్టెంట్ రాజా ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతిలో మరి కొంత మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రమేయం వుండడంతో వారిపై సైతం చర్యలు చేపడతామని ఆవిన్ జీఎం స్పష్టం చేశారు.


ఐదు టన్నుల ద్రాక్షతో రూపొందిన కింగ్‌కాంగ్



ఆకట్టుకుంటున్న డైనోసార్



తంజావూరు బొమ్మ



కున్నూరులో పండ్ల ప్రదర్శన అదుర్స్

కున్నూర్ సిమ్స్ పార్కులో మూడు రోజుల పాటు నిర్వహించే 64వ పండ్ల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. పలు రకాల పండ్లతో వివిధ ఆకృతులను ఏర్పాటు చేశారు. ఊటీలో ప్రతి వేసవిలోనూ పర్యాటకులను ఆకర్షించే రీతిలో పుష్ప ప్రదర్శన, రోజా పూల వంటి పలు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో చివరి ప్రదర్శన పండ్ల ప్రదర్శన. ఈ 64వ పండ్ల ప్రదర్శనను కలెక్టర్ అరుణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ద్రాక్ష పండ్లు, ఆరంజ్, సాత్తుకుడి, కమలా, నిమ్మ, పైనాపిల్, అరటి, దానిమ్మ, స్ట్రాబెర్రీ వంటి పలు పండ్లతో ఏర్పాటు చేసి ఆకృతులు సందర్శకులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా సందర్శకులకు కలెక్టర్ అరుణ పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. - సేలం



పర్యాటకులకు మొక్కలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ

కరత్రో దాడి..కార్మికుడి హత్య

తిరువొత్తియూరు: మద్యం మత్తులో ఓ కార్మికుడిని పరోటా మాస్టర్ హతమార్చాడు. రామనాథపురం సమీపంలోని తూర్పుసాయకర గ్రామానికి చెందిన రవికుమార్ (35) కార్మికుడు. ఇతని బంధువు గణేశన్ (40) పరోటా మాస్టర్. వీరిద్దరూ ఆ ప్రాంతంలోని టాస్మాక్ దుకాణానికి వెళ్లి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. రవికుమార్ ఇటుక రాయిని తీసుకుని గణేశన్‌పై దాడి చేశాడు. వెంటనే గణేశన్ వెదురు కర్రతో రవికుమార్ తలపై కొట్టాడు. ఈదాడిలో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు గణేశన్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

కొరుక్కుపేట: కాంచీపురం జిల్లా తిరుమాల్‌పూర్ - అరక్కోణం మధ్య మంజంపట్టు ప్రాంతంలో రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు చెంగల్పట్టు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహం దగ్గర ఉన్న సెల్‌ఫోన్ నుంచి ఓ నంబర్‌కు కాల్ చేయగా ఆస్పత్రికి వచ్చిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని దక్షిణామూర్తి అని గుర్తించారు. అరక్కోణంకు చెందిన నటరాజన్ కుమారుడు దక్షిణమూర్తి (26) అలియాస్ దక్షిణ అని తేలింది. తర్వాత మృతదేహాన్ని పరీక్షించిన వైద్యులు రైలు ప్రమాదానికి ముందే దక్షిణమూర్తిని ఎవరో హత్య చేసి, ఆ తర్వాత రైలు పట్టాలపై పడవేసినట్టు గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డ్యాం పరిరక్షణకు పోరుబాట

- ఏకమైన ఐదు జిల్లాల రైతాంగం



ముల్లై పెరియార్ డ్యాం

సాక్షి, చెన్నై: ముల్లై పెరియార్ జలాశయం హక్కులను పరిరక్షించుకునేందుకు రైతలంతా ఏకమయ్యారు. ఆ జలాశయం ఆధారిత ఐదు జిల్లాల రైతులు పోరుబాటకు పిలుపు నిచ్చారు. ఈనెల 27న కేరళ సరిహద్దుల్లోని తేనిలో ఉన్న ఆ జలాశయం నిర్మించిన బ్రిటీష్ ఇంజినీరు బెన్నీక్విక్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించారు. వివరాలు.. కేరళలోని తమిళ జలాశయం ముల్లై పెరియార్‌కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాలకు పదునుపెట్టిన విషయం తెలిసిందే. ఈ డ్యాం స్థానంలో కొత్త డ్యాం నిర్మాణాలు చేపట్టడమే లక్ష్యంగా అనుమతుల కోసం కేంద్రానికి పంపిన నివేదిక ఈనెల 28న సమీక్షకు రానుంది. ఈ సమాచారంతో రైతులలో ఆగ్రహం బయలుదేరింది. కేరళ చర్యలను అడ్డుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. సీఎం స్టాలిన్ సైతం ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రికి లేఖ రాశారు. ఈ పరిస్థితులలో కేరళ చర్యలను ఖండించే విధంగా ఆ జాలాశయంపై ఆధార పడ్డ తేని, మదురై, దిండుగల్, విరుదునగర్, శివగంగై జిల్లాల రైతులు ఏకమయ్యారు. కేరళ నివేదికను పరిశీలనకు తీసుకోవద్దని, ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ భారీ నిరసనకు సిద్ధమయ్యారు. ఈనెల 27న తేని నుంచి ర్యాలీగా కేరళ సరిహద్దులలోని తమిళ భూభాగంలో ఉన్న ఇంజినీరు బెన్నీ క్విక్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శనకు శనివారం నిర్ణయించారు. పెద్దఎత్తున రైతులోకం తరలి రావాలని నిరసన కారులు పిలుపు నిచ్చారు. దీంతో రెండు రాష్ట్రాల సరిహద్దులలో ఎలాంటి ఉద్రిక్త వాతావరణ నెలకొనకుండా ముందు జాగ్రత్తగా భద్రత కట్టుదిట్టానికి ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో ఇదే తరహాలో జరిగిన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. దీంతో ముందు జాగ్రత్తగా భద్రతా చర్యలను తేని, మదురై, విరుదునగర్ జిల్లాల పోలీసులు చేపట్టారు. ఇదిలా ఉండంగా అమరావతి జలాశయానికి నీరు రాకుండా అడ్డు పడే విధంగా శిలంది నదీ తీరంలో కేరళ నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను వ్యతిరేకిస్తూ తిరుప్పూర్‌లో శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. అలాగే తమిళ రైతుల బృందం ఆ పనులు జరుగుతున్న పరిసరాలను పరిశీలించి వచ్చారు.



మార్కెట్‌లోకి కొత్త ఈవీలు

ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ తయారీ సంస్థ బీఎన్‌సీ మోటార్స్ తన సేవల విస్తరణలో భాగంగా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను సిద్ధం చేసింది. కోయంబత్తూరులో రెండవ ఫ్లాగ్ షిప్‌గా ఏర్పాటు చేసిన షోరూమ్‌లో ఈ వాహనాలను ఆవిష్కరించారు. ఈ వాహనాలను ముందుగా బుక్ చేసుకున్న వారికి ఆ సంస్థ సీఈఓ అనిరుధ్ నారాయణన్, నిర్వాహకుడు మణి గౌండర్‌లు తాళాలను అందజేశారు. - సాక్షి, చెన్నై

ఖైదీల్లో మార్పునకు కృషిచేయాలి



పుస్తకావిష్కరణలో ప్రతినిధులు

వేలూరు: జైల్లోని ఖైదీల్లో మార్పు తీసుకొచ్చేందుకు జైలర్లు కృషిచేయాలని కాట్పాడి అగ్జిలియమ్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ ఆరోగ్య జయశీలి తెలిపారు. వేలూరు సెంట్రల్ జైలు సమీపంలోని ఆఫ్కా శిక్షణ కేంద్రంలో వివిధ రాష్ట్రాలకు చెందిన జైలు అధికారులకు జైలులో ఖైదీల పట్ల నడుచుకోవాల్సిన పద్ధతి, పరిపాలన విధానం వాటిపై 43వ బ్యాచ్ శిక్షణ తరగతులు నిర్వహించి ముగింపు కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. ఆమె మాట్లాడుతూ జైలు అనేది క్షణికావేశంతో చేసే తప్పులకు శిక్షణ ఇచ్చే స్థలం కాదని ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే స్థలంగా ఉండాలన్నారు. జైలు ఖైదీలకు జైలులో కనీస వసతులు ఏర్పాటు చేయాలని చట్టాలు చెపుతోందని అయితే వారికి కొన్ని నిబంధనలున్నాయన్నారు. తమిళనాడులోని జైలు ఖైదీలచే పెట్రోల్ బంకులు, కాయగూరల మార్కెట్‌ను విక్రయించడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా ఖైదీల్లో మార్పు తీసుకొచ్చేందుకు సులభతరంగా ఉంటుందన్నారు. ఖైదీలచే ఇటువంటి వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా బయట విడుదలైన అనంతరం వారు నేరాలకు పాల్పడకుండా ఇటువంటి పనులు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందిన జైలర్లు ఖైదీల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రేమతో పలకరించి అభిమానంగా చూడడం వల్ల అనేక జైలు ఖైదీల్లో మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆఫ్కా శిక్షణ కేంద్రం డైరెక్టర్ ప్రదీప్, కోఆర్డినేటర్ బ్యూలా వివిధ రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ జైలు సూపరిండెంట్‌లు పాల్గొన్నారు.

చెత్తకుప్పల పొగతో ఇక్కట్లు



చెత్తకుప్పకు నిప్పు పెట్టడంతో తీవ్రమైన పొగ వ్యాపించి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. తిరుత్తణి మున్సిపాలిటీలో పరిధిలో పారిశుధ్య సిబ్బంది సేకరిస్తున్న చెత్తకుప్పలను పెరియార్ నగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పెరియార్ నగర్‌లోని చెత్తకుప్పకు శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి పెరియార్ నగర్‌లో పొగ కమ్ముకుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు శ్వాస సమస్య చోటుచేసుకుంది. వెంటనే మున్సిపాలిటీ సిబ్బందితో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది సంయుక్తంగా రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. - తిరుత్తణి

13 కేజీల గుట్కా స్వాధీనం

- ఒకరి అరెస్ట్

తిరుత్తణి: బైకులో తరలిస్తున్న 13 కేజీల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రాకు చెందిన ఒకరిని అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లాలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించే విధంగా జిల్లా పోలీసులతో పాటు ప్రత్యేక టీంలు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో కనకమ్మసత్రం పోలీసులు శుక్రవారం రాత్రి పూనిమాంగాడు సమీపంలో ఆంధ్రా సరిహద్దు వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఓ బైకును ఆపి తనిఖీ చేశారు. బైకులోని గోనెసంచెలో 13 కేజీల గుట్కా ఉన్నట్లు గుర్తించారు. బైకుతో పాటు గుట్కాను స్వాధీనం చేసుకుని ఒకరిని కనకమ్మసత్రం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో చిత్తూరు జిల్లా నగరి సమీపం ఓజీకుప్పం గ్రామానికి చెందిన శివ(33) అని తెలిసింది. ఆంధ్రాలో తక్కువ ధరకు గుట్కా కొనుగోలు చేసి తిరువళ్లూరులో అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నేరం అంగీకరిండాడు. పోలీసులు కేసు నమోదు చేసిన శివను అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం తిరుత్తణి కోర్టులో హాజరుపరిచి తిరుత్తణి సబ్‌జైలుకు తరలించారు.

డ్రైనేజీ కాలువలో మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేలూరు: డ్రైనేజీ కాలువలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. కాట్పాడి రైల్వేస్టేషన్ నుంచి గుడియాత్తం రోడ్డులో తాలుకా కార్యాలయం ఎదుట ఉన్న డ్రైనేజీ కాలువలో మృతదేహం ఉన్నట్లు వాహన చోదకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని హత్య చేసిన 13 ఏళ్ల విద్యార్థి

అన్నానగర్: మదురై జిల్లా, మేలూర్ సమీపంలోని కథపట్టి ప్రాంతంలో పౌస్ ప్రైవేట్ డేసన్ ఆధ్వర్యంలో ఓ అరబిక్ పాఠశాల పనిచేస్తోంది. బిహార్‌కు చెందిన 13 మంది విద్యార్థులు ఇక్కడే ఉండి చదువుకుంటున్నారు. ఈ స్థితిలో అరబిక్ పాఠశాలలో షానవాజ్ (9) అనే బాలుడు కూడా ఉన్నాడు. అతనితో పాటు చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థికి మధ్య శుక్రవారం రాత్రి తగాదా జరిగినట్లు తెలుస్తుంది. దీంతో కోపోద్రిక్తుడైన విద్యార్థి కూరగాయలు కోసేందుకు అక్కడే ఉంచిన కత్తిని తీసుకుని బాలుడు షానవాజ్‌ను పొడిచాడు. షానవాజ్ రక్తపుమడుగులో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. 13 ఏళ్ల విద్యార్థి భయాందోళనలో హత్యను గ్రహించి, బాలుడి మృతదేహాన్ని ఎవరికీ కనిపించకుండా దాచడానికి సమీపంలోని మురుగు నీటి ట్యాంక్‌లో దాచిపెట్టి ఏమీ తెలియనట్లుగా తిరిగి పాఠశాలకు వచ్చాడు. ఇంతలో ఎంతసేపటికీ షానవాజ్ హాస్టల్‌కు రాకపోవడంతో యాజమాన్యం షాక్‌కు గురైంది. చాలా చోట్ల వెతికారు. కానీ ఆచూకీ తెలియలేదు. దీని గురించి పాఠశాల నిర్వాహకులు మేలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి పోలీసులు వారు వచ్చి హాస్టల్‌లో ఉంటున్న ఇతర విద్యార్థులను క్షుణ్ణంగా విచారించారు. ఆ సమయంలో నిందితుడైన 13 ఏళ్ల విద్యార్థి షానవాజ్‌ను హత్య చేసి మురుగునీటి ట్యాంక్‌లో దాచినట్లు ఒప్పుకున్నాడు. తన తల్లిని హీనంగా మాట్లాడినందుకే హత్య చేశానని ఆ బాలుడు చెప్పాడు. పోలీసులు షానవాజ్ మృతదేహాన్ని మురుగు నీటి తొట్టిలోంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలతో ముఖ్యమంత్రి ఏర్పాట్లు ముమ్మరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభుశంకర్

- అధికారులతో కలెక్టర్ సమీక్ష

తిరువళ్లూరు: ప్రజలతో ముఖ్యమంత్రి పేరిట నిర్వహించనున్న రెండో దశ శిబిరాలకు ఏర్పాట్లను ముమ్మరం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రజలతో ముఖ్యమంత్రి పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని గత సంవత్సరం డిసంబర్ 18న కోయంబత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి శిబిరానికి ప్రజలు వచ్చి తమ సమస్యలను వినతి పత్రం ద్వారా సమర్పించారు. అనంతరం వినతుల్లో కొన్నింటిని పరిష్కరించారు. ఇప్పటికే మొదటి దశ శిబిరాలు పూర్తయిన నేపథ్యంలో రెండోదశలో జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం 141 శిబిరాలను ఏర్పాటు చేయాలని, శిబిరాలకు వచ్చి ప్రజలు ఇచ్చే వినతి పత్రంపై జవాబుదారి తనాన్ని ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజల నమ్మకం పొందేలా అధికారులు వ్యవహరించాలన్న ఆయన, శిబిరానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ



పళ్లిపట్టులో సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న అముద

పళ్లిపట్టు: పళ్లిపట్టు సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో హోంశాఖ కార్యదర్శి అముద శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. అదే సమయంలో రాష్ట్ర సరిహద్దులో పోలీసులకు కనీస సౌకర్యాలకు సంబంధించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రా నుంచి తమిళనాడులోకి ప్రవేశిస్తున్న వాహనాలను తనిఖీ చేసేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతిక కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్ట్‌లో 24 గంటల పాటు పోలీసులు విధులు నిర్వహించాలని ఆదేశించారు. తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్, తహసీల్దార్ మదన్, సీఐ మలర్ పాల్గొన్నారు.

వేడుకగా మత సామరస్య మహోత్సవం



మహోత్సవంలో పాల్గొన్న వివిధ మతస్తులు

తిరుత్తణి: మత సామరస్యత చాటి చెప్పే విధంగా నిర్వహించిన వేడుకల్లో వివిధ మతాలకు చెందిన వ్యక్తులు పాల్గొని భిన్నత్వంలో ఏకత్వం చాటుకున్నారు. తిరుత్తణి సమీపంలోని తాడూరులో పవిత్ర సహాయ అన్నై ఆలయంలో 54వ వార్షికోత్సవ మత సామరస్య వేడుకలు శనివారం నిర్వహించారు. వేడుకల్లో హిందూ, ముస్లిం, క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ చర్చి నిర్వాహకులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. భిన్నత్వంలో ఏకత్వంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి జీవించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వేడుకల్లో భాగంగా పవిత్ర మేరిమాత రథోత్సవం నిర్వహించారు.

ఆవు పొడిచి కార్మికుడి మృతి

కొరుక్కుపేట: విక్రవాండి దగ్గర ఆవు పొడవటంతో చికిత్స ఫలించక ఓ కూలీ మృతి చెందాడు. వివరాలు.. విక్రవాండి తదుపరి విదురుడు న్యూకాలనీలో నివాసముంటున్న గంగదురై (75) ఈనెల 22న ఇంటి వద్ద ఆవు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ గంగదురై మృతి చెందాడు. కుమారుడు శశికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విక్రవాండి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలవేర్కాడు సరస్సులో చేపల సంరక్షణపై పరిశీలన

కొరుక్కుపేట: చెన్నై శివారులోని పలవేర్కాడు సరస్సులో వ్యాపించే వైరస్‌ల వల్ల చేపలు, పీతల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. దీనిపై వైల్డ్ లైఫ్ కన్జర్వేటర్ మనీష్ మీనన్ తాజాగా విచారణ చేపట్టింది. వివరాలు.. చెన్నైలోని పులికాట్ సరస్సు (పలవేర్కాడు సరస్సు) మన దేశంలో రెండవ అతిపెద్ద ఉప్పు సరస్సు. ఇది సింహం రొయ్యలు, పీతలు, చేపలతో సహా 50 కంటే ఎక్కువ జాతుల సముద్ర జీవులకు నిలయం. సముద్ర తాబేళ్లు, పాములు వంటి సముద్ర జీవులు నీటిపారుదల సమయంలో సరస్సులోకి ప్రవేశించడం, సంతానోత్పత్తి చేయడం ఈ ఇక్కడ తరచూ జరుగుతుంటుంది. సింగపూర్, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, కొల్లాంలోని ఉప-భాగాల్లో ఇప్పటికే విధ్వంసం సృష్టించిన అమెరికన్ ఉప్పు నీటి క్లామ్‌లు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. దీనిపై అధ్యయనం చేసిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్, కోస్టల్ అండ్ మెరైన్ రిసోర్స్ ప్రొటెక్షన్ విభాగానికి చెందిన వింజ్ఞియాని వి దీపక్ శామ్యూల్ పేర్కొంటూ వన్యప్రాణుల సంరక్షకులు దీనిని ప్రత్యేకంగా పరిశీలించనున్నట్టు వివరించారు.

మొదటి విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	639
డిగ్రీ, ఆ పైన	836
అక్షరాస్యులు	36
నిరక్షరాస్యులు	26

రెండో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	533
డిగ్రీ, ఆ పైన	574
అక్షరాస్యులు	37
నిరక్షరాస్యులు	8

మూడో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	639
డిగ్రీ, ఆ పైన	591
అక్షరాస్యులు	56
నిరక్షరాస్యులు	19

లోక్‌సభ అభ్యర్థుల్లో... 121 మంది నిరక్షరాస్యులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో 121 మంది నిరక్షరాస్యులు. 359 మంది 5వ తరగతి దాకా, 647 మంది 8వ తరగతి వరకు చదువుకున్నారు. 1,303 మంది ట్వెల్త్ గ్రేడ్ పాసయ్యారు. 1,502 మంది డిగ్రీ చదవగా 198 మంది డాక్టరేట్ అందుకున్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ఈ మేరకు వెల్లడించింది. ఏడు దశల్లో బరిలో ఉన్న మొత్తం 8,360 మంది అభ్యర్థుల్లో 8,337 మంది విద్యార్హతలను ఏడీఆర్ విశ్లేషించింది...

– న్యూఢిల్లీ

నాలుగో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	644
డిగ్రీ, ఆ పైన	944
అక్షరాస్యులు	30
నిరక్షరాస్యులు	26

ఐదో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	293
డిగ్రీ, ఆ పైన	349
అక్షరాస్యులు	20
నిరక్షరాస్యులు	5

ఆరో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	332
డిగ్రీ, ఆపైన	509
అక్షరాస్యులు	12
నిరక్షరాస్యులు	13

ఏడో విడత	
విద్యార్హత	అభ్యర్థులు
5-12వ తరగతి	402
డిగ్రీ, ఆపైన	450
అక్షరాస్యులు	26
నిరక్షరాస్యులు	24

ఫలోదీ సట్టా బజార్లో... తగ్గిన బీజేపీ హవా

300కు మించకపోవచ్చని అంచనాలు
- ఎన్డీఏకు 350 నుంచి 332కు తగ్గింపు
- కాంగ్రెస్‌కు 60 వస్తాయంటూ బెట్టింగ్



లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై రాజస్తాన్‌లోని ఫలోదీ సట్టా బజార్ తాజా అంచనాలు ఎలా ఉన్నాయి? కచ్చితమైన అంచనాలు, బెట్టింగ్‌లకు దేశమంతటా పేరొందిన ఫలోదీ మార్కెట్ ఇప్పటికీ బీజేపీ సొంతంగా మెజారిటీ సాధిస్తుందని నమ్ముతోంది. అక్కడి పంటర్లు మోదీ సర్కారుపైనే బెట్టింగులు కడుతున్నారు. కానీ నెలక్రితం అంచనాలతో పోలిస్తే బీజేపీ నెగ్గబోయే స్థానాల సంఖ్య బాగా తగ్గడం విశేషం. బీజేపీ 330 నుంచి 333 స్థానాలు నెగ్గుతుందని తొలి విడత పోలింగ్‌కు ముందు దాకా ఇక్కడ జోరుగా పందేలు సాగాయి. కానీ ఇప్పుడది 296 నుంచి 300 సీట్లకు పరిమితమైంది...!

క్రమంగా తగ్గుదల..

ఒక్కో విడత పోలింగ్ జరుగుతున్న కొద్దీ ఫలోదీ బజార్లో బీజేపీకి అంచనాలు తగ్గుతూ వస్తున్నాయి. 307 నుంచి 310 స్థానాలు గెలుస్తుందంటూ మే 13న నాలుగో విడత పోలింగ్‌కు ముందు పందేలు నడిచాయి. నాలుగో దశ ముగిశాక తాజాగా 296 నుంచి 300కు తగ్గాయి. ఎన్డీఏకు 350 దాటుతాయని తొలుత పేర్కొనగా, 329 నుంచి 332 మధ్య రావచ్చని తాజాగా పందేలు సాగుతున్నాయి. 2019 ఎన్నికల్లో ఎన్డీఏకు 353 స్థానాలు రావడం తెలిసిందే. ఇక కాంగ్రెస్‌కు 41 నుంచి 43 సీట్ల కన్నా రావని నెల క్రితం అంచనా వేసిన ఫలోదీ పందెంరాయుళ్లు కాస్తా, 58 నుంచి 62 స్థానాలు గెలుస్తుందని తాజాగా బెట్లు కడుతున్నారు. 2019లో కాంగ్రెస్‌కు 52 స్థానాలొచ్చాయి. ఈసారి నాలుగు విడతల్లో పోలింగ్ 2019 ఎన్నికలతో పోలిస్తే కాస్త తగ్గడం తెలిసిందే. తదనుగుణంగా ఫలోదీ మార్కెట్ కూడా బీజేపీ విషయంలో అంచనాలను సవరించుకున్నట్టు కనిపిస్తోంది.

రాష్ట్రాల వారీగా..

ఫలోదీ సట్టా బజార్ తాజా బెట్టింగ్‌ల ప్రకారం బీజేపీ గుజరాత్‌లో క్లీన్‌స్వీప్ చేస్తుంది. 26 స్థానాలూ గెలుస్తుంది. మధ్యప్రదేశ్‌లోని 29కి 27–28 రావచ్చు. రాజస్తాన్‌లో 2019లో 24 గెలవగా ఈసారి 18–20తో సరిపెట్టుకోవచ్చు. ఒడిశాలోని మరో 4 స్థానాలు అదనంగా 11 నుంచి 12 రావచ్చు. పంజాబ్‌లో 2019లో రెండు గెలవగా ఈసారి 2 నుంచి 3 రావచ్చు. మొత్తం 10 స్థానాలూ గెలిచిన హరియాణాలో 5 నుంచి 6తో సరిపెట్టుకోవచ్చు. తెలంగాణలో 4 గెలవగా ఈసారి 5 నుంచి 6 రావచ్చు. ఛత్తీస్‌గఢ్‌లోని 11, హిమాచల్‌ప్రదేశ్‌లోని 4, ఉత్తరాఖండ్‌లోని 5 స్థానాలనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుంది. జార్ఖండ్‌లో మళ్లీ 10 నుంచి 11 దాకా రావచ్చు. 2019లో ఒక్క సీటూ నెగ్గని తమిళనాడులో 3 నుంచి 4 స్థానాలు రావచ్చని బెట్టింగులు నడుస్తున్నాయి. కీలకమైన పశ్చిమబెంగాల్‌లో 2019లో 18 చోట్ల గెలవగా ఈసారి 21 నుంచి 22 దాకా రావచ్చు. యూపీలో 63 చోట్ల గెలిచిన బీజేపీ ఈసారి మరో రెండు సీట్లు పెంచుకోవచ్చని సట్టా బజార్ అంచనా.

కచ్చితత్వం ఎక్కువ...

ఎన్నికల ఫలితాల విషయంలో ఫలోదీ మార్కెట్ ఏం చెబితే అదే జరుగుతుందన్న నమ్మకముంది. ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ఫలోదీ బుకర్ల అంచనాలే అక్షరాలా నిజమయ్యాయి. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ విషయంలో దాదాపుగా ఎగ్జిట్ పోల్స్ అన్నీ తలకిందులు కాగా సట్టా బజార్ అంచనాలు మాత్రమే నిజమయ్యాయి.

బీజేపీ స్థానాలు	బెట్టింగ్
(అంచనా నిజమైతే ప్రతి రూపాయికీ చెల్లించాల్సిన మొత్తం)	
300	30-37 పైసలు
310	55-65 పైసలు
320	110-160 పైసలు
325	150-225 పైసలు

కాంగ్రెస్ స్థానాలు	బెట్టింగ్
35	28-35 పైసలు
40	35-45 పైసలు
50	30-200 పైసలు

– సాక్షి, నేషనల్ డెస్క్



కాశీ చుట్టూ ప్రదక్షిణం!

మోదీ కోసం వారణాసిలో దక్షిణాది నేతల ప్రచారం
- తెలుగు, తమిళ, కన్నడ సంఘాలను ఆకట్టుకునే యత్నం
- తెలుగు రాష్ట్రాల నుంచి బండి, జీవీఎల్, పొంగులేటి తదితరులు
- తమిళనాడు, కర్ణాటక చీఫ్‌లు అన్నామలై, బీవై విజయేంద్ర మకాం

దక్షిణాది రాష్ట్రాల బీజేపీ నేతలు పాలోమని కాశీ బాట పడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ స్థానంలో మూడోసారి పోటీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అక్కడ అధికంగా ఉండే దక్షిణాది ప్రజల ఓట్లే లక్ష్యంగా కలియదిరుగుతున్నారు. తెలుగు, తమిళ సంఘాలతో సమావేశమవుతున్నారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న దక్షిణాది ఆశ్రమాల పెద్దలతో ఉదయం, సాయంత్రం బైఠక్‌లు నిర్వహిస్తున్నారు.

దక్షిణాది వారే కీలకం..

వారణాసి నియోజకవర్గంలో 18.50 లక్షల ఓట్లున్నాయి. వీరిలో దక్షిణాది ఓటర్లు కనీసం 3 లక్షల పై చిలుకే ఉంటారు. తెలుగు, తమిళ ఓటర్లు 2 లక్షల దాకా ఉంటారు. కన్నడ, మలయాళీలు లక్ష మంది ఉన్నారు. కాశీలోనే దక్షిణాది రాష్ట్రాల నిర్వహణలో కనీసం 200 వరకు ఆశ్రమాలున్నాయి. ఇలా వారణాసిలో దక్షిణాది ఓటర్లు కీలకంగా మారారు. 2019 ఎన్నికల్లో మోదీ 6.74 లక్షల ఓట్లు (63.62 శాతం) సాధించారు. ఈసారి ఏకంగా 80 శాతం ఓట్లను బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా దక్షిణాది వారి ఓట్లు అత్యధికంగా మోదీకే వచ్చేలా చూడాలని అధిష్టానం భావిస్తోంది. దాంతో ఆయా రాష్ట్రాల కీలక నేతలు ఇప్పటికే రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి 50 మంది ఓటర్లకు ముగ్గురు, నలుగురితో కూడిన బృందం చొప్పున పని చేస్తోంది! అంతేగాక ఒక్కో బృందం రోజుకు 4 నుంచి 5 సమూహాలతో భేటీలు నిర్వహిస్తోంది. వారణాసిలో ఇలాంటి బృందాలు ఏకంగా 2,000 దాకా పనిచేస్తున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నారు!

ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత డిసెంబర్ నుంచే తెలుగు, తమిళ సంగమం పేరుతో వారణాసిలో బీజేపీ పలు కార్యక్రమాలు నిర్వహించింది. మోదీ వర్చువల్‌గా వాటిలో పాల్గొన్నారు. దక్షిణ కాశీగా పేర్కొనే వేములవాడకు కాశీతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేస్తూ తెలుగు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాశీలో నివసించే దక్షిణాది వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు తీసుకున్న చర్యల గురించి వివరించారు. వారణాసి రైల్వే స్టేషన్‌తో పాటు ప్రధాన దారులు, కూడళ్లలో దక్షిణాది పర్యాటకుల సౌలభ్యం కోసం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రకటనలు తదితరాలు ఏర్పాటు చేయించడాన్నీ గుర్తు చేశారు.

కీలక నేతలంతా అక్కడే..

వారణాసిలో చివరిదైన ఏడో విడతలో భాగంగా జూన్ 1న పోలింగ్ జరగనుంది. అక్కడి దక్షిణాది ఓటర్లతో సమన్వయ బాధ్యతలను తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌కు అధిష్టానం అప్పగించింది. ఆయన వారం రోజులుగా అక్కడే ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ నుంచి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బి.బి.పాటిల్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్; ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తమిళనాడు నేతలు గాయత్రీ దేవి, ఆర్.రాజలక్ష్మి, సి.టి.పళనిస్వామి, తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయనార్ నాగేంద్రన్, కె.గోపాలస్వామి, కేరళకు చెందిన పీకే కృష్ణదాస్, కుమ్మనం రాజశేఖర్ తదితరులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం నుంచి బీజేపీ తమిళనాడు, కర్ణాటక అధ్యక్షులు అన్నామలై, బి.వై.విజయేంద్ర కూడా వారణాసిలోనే వారం పాటు మకాం వేసి ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ''మోదీ కూడా ఆదివారం నుంచి వారణాసిలో సభలు, ర్యాలీల్లో పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలతోనూ ఆయన మమేకమయ్యేలా కార్యక్రమం ఏర్పాటు చేసే యోచన ఉంది'' అని బీజేపీ కీలక నేత ఒకరు వెల్లడించారు.

– సాక్షి, న్యూఢిల్లీ

జాతీయ స్థాయి మార్కెట్‌లోకి మన వంగడాలు

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలు

గెజిట్‌లో నోటిఫై చేసిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ

- ద్వివర్ణ తోటకూర, వంగపండు వర్ణంలో చిక్కుడు, ఎర్రటి చింత
- జెమినీ వైరస్‌ను తట్టుకునే క్రాంతి, చైత్ర, తన్వీ, సిరి వంటి మిరప రకాలు
- వాము, వస, పసుపులో కొత్త రకాలు
- తక్కువ కాలపరిమితిలో సాగు
- తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడులు

రాష్ట్రంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన 18 రకాల వంగడాలు దేశవ్యాప్తంగా వినియోగంలోకి రానున్నాయి. ఈ యూనివర్సిటీ ఇప్పటికే రాష్ట్ర మార్కెట్‌లో విడుదల చేసిన 15 వంగడాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన వాము (వర్ష), వస (స్వర్ణస్వర), పసుపు (లామ్ స్వర్ణ) వంగడాలను జాతీయ స్థాయి మార్కెట్‌లోకి విడుదల చేస్తూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ గెజిట్‌లో ప్రచురించింది. దేశవ్యాప్తంగా వినియోగించేందుకు వీలుగా వెంకట్రామన్నగూడెం, గుంటూరు లాం, బాపట్ల, తిరుపతి, కొవ్వూరు, పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానాల శాస్త్రవేత్తలు ఈ వంగడాలను అభివృద్ధి చేశారు. రెండు రంగు (ద్వివర్ణ)లలో తోటకూర, వంగపండు రంగు చిక్కుడు, ఎర్రటి చింత వంటి వెరైటీలతో పాటు జెమినీ వైరస్‌ను తట్టుకునే క్రాంతి, చైత్ర, తన్వీ, సిరి వంటి మిరప రకాలు కూడా వీటిలో ఉన్నాయి. కొత్తగా జాతీయ మార్కెట్‌లోకి వస్తున్న వంగడాలు, వాటి ప్రత్యేకతలు ఇలా ఉన్నాయి.

– సాక్షి, అమరావతి

రైతుల ఆదాయం పెంచే రకాలు



వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన 18 వంగడాలను జాతీయ స్థాయిలో విడుదల చేయడం గర్వంగా ఉంది. జాతీయ స్థాయిలో మన మిరపకున్న ప్రాముఖ్యత దృష్ట్యా మిరపలో జెమిని వైరస్‌ను తట్టుకునే క్రాంతి, చైత్ర, తన్వి రకాలు దేశీయ మార్కెట్‌లో రైతులకు అందుబాటులోకి రాబోతున్నాయి. చింత, నిమ్మ రకాలు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఎంతగానో ఉపయోగకరం. విశిష్ట లక్షణాలు కలిగిన ఈ నూతన వంగడాలు రైతుల ఆదాయం పెంచడంలో కీలకంగా మారనున్నాయి. అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు.

– డాక్టర్ తోలేటి జానకీరామ్, వీసీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం

పసుపు (లామ్ స్వర్ణ) : అధిక దిగుబడినిచ్చే దీర్ఘకాలిక రకం (260–270 రోజులు). పసుపు పొడి ముదురు నిమ్మ పసుపు రంగులో ఉంటుంది. అధిక ఎండు కొమ్ముల రికవరి (24%) లో 3–4% కుర్కుమిన్ వర్ణ పదార్థం కల్గి ఉంటుంది. హెక్టారుకు 40–42 టన్నుల పచ్చి పసుపు, 9.8 నుంచి 11.3 టన్నుల ఎండు కొమ్ముల దిగుబడినిస్తుంది.

వస (స్వర్ణస్వర) : 8–9 నెలల పంట కాల పరిమితితో అధిక దిగుబడినిచ్చే రకం. దీనిలో బిటా ఆసరోన్– (15.90 మి.గ్రా/ గ్రాము) అధికంగా వుంటుంది. మొక్క మధ్యస్థ పెరుగుదలతో (56.40 సెం.మీ), ఆకులు అధికంగా కలిగి ఉంటుంది. దగ్గర దగ్గరగా నాటుకోవడానికి అనువైన రకం. వస కొమ్ములు మంచి పొడవు (44.88 సెం.మీ), వెడల్పు (6.53 సెం.మీ) సరాసరి బరువు (112.30 గ్రా.) ఉంటాయి. చిత్తడి నేలల్లో సాగుకు అనుకూలం, హెక్టారుకి 28 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది.

వాము (వర్ష) : అధిక దిగుబడినిచ్చే, దీర్ఘకాలిక రకం (140–145 రోజులు). నీటి పారుదల, వర్షాధార ప్రాంతాల్లో సాగుకి అనుకూలం, అధిక నూనె శాతం (7–8%)తో పాటు సువాసన కలిగిన ఈ రకం సువాసన పరిశ్రమలకి అనుకూలం. గింజ ఆకర్షణీయమైన గోధుమ రంగుతోమధ్యస్థ పరిమాణంలో ఉండటం వలన మార్కెట్లో గిరాకీ అధికంగా ఉంటుంది. హెక్టారుకి 10–12 క్వింటాళ్ళు దిగుబడినిస్తుంది.

మిరప (క్రాంతి) : అధిక దిగుబడినిచ్చే దీర్ఘకాలిక (210–230 రోజులు) రకం. మొక్కలు నిటారుగా పొడవుగా పెరుగుతాయి. కాయలు మధ్యస్థ పొడవుతో పచ్చిగా ఉన్నప్పుడు ముదురు ఆకుపచ్చ రంగులో, పండినప్పుడు ఆకర్షణీయమైన ముదురు ఎరుపు రంగులో ఉండి అధిక ఘాటును కలిగి ఉంటాయి. నేరుగా విత్తడానికి (సాలు తోటలు) అనుకూలమైన రకం. ఆకు ముడత (జెమిని వైరస్) తెగులు, బెట్టను సమర్థంగా తట్టుకోగలదు. వర్షాధార పంటగా హెక్టార్‌కు 48 క్వింటాళ్లు, నీటి పారుదల కింద 65 క్వింటాళ్లు చొప్పున అధిక ఎండు మిరప దిగుబడినిస్తుంది.

మిరప (చైత్ర): అధిక దిగుబడినిచ్చే మధ్యకాలిక (180–190 రోజులు) రకం. మొక్కలు గుబురుగా పెరిగి, ఆకులు దట్టంగా ఉండడం వల్ల కాయలు ఎండ వేడిమిని తట్టుకోగలుగుతాయి. కాయలు పచ్చిగా ఉన్నప్పుడు లేత ఆకుపచ్చ రంగులో, పక్వానికి వచ్చినప్పుడు మెరుపుతో కూడిన ఎరుపు రంగులో ఉంటాయి. పచ్చి మిర్చి, ఎండు మిరపగా కూడా ఉపయోగపడుతుంది. నేరుగా విత్తడానికి అనుకూలమైన రకం. ఆకుముడతను పూర్తిగా, బెట్టను కొంతవరకు తట్టుకోగలదు. వర్షాధార పంటగా హెక్టారుకి 46 క్వింటాళ్లు, నీటి పారుదల కింద 65 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది.

మిరప (తన్వీ) : అధిక దిగుబడినిచ్చే దీర్ఘకాలిక (210–230 రోజులు) రకం. మొక్కలు మధ్యస్థంగా పెరుగుతాయి. ఆకుపచ్చ రంగులో నున్న కాయలు రంగు తిరిగే దశలో తొలుత కుంకుమ వర్ణంలోకి, ఆ తర్వాత ముదురు ఎరుపు రంగులోకి మారతాయి. కాయలు సన్నగా అధిక ఘాటును కలిగి ఉంటాయి. నిల్వ సమయంలో రంగును త్వరగా కోల్పోవు. ఆకు ముడత, పండు కుళ్ళు తెగుళ్ళను తట్టుకుంటుంది. ఎగుమతికి అనువైన రకం. వర్షాధార పంటగా హెక్టారుకి 48 క్వింటాళ్లు, నీటి పారుదల కింద 65 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

పచ్చి మిరప (సిరి): మొక్కలు నిటారుగా, పొడవుగా పెరుగుతాయి. అధిక పచ్చి మిరప దిగుబడినిచ్చే మధ్యకాలిక (180–200 రోజులు) రకం. కాయలు పసుపుతో కూడిన లేత ఆకు పచ్చ రంగు నిగారింపుతో మధ్యస్థ పొడవు, మధ్యస్థ ఘాటును కలిగివుంటాయి. నాటిన రెండున్నర నెలల నుండి పచ్చి మిర్చి కోతకు సిద్ధమవుతుంది. హెక్టారుకి 310 నుంచి 320 క్వింటాళ్ల పచ్చి మిరప దిగుబడినిస్తుంది.



తోటకూర (వర్ణ) : ఆకులు మధ్య భాగాన ఊదా రంగు కలిగి ద్వివర్ణంలో చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. ఆంథోసైనిన్ వర్ణ పదార్థాన్ని (61.55 మి.గ్రా/ 100గ్రా) కలిగి ఉంటాయి. మొక్కలు ఆలస్యంగా పూతకు రావడం వల్ల నాటిన 60 రోజులలో 3 సార్లు కోతకు వస్తుంది. మొక్కలు త్వరగా పెరుగుతాయి. ఏడాది పొడవునా పండించేందుకు వీలైన రకం. హెక్టారుకి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

చిక్కుడు (శ్రేష్ఠ) : మొక్కలు మధ్యస్థంగా పెరిగి, సంవత్సరం పొడవునా సాగుకు అనువైన రకం. నిర్దిష్టమైన కాంతి/చీకటి అవసరం లేకుండా పూతనిచ్చే రకం. కాయలు ఉదా రంగును కలిగి నాటిన 80 – 85 రోజుల్లో కోతకొస్తాయి. హెక్టారుకి 19 టన్నుల దిగుబడి వస్తుంది.

కర్ర పెండలం (ఆదిత్య): వరి కోత తరువాత లోతట్టు, మాగాణి భూముల్లో సాగుకు అనువైన స్వల్పకాలిక రకం (7 నెలలు). మొక్కలు నిటారుగా పెరిగి కోత సులభంగా ఉంటుంది. ఖరీఫ్‌లో వర్షాధారంతోపాటు నీటి పారుదల కింద కూడా సాగు చేయొచ్చు. కసావా మొజాయిక్ వైరస్‌ను తట్టుకుంటుంది. హెక్టారుకి 40 టన్నులు దిగుబడినిస్తుంది.

పెండలం (శబరి): దుంపలు పొడవుగా పెరిగి పై తోలు ముదురు గోధుమ వర్ణంలో, కండ మీగడ వర్ణంలో ఉంటుంది. దుంపలు మంచి నాణ్యత కలిగి, చిప్స్ తయారీకి పనికొస్తాయి. 25 – 30 శాతం పిండి పదార్థం ఉంటుంది. ఆకుమచ్చ తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. హెక్టారుకి 45 – 50 టన్నుల దిగుబడినిస్తుంది.

నిమ్మ (వకుళ): చెట్టు మధ్యస్థంగా ఎదిగి, అధిక సాంద్రత పద్ధతిలో సాగుకు అనువైన రకం. త్వరగా కాపుకు వచ్చి, కాయలు గుత్తులుగా కాస్తుంది. కాయలు సగటున 45 గ్రాముల బరువుతో, 45 శాతం రసం కలిగి తోలు మందంగా మెరుపును కల్గి ఉంటుంది. పచ్చళ్ళకు అనువైన రకం. బాక్టీరియా గజ్జి తెగులును తట్టుకుంటుంది. హెక్టారుకి 39 టన్నుల దిగుబడినిస్తుంది.

జీడిమామిడి (బీపీపీ-10): గుత్తి కాపుతో అధిక దిగుబడినిచ్చే రకం. గింజ పెద్దదిగా (8.1 గ్రా) ఉండి, అధిక పప్పు (29.3%), ఎక్స్‌పోర్ట్ గ్రేడు (డబ్ల్యూ 210) రకం. అధికంగా ద్విలింగ పుష్పాలను (55.21 %) ఇవ్వడమే కాకుండా ద్విలింగ పుష్పదశ ముందుగా ఉంటుంది. సగటున చెట్టుకి 21 కిలోల దిగుబడి వస్తుంది. ఆకు, పూత, గింజల నాశించే పురుగులను తట్టుకుంటుంది.

జీడిమామిడి (బీపీపీ–11): త్వరగా కాపునిచ్చే గుత్తికాపు రకం. పూత, కాయ దశలో నీటి ఎద్దడిని తట్టుకొనే రకం. అధిక సాంద్రతలో నాటడానికి అనువైనది. మధ్యస్థ గింజ పరిమాణం (6.8 గ్రా.), ఒత్తైన పుష్ప గుచ్ఛాలతో, అధిక పప్పు దిగుబడి (28.5%)ని ఇవ్వగల ఎక్స్‌పోర్ట్ గ్రేడ్ (డబ్ల్యూ 240) రకం. చెట్టు సగటు దిగుబడి 17 కిలోలు. ఆకు, పూత, గింజల నాశించే చీడపీడలను తట్టుకుంటుంది.

తమలపాకు (స్వర్ణకపూరి): కొమ్మలు, తీగలు ఎక్కువగా ఉండి, అత్యధిక పెరుగుదల సామర్థ్యాన్ని కలిగిన రకం. పెద్దగా, మృదువైన, లేత ఆకుపచ్చ రంగు ఆకులతో, పొడవైన కాడలు కలిగి ఎగుమతికి అనువైన రకం. స్థానిక రకాలకంటే 20 నుంచి 25 శాతం అధిక దిగుబడి ఇస్తుంది. హెక్టారుకు 53,820 పంతాల దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటుంది. ఫైటోప్తెరా మొదలు కుళ్ళు తెగులును మధ్యస్థంగా తట్టుకోగలదు. సంకరీకరణలో, సంవత్సరం పొడవునా పుష్పించే వంగడం.

వాము (లామ్ అజవాన్-2): మొక్కలు ఒక మీటరు పొడవుతో అధిక కొమ్మలు, పువ్వులను కలిగి ఉంటాయి. 145 – 175 రోజుల పంటకాలంతో అధిక దిగుబడినిచ్చే దీర్ఘకాలిక రకం. ఖరీఫ్‌కు అనుకూలం. అధిక నూనె శాతం (3–4%), సువాసన ఉంటాయి. వర్షాధార పంటగా హెక్టారుకి 6 నుంచి 13 క్వింటాళ్లు, నీటి పారుదల పంటగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడినిస్తుంది. ఖరీఫ్ సీజన్లో వాతావరణ పరిస్థితులను బట్టి స్థానిక రకాలపై 30 నుంచి 60 శాతం ఎక్కువ దిగుబడులు ఇస్తుంది.

చింత (తెట్టు అమలిక) : నాటిన తర్వాత 70–80 ఏళ్ల వరకు కాపునిస్తుంది. 20 ఏళ్ల వయసున్న చెట్టు ఏడాదికి సరాసరి 150 – 220 కిలోల దిగుబడినిస్తుంది. కాయలు 50–56 శాతం గుజ్జుతో పెద్దగా, వెడల్పుగా కొద్దిగా వంకర తిరిగి చివర్లు గుండ్రంగా వుంటాయి. గుజ్జు మందంగా, మెత్తగా, ముదురు గోధుమ రంగులో ఉంటుంది.

చింత (అనంత రుధిర): అన్ని ప్రాంతాలకు అనువైన, క్రమం తప్పక అధిక దిగుబడినిచ్చే రకం. గుజ్జు (43.3%) ఆకర్షణీయమైన ఎరుపు రంగులో, ఆంథోసైనిన్ వర్ణ పదార్థం అధికంగా కల్గి ఉంటుంది. ఎరుపు రంగు గుజ్జు కలిగి ఉండటం వలన ఊరగాయలు, క్యాండీ, జామ్, సిరప్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి అనువైన రకం. పచ్చి కాయల్లో బీటాకెరోటిన్ (188.23 మైక్రో గ్రాము/100గ్రా) అధికంగా ఉంటుంది. 10 ఏళ్ల వయస్సులో చెట్టుకి 50–60 కిలోలు, 20 ఏళ్ల వయసున్న చెట్లు 150 నుంచి 220 కిలోల దిగుబడినిస్తాయి.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
ఆదివారం॥ 26-5-2024





నయన చిన్నారి తారలు

పిల్లలు నవ్వినా అందమే, ఏడ్చినా అందమే. ఏ కోణంలో చూసినా అందమే అందం!

నయనతార తన కవల పిల్లల ఫొటోలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ మురిసిపోతుంటుంది. తాజా విషయానికి వస్తే... తన కవల పిల్లలతో నయన ఆనంద క్షణాలను పట్టించే వీడియో నెటిజనులను ఆకట్టుకుంటోంది. పిల్లలతో సింపుల్‌గా ఆటో ప్రయాణం చేసిన నయనతార ఈ ఆటో రైడ్ విజువల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది.

'సూపర్ స్టార్'గా పేరు తెచ్చుకున్న నయనతార సింపుల్‌గా ఆటోలో ప్రయాణించడం నెటిజనులను బాగా ఆకట్టుకుంది. పలువురు నెటిజనులు ఈ వీడియోను తమ సోషల్ పేజీలో షేర్ చేస్తున్నారు. మాతృత్వంలోని మధురిమ గురించి తీయటి కామెంట్‌లు పెడుతున్నారు.

వైరల్

ఎంత చక్కగా చెప్పింది!



జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి బాలీవుడ్ నటులు ఆలియా భట్, కంగనా రనౌత్‌లు సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రోల్ అవుతుంటారు. 'సినిమా వాళ్లకు సినిమా విషయాలు తప్ప సామాజిక, చారిత్రక విషయాలు తెలియవు' అనే అపోహను పటాపంచలు చేసింది జాన్వీ కపూర్. తాజా ఇంటర్వ్యూ ఒకటి జాన్వీకి చారిత్రక విషయాలపై ఉన్న అవగాహనకు అద్దం పట్టేలా ఉంది. మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్‌ల మధ్య సైద్ధాంతిక చర్చ గురించి జాన్వీ మాట్లాడిన తీరు నెటిజనులను ఆకట్టుకుంది.

'చరిత్ర' తన ఇష్టమైన సబ్జెక్ట్‌గా చెప్పింది జాన్వీ కపూర్.

సినిమా హై హిందుస్థానీ సీన్ హై జపానీ



భారతీయ సినిమా పాటలకు విదేశీయులు డ్యాన్స్ చేయడం కొత్త కాదు. అయితే జపాన్‌లో మాత్రం బాలీవుడ్ హిట్ సినిమాల ఐకానిక్ సీన్‌లను రీక్రియేట్ చేసే కొత్త ట్రెండ్ మొదలైంది. బాలీవుడ్ మూవీ 'కభీ ఖుషీ కభీ ఘమ్' (కె3జి)లో అంజలిగా కాజోల్, రాహుల్‌గా షారుఖ్ ఖాన్ నటించారు. రాహుల్, అంజలి వేషధారణలో జపనీస్ ఇన్‌ఫ్లూయెన్సర్లు మాయో, కకే టకులు 'కె3జి'లోని 'బడే మజాకీ హో' కామెడీ సీన్‌ను రీక్రియేట్ చేశారు. 'లెర్నింగ్ హిందీ ఇన్ 2024 ఈజ్ లైక్ బడే మజాకీ హో' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. హిందీలో ప్రావీణ్యం సంపాదించిన మాయో, కకే టకుల లిప్ సింక్ బాగా కుదిరింది. 'క్రాస్-కల్చరల్ అడ్మిరేషన్ అనేది భౌగోళిక సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒక గొడుగు కిందికి తీసుకువస్తుంది. పర్యాటక ఆసక్తి పెంచుతుంది'... లాంటి కామెంట్స్ ఎన్నో యూజర్‌ల నుంచి వచ్చాయి.

అరరే... ఇట్లయితే ఎట్లా!



ఆకాశంలో ఉన్న ధరలను ఉద్దేశించి బాగా పాపులర్ అయిన పాట 'ఏం కొనేటట్లు లేదు... ఏం తినేటట్లు లేదు'.... అయితే సమస్య ఇప్పుడు ధరల గురించి కాదు. కల్తీ గురించి. కెమికల్స్ గురించి. మండే ఎండా కాలంలో మనకు మంచి నేస్తం...పుచ్చకాయ. చివరికి పుచ్చకాయను కూడా కల్తీ చేస్తున్నారు.

సోషల్ ఎక్స్‌పెరిమెంట్ డెమోన్‌స్ట్రేషన్స్‌లో భాగంగా పోస్ట్ చేసిన వీడియో ఒకటి విపరీతంగా వైరల్ అయింది. ఈ వీడియోలో ముసుగు ధరించిన ఒక వ్యక్తి పుచ్చకాయలో కెమికల్స్‌ను ఇంజెక్ట్ చేస్తుంటాడు.

కల్తీ సముద్రం మధ్య సహజమైన, రసాయన రహిత పుచ్చకాయలను ఎలా గుర్తించాలో తెలియజేసే 'చెక్ యువర్ వాటర్‌మెలన్' ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు వైరల్ అవుతున్నాయి.

స్లిప్పర్-బ్యాక్ ఇన్ యాక్షన్

రష్యన్ ఇన్‌ఫ్లూయెన్సర్ మారియా చుగురోవా మన దేశానికి రావడమే కాదు థోడా థోడా హిందీ మాట్లాడడం కూడా నేర్చుకుంది. చెప్పు తెగడంతో స్థానిక చెప్పుల వ్యాపారి దగ్గరికి వెళ్లి 'భయ్యా... చెప్పల్ తుట్‌గయా' అన్నది.

చెప్పుల వ్యాపారి వికాస్ మంత్రం వేసినట్లు ఆ చెప్పును మామూలు స్థితికి తీసుకువచ్చాడు. 'ధన్యవాద్' అని హిందీలో థ్యాంక్స్ చెప్పింది. అతడి రిపేరింగ్ స్కిల్స్ కంటే మారియాతో ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం నెటిజనులను అబ్బురపరిచింది. చెప్పులు రిపేర్ చేయడంలో వికాస్‌కు 26 సంవత్సరాల అనుభవం ఉంది.

'మోచీ హెల్ప్‌డ్ ఏ రష్యన్ ఇన్ ఏ డిఫికల్ట్ సిచ్యుయేషన్. స్లిప్పర్-బ్యాక్ ఇన్ యాక్షన్. నమస్తే దోస్తో' కాప్షన్‌తో మారియా పోస్ట్ చేసిన ఈ వీడియో 6.8 కోట్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'రష్యన్‌లు ఇంగ్లీష్ అంతంత మాత్రమే మాట్లాడతారు. మారియా మాత్రం హిందీ బాగా మాట్లాడింది' అని ఒకరు కామెంట్ పెట్టారు.





దుస్సాహసాలు వద్దండీ...

'రీల్స్' చేయడం... 'శభాష్' అనిపించుకోవడం మంచిదేగానీ... ఎలాగైనా 'లైక్'లు తెచ్చుకోవాలనే అత్యుత్సాహానికి ఒక్కోసారి ప్రాణాలను సైతం మూల్యంగా చెల్లించాల్సి ఉంటుంది. తాజా విషయానికి వస్తే... ఝార్ఖండ్‌లోని సాహిల్ గంజ్‌కు చెందిన తౌసిఫ్ ఇన్‌స్టాగ్రామ్ 'రీల్స్' చేస్తుంటాడు. అలా ఓ 'రీల్' కోసం బాగా ఎత్తైన చోటు నుంచి నీళ్లలోకి జంప్ చేసి ప్రాణాలు కోల్పోయాడు. 'రీల్ అటెంప్ట్ టర్న్‌డ్ ఫేటల్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ కావడమే కాదు సోషల్ మీడియాలో దీని గురించి చర్చ జరిగింది. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు స్టంట్స్ స్కిల్స్, సేఫ్టీ మెజర్స్ అవసరం లేదనుకునే యువతరం ఈ విషాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలని నెటిజనులు కోరుతున్నారు.

స్పెయిన్‌లో సకల్ బన్



సంజయ్ లీలా బన్సాలీ నెట్‌ఫ్లిక్స్ షో 'హీరామండీ: ది డైమండ్ బజార్'లోని అద్భుతమైన కాస్ట్యూమ్స్, డ్యాన్స్ సీక్వెన్స్‌లు కళాప్రియులను ఆకట్టుకున్నాయి.

'హీరామండీ'లోని డైలాగులు, పాటలు, సీన్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇప్పుడు ఈ నెట్‌ఫ్లిక్స్ షో హవా స్పెయిన్ వరకు వీచింది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ఆర్టిస్ట్ పూర్ణతా మొహంతి, డాక్టర్ వినతా శ్రీరామ్‌తో కలిసి స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో 'హీరామండీ'లోని 'సకల్ బన్' పాటకు ఒడిస్సీ, భరతనాట్యం చేస్తూ 'ఆహా' అనేలా అభినయించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

'కవి అమీర్ ఖుస్రోకు తన గురువు హజ్రత్ నిజాముద్దీన్‌పై ఉన్న భక్తి నుంచి ఈ పాట పుట్టింది' అంటూ 'సకల్ బన్' పాట చరిత్ర గురించి సంక్షిప్తంగా తన పోస్ట్‌లో రాసింది పూర్ణత.

'తాండవ్ నుంచి ఉద్భవించిన రెండు విభిన్న నృత్యరూపాలను ఒకేచోట చూడడం ఆనందంగా ఉంది' అని ఒక యూజర్ స్పందించాడు.

హెల్త్





ప్రోస్టేట్ క్యాన్సర్‌తో జర భద్రం!

పురుషుల ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రోస్టేట్ (పౌరుష) గ్రంథి చాలా కీలకం. బాదం పండు ఆకృతిలో ఉండే ఈ గ్రంథి స్రవించే ద్రవంలోనే శుక్ర కణాలు ఈదులాడుతూ మానవ మనుగడను సుసాధ్యం చేస్తుంటాయి. మధ్య వయసు దాటాక ఈ గ్రంథి అమాంతం సైజు పెరిగే అవకాశముంది. చాలావరకు నిరపాయకరమే అయినా ఆ పెరుగుదల కొన్నిసార్లు క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదముంది. అందుకే 50 - 55 ఏళ్ల వయసు దాటాక ఈ గ్రంథిలో ఏమైనా పెరుగుదల ఉందా లేదా అన్నది పరీక్ష ద్వారా తెలుసుకుంటూ ఉంటే, జబ్బును సగం నివారించుకున్నట్లే..


ప్రపంచంలో పురుషులకు ఎక్కువగా వచ్చే క్యాన్సర్ రకాల్లో ఇది రెండోది. (మొదటిది ఊపిరితిత్తుల క్యాన్సర్). ఇది నెమ్మదిగా విస్తరిస్తుంది కాబట్టి గుర్తించి వెంటనే జాగ్రత్త పడటానికి సమయం దొరుకుతుంది. అయితే తొలి దశలో లక్షణాలు వెంటనే కనిపించకపోవడం ఆందోళనకరమైన విషయం.

లక్షణాలు:
- తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం
- రాత్రి తరచూ మూత్రానికి వెళ్లాలనిపిస్తూ ఉండటం
- మూత్రంలో రక్తం, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మంట
- బలహీనమైన మూత్రధార
- వెన్ను కింది భాగం, పిరుదులు, తొడలలో నొప్పి
- బరువు తగ్గిపోతూ ఉండటం
- కూర్చోవడంలో ఇబ్బంది
- కొన్నిసార్లు పాదాలు లేదా కాళ్ల వాపు.



కారణాలు: ● పెరిగే వయసు (50 - 55 దాటాక) ● ఊబకాయం ● కుటుంబ ఆరోగ్య చరిత్రలో ఈ సమస్య ఉండటం ● పొగ, మద్యం అలవాట్లు ● రసాయనాలకు ఎక్స్‌పోజ్ కావడం.

గుర్తించడం ఇలా: ● డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ అనే పరీక్ష ● ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్‌ఏ) అనే రక్తపరీక్ష (ఈ రెండు పరీక్షలతో ప్రోస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించవచ్చు. అయితే మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు, విపరీతమైన వ్యాయామం, ప్రోస్టేట్‌కు ఉండే ఇతర సమస్యల్లోనూ పీఎస్‌ఏ విలువలు పెరుగుతాయని గుర్తుంచుకుని ఆ మేరకు జాగ్రత్తగా విశ్లేషించాలి) ● ఇమేజింగ్ (అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, ఎమ్మారై, బోన్‌స్కాన్ వంటివి) ● బయాప్సీ (పూర్తిస్థాయి నిర్ధారణ కోసం చేసే పరీక్ష)



నివారణ: ● తాజాపండ్లతో ఆరోగ్యకరమైన సమతుల ఆహారం, వేళకు తినడం. (అవిశె గింజలు, సెలెనియమ్ మోతాదులు ఎక్కువగా ఉండే ట్యూనా వంటి చేపలు, బీటా కెరొటిన్ ఉండే క్యారట్లు, పాలకూర వంటి ఆకుకూరలు తీసుకోవడం, వేట మాంసానికి (రెడ్ మీట్‌కు) వీలైనంత దూరంగా ఉండటం) ● ఎత్తుకు తగినట్లుగా బరువు నియంత్రించుకోవడం, అందుకోసం క్రమబద్ధమైన వ్యాయామం చేయడం ● పొగ తాగే అలవాటుకు దూరంగా ఉండటం.

చికిత్స: ● మొదట్లో యాక్టివ్ సర్వెలెన్స్: లక్షణాలు తక్కువగా ఉన్నప్పుడు క్యాన్సర్ పెరుగుతున్న తీరును జాగ్రత్తగా గమనిస్తూ, లక్షణాలు తీవ్రం కాగానే వెంటనే చికిత్స మొదలుపెట్టడం.

శస్త్రచికిత్స: ఇందులో అనేక రకాలుంటాయి. ఉదాహరణకు ● 'రాడికల్ ప్రోస్టెటెక్టమీ'లో పరిసరాల్లోని లింఫ్ నోడ్స్‌తో పాటు మొత్తం ప్రోస్టేట్‌ను తొలగిస్తారు ●'రొబోటిక్ లేదా లాపరోస్కోపిక్ ప్రోస్టెటెక్టమీ' లో గాటుపెట్టి రోబోసాయంతో ప్రోస్టేట్‌ను తొలగిస్తారు ● 'బైలేటరల్ ఆర్కియాక్టమీ'లో ప్రోస్టేట్‌తో పాటు వృషణాల్లో ఉండే రెండు బీజాలను (టెస్టిస్)ను తొలగిస్తారు. ప్రోస్టేట్ అక్కడికీ పాకినప్పుడు ఈ శస్త్రచికిత్స చేస్తారు.

రేడియేషన్ థెరపీ: ● క్యాన్సర్ కణాలను తుదముట్టించేలా శక్తిమంతమైన రేడియేషన్ కిరణాలతో చికిత్స అందించడం

అడ్వాన్స్‌డ్ ప్రోస్టేట్ క్యాన్సర్‌కు **కీమో థెరపీ:** ● క్యాన్సర్ కేవలం ప్రోస్టేట్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఇతర చోట్లకూ పాకిందని అనుమానించినప్పుడు కీమో మందులతో ఇతర చోట్లకు పాకిన అన్ని క్యాన్సర్ కణాలనూ తుదముట్టించడం.

హార్మోనల్ థెరపీ: ● టెస్టోస్టెరాన్ అనే పురుష హార్మోన్ ఈ క్యాన్సర్‌ను ప్రేరేపించే అవకాశమున్నందువల్ల ఆ హార్మోన్‌ను తగ్గించే మందులు ఉపయోగించడం.

ఇమ్యూనో థెరపీ: ● దేహంలోని ఇమ్యూనిటీ (రక్షణ) వ్యవస్థను బలోపేతం చేసి, ఆ రక్షణ వ్యవస్థే క్యాన్సర్‌ను బలంగా ఎదుర్కొనేలా చేయడం.



డాక్టర్
కె. జి. జ్యోతి స్వరూప్
కన్సల్టెంట్
యూరాలజిస్ట్,
యూరో ఆంకాలజిస్ట్

బ్రక్సిజమ్ అంటే...?



కొందరు పిల్లలు... ఆ మాటకొస్తే కొందరు పెద్దలు కూడా నిద్రలో పళ్లు కొరుక్కోవడంతోపాటు దవడలు బిగబట్టి పళ్లు నూరుతుంటారు. దీనిని వైద్యపరిభాషలో 'బ్రక్సిజమ్' అంటారు. దీనివల్ల పళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

తీవ్రమైన మానసిక ఒత్తిడి, యాంగ్జైటీ వంటి పరిస్థితులే బ్రక్సిజానికి కారణం. ఎప్పుడో ఒకసారి పళ్లు బిగబట్టడం, కోపం వచ్చినప్పుడు పళ్లు కొరకడం సహజం. కానీ నిత్యం నిద్రలో ఇది జరుగుతుంటే మాత్రం దీన్ని రుగ్మతగా పరిగణించి చికిత్స తీసుకోవాలి.

లక్షణాలు: ● పొద్దున లేవగానే తలనొప్పి. ఒక్కోసారి ముఖం నొప్పి కూడా. ● చెవి పోటు ● దవడ కండరాల నొప్పులు ● కొందరిలో చెవిలో హోరు (టిన్నైటిస్) ● నోరు నొప్పి కారణంగా ఆహారం తీసుకోలేకపోవడం ● నోరు తెరవడానికి, మూయడానికి ఇబ్బంది.

రకాలు: ● **అవేక్ బ్రక్సిజమ్** : కొందరు మెలకువగా ఉన్నప్పుడు పగటివేళ పళ్లు కొరుక్కుంటూ ఉంటారు. ఇలాంటి కేసుల్లో ఒత్తిడికి కారణం గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే సరిపోతుంది. అంతకుమించి చికిత్స అవసరం ఉండకపోవచ్చు. కొందరిలో ఏదైనా విషయంపై తదేకంగా దృష్టి కేంద్రీకరించినప్పుడు అసంకల్పితంగా దవడ బిగిస్తుంటారు. దీనికీ చికిత్స అవసరం ఉండదు ● **స్లీప్ బ్రక్సిజమ్:** నిద్రలో ఉన్నప్పుడు అదేపనిగా పళ్లు కొరకడంతో పాటు తాము అలా చేస్తున్నామన్న విషయమే పిల్లలకు తెలియదు. పగటివేళల్లో మామూలుగానే ఉంటారు. వీళ్లకు చికిత్స అవసరం.

రిస్క్ ఫ్యాక్టర్స్: ● పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి, యాంగ్జైటీ వంటి పరిస్థితులతో పాటు మేజర్ డిప్రెసివ్ డిజార్డర్స్ లేదా జనరలైజ్‌డ్ యాంగ్జైటీ డిజార్డర్స్ వంటి మానసిక పరిస్థితులు ● పెద్దవారిలో ఆల్కహాల్‌తో పాటు కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ వంటివి ఎక్కువగా తాగడం ● పెద్దల్లో యాంగ్జైటీని తగ్గించడం కోసం వాడే కొన్ని రకాల ఔషధాలు. ఉదాహరణకు 'సెలక్టివ్ సెరిటోనిన్ రీ-అప్ టేక్ ఇన్హిబిటార్స్ -ఎస్ఎస్ఆర్ఐస్ అనే మందులు ● పెద్దవారిలో గురక రావడం.

చికిత్స: పిల్లలు నిద్రలో ఎప్పుడైనా పళ్లు కొరుకుతుంటే దానికి పెద్దగా చికిత్స అవసరం లేదు. కానీ అది పళ్లకు హాని కలిగించేంత తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రం సీరియస్‌గా తీసుకోవాల్సిందే. ముందుగా వారి పళ్లు దెబ్బతినకుండా పంటి డాక్టర్ ఆధ్వర్యంలో మౌత్ గార్డ్స్ అమర్చడం అవసరం ● స్ట్రెస్ తగ్గించడానికి తొలుత కౌన్సెలింగ్, తర్వాత ధ్యానం వంటి పద్ధతులతో తేలికపాటి వ్యాయామాలు ● 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ'తో చాలావరకు ఉపయోగం ఉంటుంది ● కొన్ని పరీక్షల తర్వాత యాంగ్జైటీ, డిప్రెషన్ వంటివి ఉన్నాయని తెలితే... యాంగ్జియోలైటిక్స్ అనే యాంటీ యాంగ్జైటీ మందులతో పాటు మజిల్ రిలాక్సెంట్ ఔషధాలు. ● జీవనశైలి అంటే లైఫ్‌స్టైల్‌లో మార్పులు (మద్యం అలవాటు వదిలేయడం, పరిమితికి మించి కాఫీలు, పొగ తాగడాన్ని మానేయడం)



డాక్టర్
నరేంద్రనాథ్ రెడ్డి
సీనియర్
డెంటల్ సర్జన్



డాక్టర్
శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
సీనియర్
సైకియాట్రిస్ట్

మెడి టిప్

కడుపులో అల్సర్స్ తగ్గాలంటే..!



ఆహారపు అలవాట్లు మారడంతోపాటు జీవనశైలిలో ఒత్తిడి పెరగడం వల్ల జీర్ణకోశానికి వస్తున్న సమస్యల్లో కడుపులో అల్సర్స్ కూడా ఒకటి. ఆహారాన్ని జీర్ణం చేయడం కోసం కడుపులో ఆమ్లం (యాసిడ్) ఉత్పత్తి అవుతుంది. అది నిర్ణీత మోతాదులో ఉత్పత్తి కాకపోవడం వల్ల కడుపులో అల్సర్లు వస్తాయి. ఇలా జీర్ణాశయంలో వచ్చే అల్సర్‌ని గ్యాస్ట్రిక్ అల్సర్ అంటారు. ఈ అల్సర్స్‌ను అధిగమించాలంటే... ➡ యోగా, ధ్యానం వంటి వాటి ద్వారా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం ➡ ఆహారంలో కారం, మసాలాలు తక్కువగా ఉండేలా జాగ్రత్తపడటం ➡ కాఫీ, టీలు పరిమితంగా తీసుకోవడం లేదా పూర్తిగా మానేయడం ➡ పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ➡ క్రమం తప్పకుండా రోజూ ఒకే సమయానికి ఆహారం తీసుకోవడం.



నేటినుంచి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

ప్రతిష్టాత్మక క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. పారిస్‌లో నేడు ప్రారంభమయ్యే ఈ టోర్నీ 9 జూన్ వరకు సాగుతుంది. ఈ మెగా టోర్నీలో ప్రస్తుతం అందరి దృష్టి దిగ్గజ ఆటగాడు, 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ విజేత రాఫెల్ నాదల్ (స్పెయిన్)పైనే ఉంది. తొలి రౌండ్‌లో అతను సోమవారం నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడతాడు. ఈ జూన్ 3న 38 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న నాదల్ వరుస గాయాలతో ఇబ్బంది పడుతూ ఒక దశలో టోర్నీకి దూరమయ్యేలా కనిపించాడు. అయితే శనివారం మీడియాతో మాట్లాడిన అతను తాను ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నానని, ఇది చివరి ఫ్రెంచ్ ఓపెన్ కాకపోవచ్చని స్పష్టం చేశాడు. ఆదివారం జరిగే ప్రధాన మ్యాచ్‌లలో మహిళల సింగిల్స్‌లో లూసియా బ్రాన్‌జెట్టీతో 4 గ్రాండ్‌స్లామ్‌ల విజేత నయోమీ ఒసాకా తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో జేజే వుల్ఫ్‌ను మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ ఎదుర్కొంటాడు. అయితే సీనియర్లు ఆండీ ముర్రే, స్టాన్ వావ్రింకా మధ్య పోరు అత్యంత ఆసక్తికరం కానుంది.

చలో అమెరికా!



టి20 ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అమెరికా పయనమైంది. రిజర్వ్ ఆటగాడు రింకూ సింగ్ మినహా 18 మంది క్రికెటర్లు, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు ఇతర సహాయక సిబ్బంది బృందం ముంబైనుంచి న్యూయార్క్‌కు బయల్దేరి వెళ్లింది. బంగ్లాదేశ్‌తో ఒక ప్రాక్టీస్ మ్యాచ్ తర్వాత టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌తో భారత్ తలపడుతుంది.

ఫైనల్లో పీవీ సింధు

మలేసియా మాస్టర్స్ ఓపెన్



కౌలాలంపూర్: భారత టాప్ షట్లర్ పూసర్ల వెంకట సింధు ఈ ఏడాది తన తొలి టైటిల్ సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. బీడబ్ల్యూఎఫ్ సూపర్–500 టోర్నీ మలేసియా మాస్టర్స్‌లో సింధు ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్లో సింధు 13–21, 21–16, 21–12 స్కోరుతో బుసానన్ ఆంగ్‌బమ్‌రుంగ్‌పన్ (థాయిలాండ్)పై విజయం సాధించింది. తన కెరీర్‌లో ఐదేళ్ల క్రితం ఒకే ఒక సారి బుసానన్ చేతిలో ఓడిన సింధుకు ఇది ఆమెపై 18వ గెలుపు కావడం విశేషం. వరల్డ్ నంబర్ 20 బుసానన్ తొలి గేమ్‌లో ఆధిక్యం ప్రదర్శించి ముందంజ వేసింది. అయితే వెంటనే కోలుకున్న సింధు ర్యాలీలతో చెలరేగి గేమ్‌ను గెలుచుకుంది. మూడో గేమ్‌లో సింధు తన స్థాయిలో సత్తా చాటింది. 8–3తో ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత ఆమెకు తిరుగులేకుండా పోయింది. అదే జోరును కొనసాగిస్తూ 17–10తో దూసుకుపోయిన సింధు వరుస పాయింట్లతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరిగే ఫైనల్లో వరల్డ్ నంబర్ 7 వాంగ్ జి యీ (చైనా)తో సింధు తలపడుతుంది.

‘షూటౌట్’లో ఓడిన భారత్



అంట్‌వెర్ప్: ప్రొ హాకీ లీగ్‌లో శుక్రవారం బెల్జియం చేతిలో ఓడిన భారత పురుషుల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పరాజయంపాలైంది. గత మ్యాచ్ కంటే ఈ సారి మెరుగైన ప్రదర్శన కనబర్చినా ‘షూటౌట్’లో ఓటమి ఎదురైంది. శనివారం జరిగిన పోరులో బెల్జియం 1–3 (షూటౌట్) తేడాతో పరాజయం పాలైంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున అరజీత్ సింగ్ (11వ నిమిషం), సుఖ్‌జీత్ సింగ్ (57వ నిమిషం) గోల్స్ చేయగా...బెల్జియం ఆటగాళ్లలో డేనయెర్ ఫెలిక్స్ (30వ నిమిషం), వాన్ ఫ్లోరెంట్ (50వ నిమిషం) గోల్స్ కొట్టారు.

మహిళలకూ మరో ఓటమి

ఇదే టోర్నీలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా మూడో పరాజయాన్ని చవిచూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–2 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓటమిపాలైంది. బెల్జియం తరఫున బలెన్‌గీన్ ఆంబ్రె (14వ నిమిషం), బ్లాక్‌మన్స్ వనెసా (20వ నిమిషం) గోల్స్ సాధించగా... భారత్ తరఫున కుమారి సంగీత (34వ నిమిషం) ఏకైక గోల్ కొట్టింది.

జ్యోతిసురేఖకు స్వర్ణం, రజతం

ప్రపంచ కప్ ఆర్చరీ



యెచియాన్ (కొరియా): ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ కాంపౌండ్ కేటగిరిలో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతిసురేఖ రెండు పతకాలను తన ఖాతాలో వేసుకుంది. టీమ్ విభాగంలో స్వర్ణం సాధించిన ఆమె, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం గెలుచుకుంది. మహిళల టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత్ 232–226 స్కోరుతో టర్కీపై విజయం సాధించింది. భారత జట్టులో సురేఖతో పాటు అదితి స్వామి, పర్నీత్ కౌర్ సభ్యులుగా ఉన్నారు. మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో మాత్రం జ్యోతి సురేఖ – ప్రియాన్ష్ ద్వయం రెండో స్థానానికే పరిమితమైంది. ఫైనల్లో అమెరికాకు చెందిన ఒలీవియా డీన్ – సాయెర్ సలివాన్ జోడి 155–153 తేడాతో సురేఖ – ప్రియాన్ష్‌ను ఓడించింది.

రన్నరప్‌గా యూకీ జోడి



లయన్ (ఫ్రాన్స్): కెరీర్‌లో మూడో ఏటీపీ టూర్ టైటిల్ గెలవాలని భావించిన భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. ఏటీపీ 250 టోర్నీ ఓపెన్ పార్క్ డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్) – అల్బనో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో హెన్రీ ప్యాటన్ (బ్రిటన్) – హ్యారీ హెలియోవరా (ఫిన్లాండ్) జోడి 3–6, 7–6 (7/4), 10–8 స్కోరుతో యూకీ – ఒలివెట్టిపై విజయం సాధించింది. ఒక గంటా 43 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో యూకీ–ఒలివెట్టి జంట 5 ఏస్‌లు సంధించి ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తొలి సెట్‌ను గెలిచినా, ఆ తర్వాత భారత్–ఫ్రాన్స్ జంట అవకాశాన్ని చేజార్చుకుంది.



చెన్నై మెరీనా బీచ్‌లో ఐపీఎల్ ట్రోఫీతో కెప్టెన్‌లు శ్రేయస్, కమిన్స్

నేడు ఐపీఎల్ ఫైనల్

- కోల్‌కతాతో హైదరాబాద్ ఢీ
- సమరోత్సాహంతో ఇరు జట్లు
- రా.గం.7.30నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

రైజర్స్ Vs రైడర్స్

గత మూడు సీజన్లలో ఎనిమిది, ఎనిమిది, పదో స్థానం... సన్‌రైజర్స్ హైదరాబాద్ పరిస్థితి ఇది. గత రెండు సీజన్లలో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఏడో స్థానానికి పరిమితం. ఐపీఎల్ ఈ ఏడాది ఆరంభానికి ముందుకు ఇరు జట్ల రికార్డు చూస్తే ఈ రెండు టీమ్‌లు ఫైనల్ చేరతాయని ఎవరూ ఊహించలేదు. కానీ అద్భుత ప్రదర్శనలతో రైజర్స్, రైడర్స్ అంచనాలు తిరగరాశాయి. అదరగొట్టే బ్యాటింగ్, రికార్డు ప్రదర్శనలతో హైదరాబాద్ ప్రస్థానం సాగితే... అన్ని రంగాల్లో చెలరేగి కోల్‌కతా అగ్రస్థానంతో ముందుకు దూసుకెళ్లింది. అన్ని అవరోధాలను దాటిన తర్వాత ఇప్పుడు అసలైన అంతిమ సమరానికి రంగం సిద్ధమైంది. పదేళ్ల క్రితం చివరిసారి విజేతగా నిలిచిన కోల్‌కతా తమ మూడో టైటిల్‌పై గురి పెడితే... ఎనిమిదేళ్ల క్రితం చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ రెండో ట్రోఫీ లక్ష్యంగా బరిలోకి దిగింది. ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న నేపథ్యంలో చెపాక్ మైదానంలో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

చెన్నై: ఐపీఎల్–17లో రెండు నెలలకు పైగా హోరాహోరీగా సాగిన సమరాల తర్వాత టోర్నీ విజేతను తేల్చే సమయం ఆసన్నమైంది. లీగ్ మాజీ చాంపియన్లు మరో ట్రోఫీ వేటలో సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయి. చిదంబరం స్టేడియంలో ఆదివారం జరిగే ఫైనల్ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడతాయి. తొలి క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్‌నే ఓడించి దర్జాగా తుది పోరుకు అర్హత సాధించిన కోల్‌కతా దానిని పునరావృతం చేసేందుకు సిద్ధంగా ఉంది. మరో వైపు గత మ్యాచ్‌తో పాటు అంతకు ముందు లీగ్ దశలో కూడా కేకేఆర్ చేతిలో ఓడిన హైదరాబాద్ ఈ సారి మాత్రం వెనక్కి తగ్గకుండా తమ అత్యుత్తమ ఆటను ప్రదర్శించాలని పట్టుదలగా ఉంది. శుక్రవారం ప్రతికూల పరిస్థితుల మధ్య ఇదే మైదానంలో క్వాలిఫయర్–2లో రాజస్తాన్‌ను ఓడించడంతో రైజర్స్ టీమ్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది.

మార్పులు చేస్తారా!

ఫైనల్ కోసం హైదరాబాద్ తుది జట్టు ఎంపిక ఆసక్తికరంగా మారింది. టాప్–3లో హెడ్, అభిషేక్, త్రిపాఠి ఖాయం. గత మూడు మ్యాచ్‌లుగా భారీ స్కోరు బాకీ ఉన్న హెడ్ ఫైనల్లో చెలరేగితే నిలువరించడం కష్టం. అదే విధంగా అభిషేక్ కూడా మరో మెరుపు ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. వరుసగా రెండు మ్యాచ్‌లలో దూకుడైన బ్యాటింగ్‌తో తానేంటో త్రిపాఠి నిరూపించుకున్నాడు. ఎప్పటిలాగే భారీ షాట్లతో క్లాసెన్ మిడిలార్డర్‌లో ఉన్నాడు. అయితే ఇద్దరు దేశవాళీ బ్యాటర్లు నితీశ్ రెడ్డి, సమద్‌లు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. నాలుగో విదేశీ ఆటగాడిగా ఎవరిని ఎంచుకోవాలనే విషయంలో రైజర్స్ మేనేజ్‌మెంట్‌లో గందరగోళం కొనసాగుతోంది. మార్క్‌రమ్ ఆశించిన స్థాయిలో ఆడలేకపోతుండగా, లీగ్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఫిలిప్స్‌ను తీసుకోవడం కూడా దాదాపు అసాధ్యం. పిచ్‌ను బట్టి క్వాలిఫయర్‌లో షహబాజ్‌ను అనూహ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్‌గా చేసుకొచ్చి టీమ్ మంచి ఫలితం సాధించింది. అయితే ఈ పిచ్‌ను స్పిన్‌కు అంతగా అనుకూలించేది కాకపోవడంతో పాటు ప్రత్యర్థి టీమ్‌లో నలుగురు లెఫ్టార్మ్ బ్యాటర్లు ఉన్నారు. కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ పేస్ బౌలింగ్‌లో తమ బాధ్యత నిర్వర్తించగలరు.

మార్పుల్లేకుండా...

కోల్‌కతా మాత్రం ఎలాంటి సందేహం లేకుండా క్వాలిఫయర్–1 ఆడిన టీమ్‌నే కొనసాగించనుంది. మొదటినుంచి చివరి ఆటగాడి వరకు అందరూ ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. ఓపెనర్లుగా నరైన్, గుర్బాజ్ సత్తా చాటగలరు. ఆ తర్వాత వరుసగా వెంకటేశ్, శ్రేయస్, రాణా జట్టు భారం మోస్తారు. చివర్లో రింకూ, రసెల్ విధ్వంసం సృష్టించగల సమర్థులు. కేకేఆర్ బౌలింగ్ కూడా సమతూకంగా ఉంది. స్టార్క్ ఫామ్‌లో ఉంటే ఏం జరుగుతుందో గత మ్యాచ్‌లో హైదరాబాద్‌కు అర్థమైంది. హర్షిత్, అరోరాలాంటి యువ పేసర్లు కూడా రాణిస్తుండగా... స్పిన్నర్ వరుణ్ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగలడు.

తుది జట్ల వివరాలు (అంచనా)

సన్‌రైజర్స్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, త్రిపాఠి, మార్క్‌రమ్, క్లాసెన్, నితీశ్ రెడ్డి, సమద్, భువనేశ్వర్, ఉనాద్కట్, నటరాజన్, షహబాజ్/ మర్కండే.

నైట్‌రైడర్స్: శ్రేయస్ (కెప్టెన్), నరైన్, గుర్బాజ్, వెంకటేశ్, నితీశ్, రింకూ, రసెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్, వరుణ్, వైభవ్.

పిచ్, వాతావరణం

రెండో క్వాలిఫయర్ మ్యాచ్ నల్లరేగడి మట్టితో కూడిన పిచ్‌పై జరిగి స్పిన్‌కు బాగా అనుకూలిస్తుంది. కానీ ఫైనల్‌ను ఎర్రమట్టితో కూడిన మరో పిచ్‌ను నిర్వహిస్తున్నారు. దాంతో బ్యాటింగ్‌కు అనుకూలించి భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. శనివారం సాయంత్రం వర్షం కురిసినా...మ్యాచ్ రోజు చిరు జల్లులకు మాత్రమే అవకాశం ఉంది. ఏదైనా ఇబ్బంది ఎదురైనా రిజర్వ్ డే ఉంది.

సినిమా

- ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలో ఉత్తమ నటి అవార్డు అందుకున్న తొలి భారతీయురాలు అనసూయ
- ప్రతిష్టాత్మక పియెర్ ఏంజెనీ అవార్డు అందుకున్న తొలి భారతీయ ఛాయాగ్రాహకుడు సంతోష్ శివన్

పీచు మిఠాయ్...



● అపర్ణ, సందీప్ కిషన్

సైకిలు మీద ప్రేమ షికారుకు వెళ్లారు సందీప్ కిషన్, అపర్ణా బాలమురళి. ఈ జాలీ రైడ్‌లో ‘పీచు మిఠాయ్...’ అంటూ పాట పాడుకున్నారు. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ‘రాయన్’లో సందీప్ కిషన్, అపర్ణా బాలమురళి ఓ జంటగా నటించారు. సినిమాలో ఈ ఇద్దరి మధ్య ‘పీచు మిఠాయ్..’ అంటూ సాగే రొమాంటిక్, మెలోడీ సాంగ్‌ను విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా విజయ్ ప్రకాశ్, హరిప్రియ పాడారు. తెలుగు, తమిళ భాషల్లో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 13న రిలీజ్ కానుంది. తెలుగు వెర్షన్‌ని ఏషియన్–సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి విడుదల చేయనుంది.

ఆలోచింపజేసేలా...



● రాజేశ్, వరుణ్ సందేశ్

వాస్తవ ఘటనల ఆధారంగా వరుణ్ సందేశ్ హీరోగా రూపొందిన చిత్రం ‘నింద’. స్వీయ దర్శకత్వంలో రాజేశ్ జగన్నాథం నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా గానామాస్ స్పెషల్ స్కూల్‌కి చెందిన పిల్లల చేతుల మీదగా ఈ చిత్రంలోని ‘సంకెళ్లు..’ అంటూ సాగే పాటను ఆవిష్కరింపజేశారు. సంగీతదర్శకుడు సంతు ఓంకార్ స్వరపరచిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, శ్రీరామచంద్ర పాడారు. ‘‘ఈ పాట ఆలోచింపజేసే విధంగా ఉంటుంది. ఓ మిస్టరీ నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఉంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. శ్రేయారాణి, ఆనీ, క్యూ మధు హీరోయిన్లుగా నటించారు.

మూర్తి... యువతి... ఓ లక్ష్యం



● అజయ్ ఘోష్, చాందిని

మూర్తి ఒక మ్యూజిక్ షాప్ యజమాని. డీజే కావాలనేది అతని లక్ష్యం. మూర్తి లక్ష్య సాధనకు ఓ యువతి ఏ విధంగా సహాయం చేసింది? అనే కథాంశంతో రూపొందిన చిత్రం ‘మ్యూజిక్ షాప్ మూర్తి’. డీజే మూర్తి పాత్రలో అజయ్ ఘోష్, అతనికి సహాయం చేసే యువతి పాత్రలో చాందినీ చౌదరి నటించారు. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించిన ఈ చిత్రం జూన్ 14న రిలీజ్ కానుంది. ‘‘అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బేబీ, డీజే టిల్లు’ వంటి చిత్రాలను పంపిణీ చేసిన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

కాన్స్‌లో అనసూయకు ఉత్తమ నటి అవార్డు

భారతీయ నటి అనసూయ సేన్ గుప్తా కాన్స్ చిత్రోత్సవాల్లో చరిత్ర సృష్టించారు. 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలో ‘ది షేమ్‌లెస్’ (2024) చిత్రంలోని నటనకు గాను ఆమె ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ విభాగంలో ఉత్తమ నటి అవార్డు అందుకున్న తొలి భారతీయ నటిగా అనసూయ సేన్ గుప్తా చరిత్రలో నిలిచిపోయారు. ఈ విభాగంలో దాదాపు పదిహేను మంది నటీమణులతో పోటీ పడి ఆమె అవార్డు దక్కించుకోవడం విశేషం. బల్గేరియన్ దర్శకుడు కాన్స్టాంటిన్ బోజనవ్ ‘ది షేమ్‌లెస్’ సినిమాకు దర్శకత్వం వహించారు. ‘అన్‌సర్టైన్ రిగార్డ్’ విభాగంలోనే ‘ది స్టోరీ ఆఫ్ సోలమన్’ చిత్రంలోని నటనకుగాను బ్రూనో నాహోన్ ఉత్తమ నటుడిగా నిలిచారు. ఉత్తమ చిత్రంగా ‘బ్లాక్ డాగ్’ ఎంపికైంది. ఉత్తమ దర్శకులుగా రాబర్టో మినర్విని (ది డ్యామ్డ్), రంగనో న్యాని (ఆన్ బికమింగ్ ఎ గినీ ఫౌల్) అవార్డు అందుకున్నారు.



● అనసూయ సేన్ గుప్తా

కొత్త జీవితం... ‘‘ప్రపంచవ్యాప్తంగా ఉన్న అట్టడుగు వర్గాలవారు, వలసదారులు సమానత్వం కోసం పోరాటం చేసే పరిస్థితుల్లో ఉన్నందువల్ల పోరాటం చేస్తున్నారు. నిజానికి సమానత్వం కోసం పోరాడాలంటే వలసదారులు, అట్టడుగు వర్గాలవారే కానక్కర్లేదు. మనం మంచి మనుషులు అయితే చాలు’’ అంటూ అవార్డు స్వీకరించిన అనంతరం పేర్కొన్నారు అనసూయ సేన్ గుప్తా. అలాగే ‘‘నాకు కొత్త జీవితాన్నిచ్చిన కాన్స్‌కు ప్రస్తుతానికి గుడ్ బై... కృతజ్ఞతలు’’ అని తన ఇన్‌స్టా స్టోరీలోనూ ఆమె షేర్ చేశారు.

‘ది షేమ్‌లెస్’ కథేంటంటే... ఢిల్లీలోని ఒక వ్యభిచార గృహంలో పోలీసును హత్య చేస్తుంది వేశ్య రేణుక. ఆ తర్వాత మరో రాష్ట్రంలోని సెక్స్ వర్కర్ల కమ్యూనిటీలో ఆశ్రయం పొందుతుంది. అక్కడ పదిహేడేళ్ల వయసులో ఉన్న దేవిక అనే అమ్మాయితో రేణుక ప్రేమలో పడుతుంది. ఆ తర్వాత రేణుక, దేవికల జీవితాలు ఎలా మారాయి? ఇద్దరూ ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు? అన్నదే ‘ది షేమ్‌లెస్’ కథాంశం. ఈ చిత్రంలో రేణుక పాత్రలో అనసూయ సేన్, దేవికగా ఒమరా శెట్టి నటించారు.

జర్నలిస్ట్ అవ్వాలనుకుని నటిగా... అనసూయ సేన్ గుప్తా స్వస్థలం కోల్‌కతా. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ పూర్తి చేశారామె. జర్నలిజంను వృత్తిగా ఎంచుకోవాలనుకున్నారు. కానీ ఆమె యాక్టర్ అయ్యేలా పరిస్థితులు మారాయి. 2009లో విడుదలైన బెంగాలీ మ్యూజికల్ ఫిల్మ్ ‘మ్యాడ్లీ బెంగాలీ’ అనసూయ సేన్ గుప్తాకు నటిగా తొలి చిత్రం. అంజన్ దత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆమె ఓ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా విడుదల తర్వాత 2013లో అనసూయ ముంబైకి చేరుకున్నారు. ఆమె సోదరుడు అభిషేక్ సేన్ గుప్తా బాలీవుడ్‌లో దర్శకత్వ విభాగంలో ఉన్నారు. ఎంతో ప్రయత్నించినప్పటికీ నటిగా సరైన అవకాశాలు రాకపోవడంతో ‘సాట్ ఉచక్కీ, రే, మసాబా మసాబా’ వెబ్ వంటి సిరీస్‌లకు ప్రొడక్షన్ డిజైన్, సెట్ డిజైనింగ్ విభాగాల్లో పని చేశారామె. ఆ తర్వాత కరోనా టైమ్‌లో 2020 జూన్‌లో ‘ది షేమ్‌లెస్’ సినిమాకు ఆడిషన్స్ ఇచ్చారు అనసూయ. అది నచ్చి, దర్శకుడు కాన్స్టాంటిన్ బోజనవ్ ఆమెను లీడ్ రోల్‌కి ఎంచుకున్నారు.



● ప్రీతీ జింటా

సంతోష్ శివన్‌కు ప్రతిష్టాత్మక పియర్ అవార్డు...

రెట్రో ఫోకస్, మోడ్రన్ లెన్స్‌ను కనుగొన్న ఫ్రెంచ్ శాస్త్రవేత్త పియర్ ఏంజెనీకి నివాళిగా 2013 నుంచి ఆయన పేరిట ఓ అవార్డును నెలకొల్పి సినిమాటోగ్రాఫర్లకు అందిస్తున్నారు కాన్స్ చిత్రోత్సవాల నిర్వాహకులు. ఈ ఏడాది ఈ అవార్డును భారతీయ ప్రముఖ ఛాయాగ్రాహకుడు సంతోష్ శివన్ అందుకున్నారు. ఈ చిత్రోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖ నటి ప్రీతీ జింతా ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు అందుకున్న తొలి ఏషియన్ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్‌నే కావడం విశేషం. ఈ సందర్భంగా కాన్స్‌కు ధన్యవాదాలు తెలిపారు సంతోష్.



● సంతోష్ శివన్

దర్శక– నిర్మాతగా.. మలయాళ ‘నిధియుడె కథ’ (1986) ఛాయాగ్రాహకుడిగా సంతోష్ శివన్‌కి తొలి చిత్రం. ఆ తర్వాత పలు మలయాళ చిత్రాలకు కెమెరామేన్‌గా చేసిన ఆయన ‘దళపతి, రోజా, తుపాకీ’ వంటి తమిళ చిత్రాలకు, హిందీ ‘దిల్ సే’, తెలుగు ‘స్పైడర్’ తదితర చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా చేశారు. దర్శకుడిగా సంతోష్ తెరకెక్కించిన చిత్రాల్లో హిందీలో ‘ముంబైకర్, తహాన్, మలయాళంలో ‘ఉరుమి’ వంటివి ఉన్నాయి. 35ఏళ్లకు పై బడిన కెరీర్‌లో ఛాయాగ్రాహకుడిగా, దర్శక– నిర్మాతగా సంతోష్ శివన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.


నిజాయతీ గల అందగాడు



● కార్తీ, అరవింద్ స్వామి

అతను నిజాయతీపరుడు... అందగాడు కూడా. ఇంకా అతగాడి గురించి తెలుసుకోవాలంటే ‘మెయ్యళగన్’ (నిజాయతీ గల అందగాడు) చిత్రం చూడాలి. కార్తీ టైటిల్ రోల్‌లో, అరవింద్ స్వామి ఓ ముఖ్య పాత్రలో నటించిన చిత్రమిది. కార్తీ బర్త్ డే (మే 25) సందర్భంగా ఈ చిత్రానికి ‘మెయ్యళగన్’ టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా జ్యోతిక, సూర్య ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగు టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తారు. ‘‘షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి’’ అని యూనిట్ పేర్కొంది.

చరిత్రలో మిగిలిపోవాలంతే...



● విశ్వక్ సేన్

‘మనుషులు మూడు రకాలురా.. నాసి రకం.. రెండోది బోసి రకం.. మూడోది నాణ్యమైన రకం..’ అనే డైలాగ్‌తో మొదలవుతుంది ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ సినిమా ట్రైలర్. విశ్వక్ సేన్, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా, అంజలి ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకు కృష్ణచైతన్య దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని దేవి 70 ఎంఎం థియేటర్‌లో జరిగింది. ‘‘యువ నాయకుడు రత్నాకర్’, ‘నా ఊళ్లో నాకేంట్రా భయం’, ‘ఇది చరిత్రలో మిగిలిపోవాలంతే..’ అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.

పర్ఫెక్ట్ మూవీతో...



● ఐశ్వర్యా మీనన్, కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం ‘భజే వాయు వేగం’. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా ప్రశాంత్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో రాహుల్ టైసన్ ఓ కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కార్తికేయ మాట్లాడుతూ– ‘‘నా ఆరేళ్ల కెరీర్‌లో హీరోగా తొమ్మిది సినిమాల్లో నటించాను. కొన్ని హిట్ అయ్యాయి, కొన్ని ఫ్లాప్ అయ్యాయి. నా గత చిత్రం ‘బెదురులంక’ బాగా పే చేసింది. కానీ ఒక పర్ఫెక్ట్ మూవీతో నా అడుగు ముందుకు పడలేదనిపిస్తుంటుంది. ఆ వెలితిని ‘భజే వాయు వేగం’ తీరుస్తుంది. ‘ఆర్ఎక్స్100’ తర్వాత నా కెరీర్‌లో ‘భజే వాయు వేగం’ మరో బెంచ్ మార్క్ మూవీ అవుతుంది’’ అన్నారు. ‘‘ఓ సాధారణ మనిషి అసాధారణ సమస్య నుంచి ఎలా బయటపడ్డాడు? అనే అంశాన్ని ఇంట్రెస్టింగ్ స్క్రీన్‌ప్లేతో చూపించాం’’ అన్నారు ప్రశాంత్ రెడ్డి. డైలాగ్ రైటర్ మధు శ్రీనివాస్, యూవీ కాన్సెప్ట్స్ చైతన్య మాట్లాడారు.

ఫుల్ మీల్స్ లాంటి సినిమా



● తాన్వీ, కమల్

‘నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి’ వంటి హిట్ చిత్రాల దర్శకుడు కె. విజయ్ భాస్కర్ స్వీయ దర్శకత్వంలో విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించిన చిత్రం ‘ఉషా పరిణయం. విజయ్ భాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా నటించారు. శనివారం జరిగిన ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో విజయ్ భాస్కర్ మాట్లాడుతూ– ‘‘మంచి లవ్‌స్టోరీతో రూపొందించిన ‘ఉషా పరిణయం’ ఫుల్‌మీల్స్‌లా ఉంటుంది. నా కూతురు శ్యామల హీరో, హీరోయిన్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడంతో పాటు ప్రొడక్షన్ విషయంలో నాకు హెల్ప్ చేసింది. నేను అనుకున్న పాత్రకు కమల్ నటుడిగా వంద శాతం న్యాయం చేశాడు. ఇంకా ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో సినిమాని అనుకున్న విధంగా చేయగలిగాం’’ అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



డైరెక్ట్/BC/CNB/65Y/Govt.పెన్షనర్/ఏ బాదరబందిలేని వరునికి తగిన 45-55 సం॥ల వధువు కావలెను. Ph: 9440890510, 9951881755 [H-778805]

దేవాంగ/ 32Y / CNB /2వ పెళ్ళి / B.Com/ 35,000/-PM/మంచి గుణము అందము గల అనాథ వరునకు ఓపెన్ మైండ్ గల అనాథ 1వ/2వ వధువు కావలెను. Whatsapp. 9866241761 [H-778805]

హిందూ మాదిగ/M.Sc / Govt. Sr. Asst. / ఎడ్యుకేషన్ Dept/60,000/-PM/ 6'ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14344]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. Asst. మేనేజర్/FCI/60,000/-PM/ 5'11"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14344]

క్రిస్టియన్ మాల/M.Tech/ C.Govt. లోకో పైలట్/రైల్వే/9Lakhs. PA/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14344]

రజక/కట్నం ప్రసక్తి లేదు /B.Tech / C. Govt.కస్టమ్స్ ఆఫీసర్/90,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14344]

యాదవ/M.Tech/Govt.AEE/ఇరిగేషన్ Dept/14 Lakhs. PA/5'8"ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. కట్నంప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-14344]

SC మాదిగ: B.Tech/NIT/Govt. Asst. Exq. ఇంజినీర్ / ONGC/1,38,000/- PM/ 5'8' ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 6304407230 [H-14347]

క్రిస్టియన్ మాల: కట్నం ప్రసక్తి లేదు /28/ 5'8"/ B.Tech/ C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/ 90,000/- PM అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [H-14347]

రెడ్డి, 41Yrs/5'.10"/M.Sc, Ph.D/ Fair/ 80,000 P.M/ PVT. Job గల వరుడికి వధువు కావలెను. సంప్రదించండి సెల్: 9133857101. [T-1235480]

వైశ్య (డైవర్స్) వయస్సు :56, పిల్లలులేరు, ఒంటరి, నెలకు 30,000/- సంపాదన కలిగిన వరునికి తగిన వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. డైరెక్ట్. ఫోన్ : 7386213167 [G-2428]

రెడ్డి/35/5.6/ IT Employee వరుడుకి కుల, మత, వయసు ప్రసక్తి లేని అందమైన అమ్మాయి తోడుకు లేదా పెళ్లికి కావలెను. (ఇల్లరికం Ok). Direct Contact: 89704 97543. [L-800639]

★

No Brokers: Divorced, 42, BC. D, MA, B.Ed, 30,000, ఇల్లు, పిల్లలు లేని వరునికి, పిల్లలు లేని 2వ వధువు కావలెను. కులం, ఆస్తి ప్రసక్తి లేదు. వరంగల్. 9392850846 [W-1242471]

ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., వ్యవసాయం 15+15, 30 వేలు, ఆస్తి 80 లక్షలు MI9HB మునుగోడ్ రోడ్, నల్లగొండ. వీరయ్య సంప్ర॥ 9121325068 [Y-798331]

★★

కుల, కట్నం ప్రసక్తి లేదు. Fair/36 సం॥ / రికార్డ్ అసిస్టెంట్‌గా జాబ్ చేస్తూ, అనంతపురము టౌన్ లో స్థిరపడిన, అంగవైకల్యం కల్గిన అబ్బాయికి వధువు కావలెను. 79819 22022 (డైరెక్ట్). [A-784647]

కాపు, 57y, 5.7", 50,000/- PM ఆదాయం కలిగిన ఒంటరి వరునకు ఏ బాధర బందీలేని ఒంటరి మహిళ కావలెను. సం ప్ర॥ ✆ 63020 12275 డైరెక్ట్, నో బ్రోకర్. [O-189963]

వెల్ సెటిల్డ్ వికలాంగుడైన యువకునికి తోడు కొరకు అమ్మాయి కావలెను. విడో అయినా పర్వాలేదు. కట్నం కానుక కుల ప్రసక్తి లేదు. Ph: 79892 62248. [L-800640]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/ జాబ్/ వ్యాపారం/ షాప్స్/5L/PM/వెల్ సెటిల్డ్/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించి త్వరగా కుదర్చబడును. 7207636129 [H-778805]

రెడ్డి/30yr/5'4"/ఫెయిర్/కుల పట్టింపు లేదు / PG/Govt. ఎంప్లాయ్/65K (PM)/ వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [H-778805]

కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను/58y/ విడో/ 5'3" / ఫ్యామిలీ పెన్షనర్/ 40,000/- pm/ సొంత ఇల్లు/ ఫైనాన్స్ బిజినెస్/ 1L pm/ పిల్లలులేరు. Ph: 8309025102 [H-800490]

బ్రాహ్మణ్/విడో/ 58y/ V. Fair/ ప్రభుత్వ పెన్షనర్/ 2 ఇళ్ళు గల/ పిల్లలులేని ఒంటరి వధువుకు మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. కులపట్టింపులేదు. Ph: 9618862631 [H-800490]

రెడ్డి/విడో / 59/ 5'5"/ V. Fair/ Govt. Teacher/ సొంత ఇల్లు & రెంట్స్/ 26 ఎకరాల మాగాణి/ 3L pm/ పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-800490]

వైశ్య/50y/ విడో/ అగ్రికల్చర్ ఆఫీసర్/ Rice Mills/ Gold Shop/ 48 Acres Land/ 5 Lakhs Income గల వధువుకి FC/ BC వరుడు కావలెను. Ph: 7702576930 [H-800490]

కుల పట్టింపులేదు/58y/ విడో/5'4"/ Degree/ Central/ Govt. Employee/ సొంత ఇల్లు కలిగిన పిల్లలులేని ఒంటరి మహిళకు వరుడు కావలెను. Ph: 8074953735 [H-800490]

క్రిస్టియన్ మాదిగ/MA/Govt.Jr.Asst. ట్రెజరీ & అకౌంట్స్ Dept/45000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-14344]

రజక/ B.Tech / C.Govt.P.O / SBI బ్యాంక్ / 50,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14344]

కుల పట్టింపు లేదు/22y&24y &26y&28y & 29y & 31y&33y&34y &35y&37y&39y& 40y& 41y& 43y& 45y&47y&49y& 51y& 53y&54y& 55y& 57y& 58y& 59y/ "మా సేవా" (Since: 1998) Ph/WA: 9291503949 [HA-14344]

SC మాల & క్రిస్టియన్/M.Tech, NIT/సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్/ఏకైక కుమార్తె /14Lakhs PA/5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14344]

SC మాల/ B.Tech / C.Govt. బ్యాంక్ PO /SBI / 55000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14344]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి MS, 28, 5' 11", Engineer, H1, USA, 200 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 33, 5' 8", Analyst, 120 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", SWE, 100 K, H1, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 10", SWE, 140 K, 35 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, MD, 26, 5' 2", Doctor, USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 3", Manager, 150 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, 27, 5' 5", SWE, 130 K, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 7", 20 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE (IIT), MS, 6' 2", Sr Engineer, H1, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, Residency Doctor, 32, 6' 1", 600 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MBA (IIM), MD, 27, 5' 7", Doctor, 30 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6', Software Developer, 140 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", Sr SWE, 150 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 29, 5' 2", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 31, 5' 5", SWE, 100 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కులపట్టింపు లేదు: రెడ్డి/ 26y/ 5'4"/B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్‌క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885463158 [H-14347]

మాల: ఏకైక కుమార్తె/ 25y/ 5'4"/ B.Tech/ Govt. A.E/ ఎలక్ట్రికల్ Dept/ 50,000/- pm అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [H-14347]

కుల పట్టింపులేదు/విడో/ 45y/ హార్టికల్చర్ & సెరికల్చర్ Dept./ 1L pm/ సొంత ఇల్లు/ 20 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7093608579 [H-796063]

గౌడ/విడో/48/ MA, B.Ed/ Govt. Job/ VRS/ 80K pm/ Own House, Business, Rents / 4L pm/ పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు తగిన Business చూసుకునే ఇల్లరికపు వరుడు కావలెను. (పిల్లలున్నా Ok). Ph: 7996361419 [H-796063]

కులప్రసక్తిలేదు / విడో/55y/ విజయవాడ/ Hydలో Own House Rents, ల్యాండ్స్. Well Settled (పిల్లలులేని) ఏ బాధరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-796063]

తెలగ కాపు /విడో/60y/ Govt. రిటైర్డ్/ రెండు చిన్న ఇళ్ళు గల వెల్‌సెటిల్డ్ వధువుకు కులప్రసక్తిలేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 7330867356 [H-796063]

విశ్వబ్రాహ్మిన్స్, (ఆచారులు) నాయీ బ్రాహ్మిన్స్ 1st మ్యారేజ్, వయస్సు : 25 సం॥ / 10th to డిగ్రీ అమ్మాయిలకు స్థిరాస్తి, సొంత ఇల్లు ఉన్నవారికి మంచి వరులు కావలెను. ఫోన్ : 9949818929. [A-762301]

గౌడ్స్, రెడ్డి, 1st మ్యారేజ్ / 2వ పెళ్ళి, 10th to డిగ్రీ 25 to 38 సం॥ సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న వారికి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. ఫోన్ : 9949818929. [A-762301]

పద్మశాలి, (దేవాంగులు), 1st మ్యారేజ్, రెండవ పెళ్ళి 26 to 37 సం॥ స్థిరాస్తి, ప్రైవేట్ జాబ్ ఉన్న వారికి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. ఫోన్ : 9949818929. [A-762301]

కాపు/బలిజ, వయస్సు : 26 సం॥ to 45 సం॥, సొంత ఇల్లు, స్థిరాస్తి, వ్యవసాయం. 1st మ్యారేజ్, 2వ పెళ్ళి, ఆంధ్ర, తెలంగాణలో ఉన్న వారికి వరులు కావలెను. ఫోన్ : 9949818929. [A-762301]

యాదవ్స్ (గొల్లలు), ఎర్రగొల్ల, పూజగొల్ల, కర్ణగొల్ల, వయస్సు : 25 సం॥ to 35 సం॥, 10th to డిగ్రీ అమ్మాయిలకు తగిన వరులు కావలెను. ఫోన్ : 9949818929. [A-762301]

Govt. ఎంప్లాయ్ 2,75,000/- (pm), 37yrs/ రెండవ పెళ్ళి/ డైవర్స్, కుల పట్టింపులేదు, వెల్‌సెటిల్డ్, అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok) సంప్ర: 9505422536 [H-778783]

కమ్మ/37yrs/ ఫెయిర్/ కుల పట్టింపులేదు/ Govt. ఎంప్లాయ్ 65K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ 4 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం Ok) సంప్ర: 9640133485 [H-778783]

రెడ్డి/45yr/ కుల పట్టింపులేదు/ ఫెయిర్/ Govt. ఎంప్లాయ్ 3 లక్షలు (PM), వెల్‌సెటిల్డ్, బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 8374802603 [H-778783]

బ్రాహ్మణ/"33yrs/5'2"/ఇంటర్. "29yrs/ 5'4"/డిగ్రీ. "25yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను. రిక్రూట్‌మెంట్ Pvt., Govt. జాబ్/ పురోహితం అయినా Ok. Ph: 9959725419 [H-778783]

Reddy/ కుల పట్టింపులేదు/ రెండవ పెళ్ళి/ 56y/ విడో/ సొంత ఇల్లులు/ రెంట్స్/ పిల్లలులేరు/ సొంత ప్రాపర్టీ/ ఎలాంటి బాదరాబందీలేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం Ok) (నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-778783]

Andhra Sunni Muslim Parents Settled at Hyderabad invite alliance for their only Daughter 30 years. M.Tech 5'4" beautiful, Property holder, Widow with 4 years daughther. Groom Should be educated, employed in Hyderabad, below 36 years. Shall Whats App Photo and biodata to 7337047741 [H-778915]

★★

క్రిస్టియన్/మాల / 32Y / MDS / కోటిపైగా ఆస్తి / స్వంత క్లినిక్ / త్వరలో Govt. జాబ్ పొందే అందమైన వధువుకు వెల్ సెటిల్డ్ SWE/ తగిన Govt. ఎంప్లాయ్ / డాక్టర్ వరుడు కావలెను. డైరెక్ట్ ✆ 94416 12898 B-1264394]

BC/42 / 5'2"/ V, డిగ్రీ /వ్యాపారం / 12L.PA / 25 కోట్ల స్థిరాస్తి కల్గి బాగా స్థిరపడిన ఒంటరి అందమైన విడో వధువుకు స్థిరపడిన 2వ వరుడు కావలెను. 9573943211, 8125132949 [HA-14353]

వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066 [H-796063]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాలకు. Govt/ Pvt/SWE/NRI/ బిజినెస్/డాక్టర్స్ పెళ్ళి సంబంధాలకై, ఓర్పు, శ్రద్ధ, నిజాయితీలకు అత్యంత ప్రాధాన్యత. Ph: 9866775306 [H-14341]

మాల, మాదిగ స్పెషల్, IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్ USA, UK. Ph: 7396915712 [HA-14347]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14348]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14348]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14348]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14348]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14348]

ఫాస్ట్ సెటిల్‌మెంట్-ప్రత్యేక శ్రద్ధతో. అన్ని కులాలు, అన్ని ప్రాంతాలు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ , VIP వారికి పెళ్ళి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2950]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-32115]

ప్రభాకర్ రెడ్డి మ్యాట్రిమోని ద్వారా రెడ్డి వధూవరుల పరిచయ వేదిక 2/6/2024న సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమిటీ హాల్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, L.B. నగర్, Hyd నందు కలదు. ఫోన్ : 9391198332, 9059430595 [HA-3875]

SC మాల, మాదిగ, క్రిస్టియన్స్ మాత్రమే, 1st మ్యారేజ్ పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి, సత్యనారాయణ. Verified All Govt Jobs Profiles కలవు. ఫ్రీ రిజిస్ట్రేషన్ వాట్సాప్ - 7989021063. B-1251791]

తెలగ దొరలు OC కాపు మెట్రిమోనీ (ఫ్రీ సర్వీస్) ఎవరికీ డబ్బులు ఇవ్వనవసరం లేదు శిరుగుడి వాసు 9866029694. [S-1235978]

అన్ని కుల, మతములకు వివాహ పరిచయ వేదిక ద్వారా సంప్రదాయబద్ధమైన సంబంధములు కుదుర్చబడును. డైరెక్ట్‌గా సం.ప్ర: 83090 23036, 85199 34926. [L-795728]

Free Registration first 100 members all castes manjunatha matrimony, Secunderabad. Contact number 7780185133, 8106149850 [H-778805]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt., Doctors, MNC Matches, Late &2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-841]

తీర్పే బలం, బలగం

పెద్దోడ్డి మాటే పెదరాయుడి తీర్పు.. పోలీస్ ఠాణా గడప తొక్కని కొల్లేరు వాసులు

ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా ఐకమత్యమే మహాబలం
150 ఏళ్లకుపైగా ఒకే మాట.. ఒకే బాట
కొల్లేరులో అ'సామాన్యుల' బతుకు చిత్రం

- పొద్దు పొడవక ముందే భుజాన వెదురు గెడకు మావులు, సల్దికూడు (సద్దన్నం) క్యారేజీ తగిలించుకుని గోచీ పెట్టుకుని నడిచి వెళ్లి కొల్లేరులో తాటి దోనెలపై తిరిగి సహజసిద్ధంగా చేపలను వేటాడి మార్కెట్‌కు పోయి అయినకాడికి అమ్ముకుని బతుకు నెట్టుకొచ్చిన మట్టి మనుషులు ఒకనాడు.
- సమాజంలో మిగిలిన వారిలాగానే కాలానికి అనుగుణంగా ఆధునికతను అందిపుచ్చుకుని చేపల చెరువులతో ఆదాయం ఆర్జించి అభివృద్ధివైపు అడుగులు వేసిన గట్టి మనుషులు నేడు.
- రాష్ట్రంలోని ఏలూరు-పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ విస్తరించిన కొల్లేరు ప్రాంతంలో నివసించే ప్రజల జీవన గమనాన్ని పరిశీలిస్తే గొప్ప సందేశాన్ని బాహ్య ప్రపంచానికి పంచుతుంది. ఎన్ని కష్టాలు వచ్చినా కొల్లేరులో ఎదిరీదే బతుకుచిత్రమిదీ. జీవన విధానంలో మార్పులు వచ్చినా కొల్లేరులో మనిషి మారలేదు. వారి మనసూ మారలేదు. కార్పొరేట్ కల్చర్, కుట్రలు, కుతంత్రాలు వారిని ఏమాత్రం ప్రభావితం చేయలేదు. ఎన్ని కష్టాలొచ్చినా ఐక్యమత్యమే మహాబలం అనేదానికి కొల్లేరువాసులు నిలువెత్తు సాక్ష్యం. ఇది ఒకటి రెండేళ్ల కాదు. ఏకంగా 150 ఏళ్ల క్రితం నుంచి వారంతా ఒకే మాట, ఒకే బాట అనే తీరుతో ముందుకు సాగుతున్నారు. పరస్పర సహకారం, గ్రామాభివృద్ధికి తోడ్పాటు, వ్యక్తిగత తగాదాలు, కుటుంబంలోని పేచీలు ఇలా విషయం ఏదైనా సరే వారంతా గ్రామంలోనే నిర్ణయం తీసుకునే కట్టుబాటు ఇప్పటికీ కొనసాగుతోంది.

\- సాక్షి, అమరావతి



ఆకాశంలో విహరించే పక్షుల సమూహాలు...నీటిలో జలపుష్పాల పరుగులు ..చుట్టూ నీటి మధ్యలో దీవుల్లాంటి భువిపై వెలిసిన గ్రామాల్లో జీవనం సాగించే అ'సామాన్యులు'. ఇది మంచినీటి సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'కొల్లేరు'తో పెనవేసుకున్న జీవరాశులతో సహజీవనం.

కాంటూరు కుదింపునకు వైఎస్ సర్కారు తీర్మానం

కొల్లేరు ఐదో కాంటూరు వరకు 77,138 ఎకరాల విస్తీర్ణాన్ని అభయారణ్యంగా ప్రకటించారు. దీన్ని మూడో కాంటూరుకు కుదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. కాంటూరు పరిధి తగ్గించడం వల్ల 43,072 ఎకరాలు అభయారణ్యం పరిధి నుంచి బయటపడతాయి. వాటిలో పట్టా భూములు 14,932 ఎకరాలు, జిరాయితీ భూములు 5,510 ఎకరాలను వాటి హక్కుదారులకు అప్పగించగా మిగిలిన భూమిని పేదలకు పంచాలన్నది అప్పటి వైఎస్ ప్రభుత్వ సంకల్పం. కానీ పర్యావరణ, న్యాయపరమైన అంశాలు ముడిపడి ఉండటంతో కాంటూరు కుదింపు



జరగలేదు. వైఎస్ హయాంలో రూ.1300 కోట్లతో కొల్లేరులో ప్రత్యేక పునరావాస ప్యాకేజీని అమలు చేశారు. వైఎస్సార్ హయాంలో ప్రతిపాదించిన రెగ్యులేటర్ నిర్మాణ ప్రతిపాదనకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కదలిక వచ్చింది. కొల్లేరులోని సర్కారు కాలువపై కీలకమైన వంతెన నిర్మాణానికి వైఎస్సార్ హయాంలో నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం దాన్ని చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ వంతెన నిర్మాణం పూర్తి చేయడం గమనార్హం.

పెద్దోడ్డి మాటేశిరోధార్యం..

కొల్లేరులో భిన్నమైన మనస్తత్వాలు కలిగిన వారు జీవించొచ్చు కానీ వారిలో భిన్నమైన మాటలు మాత్రం ఉండవు. వ్యక్తిగత, సామాజిక, రాజకీయ అంశాలైనా అక్కడ ఊరి పెద్దగా చెలామణి అయ్యే పెద్దోడ్డి (పెద వడ్డి) మాటే శిరోధార్యం. రెండు జిల్లాల్లోని 122 గ్రామాల్లోను ప్రజలందరూ కలిసి కొందరికి పెద్దరికం కట్టబెడతారు. తొలినాళ్లలో బయట వారి నుంచి రక్షణ కల్పించుకునేందుకు, వ్యక్తిగత ఇబ్బందుల నుంచి బయటపడేందుకు తమకు తాముగా సంఘాలు పెట్టుకుని నాయకులను (పెద్దోడ్డి) పెట్టుకునే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు అతీతంగా ఒక్కో గ్రామంలో నలుగురి నుంచి 12 మంది వరకు పెద్దోడ్డిలుంటారు. ఏ సమస్య వచ్చినా గ్రామం నడిబొడ్డున ఉండే చావిడి, ఆలయంలో పెద్దోడ్డిలను ఆశ్రయిస్తారు. సాధారణంగా అందరూ పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు వచ్చాక సాయంత్రం సమయంలో ఈ పంచాయతీలు నడుస్తుంటాయి. రెండు వైపులా వాదనలు విని స్థానిక న్యాయస్థానాలు మాదిరిగా వారిచ్చే తీర్పును ప్రజలు ఆచరిస్తారు. చిత్రం ఏమిటంటే పేచీలు పెట్టుకుని వారు పోలీస్ ఠాణాలు, బయటి వారి గడప తొక్కరు. దశాబ్దాలు గడిచినా అదే కట్టుబాటు ఇప్పటికీ కొనసాగుతుండటం విశేషం.

ఒడిశా నుంచి వలసొచ్చి...విస్తరించి

పొట్ట చేతపట్టుకుని రాష్ట్ర సరిహద్దులు దాటి ఒడిశా నుంచి వలసొచ్చిన 50 కుటుంబాలు శాఖోపశాఖలుగా విస్తరించి కొల్లేరులో గ్రామాలను నిర్మించాయి. దాదాపు 150 ఏళ్ల కిందట వచ్చిన వడ్డెర (వడ్డీలు) కులానికి చెందిన వలస జనం ప్రధానంగా చేపల వేటపైనే ఆధారపడి బతికేవారు. ఎటుచూసినా నీరు, మధ్య దిబ్బలాంటి ప్రాంతాల్లో దట్టమైన పొదలతో అడవికంటే భయంకరంగా ఉండే ఆ ప్రాంతంలో మానవమాత్రుడు ఉండటం కష్టంగా ఉండే రోజుల్లోనూ నాగరికతకు దూరంగా బతకడం మొదలైంది. పొదలు, తుప్పలను బాగుచేసి కొల్లేరులో దొరికే కిక్కిసకర్రలతో చిన్నపాటి గుడిసె (పాకలు) వేసుకుని జీవించేవారు. కొల్లేరు నీటి అడుగు దొరికే అలిపిరి కాయలు, కాలువ దుంపలను ఆహారంగా తినేవారు. కొల్లేరులో సహజసిద్ధంగా పెరిగే నల్లజాతి చేపలు పుష్కలంగా ఉండటంతో వాటిని వేటాడి బయట ప్రాంతాల్లో విక్రయించి కుటుంబాలను పోషించుకునే వారు. వడ్డీలతోపాటు సమీప ప్రాంతాల్లోని ఎస్సీలు కూడా కొల్లేరులో స్థిరపడి చేపల వేటపై జీవనం సాగిస్తున్నారు.

జీవన చిత్రాన్ని మార్చేసిన చెరువులు

కొల్లేరులో చేపల చెరువులు ఆ ప్రాంత వాసుల జీవన చిత్రాన్ని మార్చేశాయి. చిత్రం ఏమిటంటే కొల్లేరు వాసులు బతకడం కోసం గతంలో కొల్లేరులో చేపల చెరువులు తవ్వకపోతే ప్రభుత్వం కేసులు పెడితే... జనజీవనానికి ప్రమాదంగా పరిణమించిన కాలుష్యకారక చేపల చెరువులను తొలగించకపోతే కేసులు పెట్టాల్సిన పరిస్థితి వరకూ వచ్చింది. కొల్లేరులో చేపల వేటపైనే ఆధారపడిన వారికి మేలు చేసేలా సొసైటీలుగా ఏర్పడి ప్రభుత్వ భూముల్లో చెరువులు తవ్వుకునేలా 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నిర్ణయం తీసుకున్నారు. కొల్లేరు వాసులకు దానిపై అవగాహన కల్పిస్తూ శృంగవరప్పాడు గ్రామంలో తొలి సొసైటీ చెరువు తవ్వకానికి శంఖుస్థాపన చేశారు. సహజసిద్ధంగా చేపల వేటపై ఆధారపడి బతికే తమ పొట్ట కొట్టేందుకు ప్రభుత్వం సొసైటీ చెరువులు తవ్విస్తోందంటూ కొల్లేరు వాసులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. వారిని కట్టడి చేసేలా కేసులు పెట్టి, నిర్బంధంగా చెరువులు తవ్వేలా అప్పట్లో ప్రభుత్వం వ్యవహరించింది. క్రమంగా సొసైటీల పేరుతో కొల్లేరులో ప్రాంతాలు విభజించుకుని కొల్లేరు వాసులు చేపలను వేటాడుకుని మెరుగైన జీవనానికి అలవాటు పడ్డారు. కొల్లేరుపై కన్నేసిన పొరుగు ప్రాంతాల వాళ్లు రంగంలోకి సొసైటీలకు డబ్బులు (లీజు)ఇచ్చి చెరువులు తవ్వి పెద్ద ఎత్తున చేపలసాగు చేపట్టడంతో పర్యావరణ సమస్య ఉత్పన్నమైంది. దీంతో పర్యావరణ సంస్థలు పోరాటంతో న్యాయస్థానాల ఆదేశాలతో ప్రభుత్వం కొల్లేరు పరిరక్షణకు 120 జీవో జారీచేయడం, చేపల చెరువుల తొలగింపునకు (కొల్లేరు ఆపరేషన్) నిర్వహించడం చకచకా జరిగిపోయింది.

మగ బిడ్డకూ వాటా..

రెండు జిల్లాల్లో తొమ్మిది మండలాల్లో విస్తరించిన కొల్లేరు ప్రాంతంలో ఇప్పుడు 80 వేల కుటుంబాల్లో మూడు లక్షల 30 వేల మంది జీవిస్తున్నారు. రెండు లక్షల పది వేల మంది ఓటర్లున్న కొల్లేరులో ఉన్న సొసైటీలు, గ్రామాలు వారీగా ఉన్న చెరువుల ఆదాయం (లీజు)లో ప్రతీ కుటుంబంలోను పెద్దకు వాటాలు ఇస్తారు. పుట్టిన మగ బిడ్డకు కూడా వాటాలు వేస్తారు. కొల్లేరుకు అక్కడివారు వలసరాక ముందే కొల్లేటి కోటలో వెలసిన పెద్దింట్లమ్మ అమ్మవారే ఆయా ప్రాంత వాసులకు పెద్దదిక్కు. ప్రతీఏటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. పెద్దయ్యాక వాటా ఇస్తారు.

'లైఫ్ ట్యాక్స్'కు ఎగనామం!

భారత్ రిజిస్ట్రేషన్‌తో డీలర్ల మోసాలు

- ఇలా సుమారు 400 వాహనాల అమ్మకాలు
- రవాణా శాఖకు సుమారు రూ.4 కోట్ల నష్టం
- నలుగురు డీలర్ల పైచర్యలు.. మరో 10 మందికి నోటీసులు

గోపాలపట్నం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, నాలుగు రాష్ట్రాల్లో కంటే ఎక్కువ రాష్ట్రాల్లో కంపెనీలు ఉన్న ప్రయివేటు సంస్థల ఉద్యోగులకు మాత్రమే వర్తించే బీహెచ్ రిజిస్ట్రేషన్ వాహనాల అమ్మకాల్లో పలువురు డీలర్లు మోసాలకు పాల్పడిన ఘటన వెలుగులోకొచ్చింది. ఇటీవల లైఫ్ టాక్స్ కట్టాల్సిన వాహనాల వివరాలు సేకరించే క్రమంలో ఇది బయటపడింది. విశాఖలో వాహనాలు కొనుగోలు చేసి అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని లైఫ్ టాక్స్ ఎగ్గొట్టేందుకు చేసిన ప్రయత్నాలు బయటపడ్డాయి. ఇందులో ప్రధానంగా కార్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల ఉద్యోగులమంటూ పలువురు ఫేక్ డాక్యుమెంట్లతో కార్లు కొనుగోలు చేసినట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. విశాఖలో 16 మంది కార్ల డీలర్లు 400పైగా కార్లను ఈ విధంగా అమ్మినట్లు తెలుస్తోంది. దీని వల్ల రవాణా శాఖకు సుమారు రూ.4 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ అమ్మకాల్లో కొన్ని నిజమైనవి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో ఫేక్ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు ఎన్ని జరిగాయో పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

అదే అదనుగా..

గతంలో అమ్మకాలపై రవాణా శాఖకు నిరంతరం సమాచారం ఉండేది. కానీ ఇప్పుడు డీలర్ల రిజిస్ట్రేషన్ వల్ల వాటిపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో డీలర్లు ఇష్టానుసారంగా మోసాలకు పాల్పడుతున్నారు. నెలలో ఎన్ని వాహనాలు అమ్ముతున్నారు? ఎన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి? లైఫ్ టాక్స్‌లు ఎన్ని వస్తున్నాయన్న సమాచారం అధికారులకు ఇవ్వకపోవడం వల్లే ఇలాంటి మోసాలకు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. కాగా, పలు రాష్ట్రాల్లో పని చేసే ఉద్యోగులకు వెసులుబాటు కలిగించేందుకు భారత్ రిజిస్ట్రేషన్ సదుపాయం కలిగించింది. అయితే అందుకు తగిన పత్రాలు అందించాలి. కేంద్ర ప్రభుత్వంలో పని చేస్తూ ఇతర రాష్ట్రాలకు బదిలీపై వెళ్లే వారికి, నాలుగు రాష్ట్రాల్లో కంటే ఎక్కువ రాష్ట్రాల్లో కంపెనీలు ఉన్న ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగులు, బదిలీలపై వెళ్లే వారికి భారత్ రిజిస్ట్రేషన్ వర్తిస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ వాహనాలు ఏ రాష్ట్రంలోనైనా తిరగొచ్చు. రాష్ట్రం మారాక ఆ రాష్ట్రంలో మళ్లీ రిజిస్ట్రేషన్ మార్చుకునే పని ఉండదు. దీని ద్వారా లైఫ్ ట్యాక్స్ తగ్గుతుంది. ఇది అదునుగా చేసుకుని కొందరు డీలర్లు బీహెచ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఇక్కడ వాహనాలను అమ్మి, అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. దీంతో ఇక్కడి కొనుగోలు చేసిన వాహనాలకు ఇక్కడి లైఫ్ ట్యాక్స్‌లు కట్టే పరిస్థితి లేకపోయింది.



బీహెచ్ సిరీస్‌లో ఉన్న వాహనం(ఫైల్)

నలుగురు డీలర్లపై చర్యలు, 10 మందికి నోటీసులు

400 కార్ల బీహెచ్ రిజిస్ట్రేషన్‌పై ఉప రవాణా కమిషనర్ రాజారత్నం చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజులుగా బీహెచ్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టి అందులో జరిగిన అవకతవకలను గుర్తించారు. లైఫ్ ట్యాక్స్‌లు తగిన స్థాయిలో రాక పోవడం వల్ల అనుమానాలకు దారి తీసిందన్నారు. ఫేక్ ధ్రువపత్రాలతో బీహెచ్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు నలుగురు డీలర్ల ప్రమేయంపై స్పష్టమైన ఆధారాలు ఉండడంతో వీరిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మరో 10 మంది డీలర్లకు నోటీసులిచ్చామన్నారు. దీనిపై ఇంకా పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా...

రెంటచింతలలో 3వ రోజు కొనసాగిన సిట్ దర్యాప్తు

రెంటచింతల: ఎన్నికల రోజు హింసపై విచారణ కోసం ఏర్పాటుచేసిన సిట్ బృందం మూడో రోజు శనివారం కూడా రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు కొనసాగించింది. మండలంలోని పాలువాయిగేటు, తుమ్మకోట, జెట్టిపాలెం గ్రామాల్లో ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఈవీఎంలు ధ్వంసం చేసిన ఘటనలకు సంబంధించిన సీసీ పుటేజీలను సిట్ ఇన్‌చార్జి, ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి నేతృత్వంలో ఇద్దరు అధికారులు పరిశీలించి నిందితులను గుర్తించేపనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌లలోకి దౌర్జన్యంగా వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేసిన వారిని సీసీ పుటేజ్ ఆధారంగా, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, మరికొందరు స్థానికుల సహకారంతో గుర్తిస్తున్నామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. సీసీ పుటేజ్ ఆధారంగా గుర్తించిన వారిని అదుపులోకి తీసుకుంటున్నట్లు ఎస్ఐ అంజనేయులు వెల్లడించారు.

అంపైర్లు, స్కోరర్ల వేతనాల పెంపు

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం



విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ మ్యాచ్ నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తూ, అంకితభావంతో విధులు నిర్వహించే అంపైర్, స్కోరర్లతోపాటు ఇతర మ్యాచ్ అఫిషియల్స్‌కు వేతనాలు పెంచుతూ ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మీడియాకు వెల్లడించారు. జిల్లా, జోన్ స్థాయి అంపైర్లకు రోజుకు రూ.1,500 నుంచి 2,500, స్కోరర్లకు రూ.800 నుంచి 1500లకు వేతనం పెంచినట్లు తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజ్ అంపైర్లకు రూ.2 వేల నుంచి 3 వేలు, స్కోరర్లకు రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకు డైలీ అలవెన్స్ కూడా పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పెంచిన వేతనాలు ఈ రోజు (శనివారం) నుంచే అమల్లోకి వస్తాయన్నారు. వేతనాల పెంపు వల్ల మ్యాచ్ అధికారులకు ఆర్థిక వెసులుబాటు కలుగడంతో పాటు మెరుగైన క్రీడా ఈవెంట్ల నిర్వహణకు దోహద పడుతుందని తెలిపారు. కాగా, నాలుగేళ్ల తర్వాత వేతనాలు పెంచుతూ ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

తొలకరి 'వజ్రాల' చినుకులు

- హంప, మదనంతపురం రైతులకు దొరికిన వజ్రాలు
- రూ.20 లక్షలకు కొనుగోలు చేసిన వ్యాపారులు!

మద్దికెర: తొలకరి చినుకులు పడగానే కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి మండలాల్లో వజ్రాల వేట మొదలవుతోంది. దూర ప్రాంతాల నుంచి జనం వచ్చి ఇక్కడ వజ్రాలు వెతుకుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. రైతులు తమ పొలాలు సాగు చేసేటప్పుడు కూడా వజ్రాలు లభ్యమవుతుంటాయి. శనివారం మద్దికెర మండలం హంప గ్రామంలో ఓ రైతు పొలం పనులు చేస్తుండగా రూ.5లక్షలు విలువైన వజ్రం దొరికింది. అలాగే మదనంతపురం గ్రామానికి చెందిన మరో రైతుకు రూ.15 లక్షలు విలువైన వజ్రం లభించింది. ఈ రెండు వజ్రాలను పెరవలి గ్రామానికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేసినట్లు సమాచారం.

డీవైఈవో పరీక్ష ప్రశాంతం

82.02 శాతం మంది పరీక్షకు హాజరు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో) పోస్టుల భర్తీకి శనివారం ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి 13 జిల్లాల్లో 128 ఆన్‌లైన్ సెంటర్లలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పోస్టులకు మొత్తం 28,451మంది దరఖాస్తు చేసుకున్నారు. 21,991మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, 18,037 మంది (82.02 శాతం) ఆన్‌లైన్ పరీక్షకు హాజరైనట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు.

సీట్ల ఖరారులో షర్మిల ఇష్టారాజ్యం

మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపణ



వెంకటగిరి రూరల్ (తిరుపతి జిల్లా): సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎంపికలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. ఆయన వెంకటగిరిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల అభ్యర్థుల ఎంపికలో షర్మిల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను సంప్రదించకుండా సొంత నిర్ణయాలు తీసుకున్నారని ఆయన విమర్శించారు. ఆమె తీసుకున్న అనుచిత నిర్ణయాలు సముచితం కాదన్నారు.

నిజంగా ఆశ్చర్యపోయా..

హైదరాబాద్‌లో ఉన్న నాకు ఫోన్‌చేసి కరువు సాయం ఇచ్చారు • ఆర్బీకే సిబ్బంది అద్భుతంగా పనిచేస్తున్నారు

- సచివాలయాల పనితీరు బ్రహ్మాండంగా ఉంది
- సిఫార్సుల్లేవు, అవినీతికి ఆస్కారమే లేదు
- ఈ శతాబ్దంలోనే ఇదొక విప్లవాత్మక మార్పు
- ప్రజలకు కావాల్సింది ఇలాంటి వ్యవస్థే
- 'సాక్షి'తో నాబార్డు రిటైర్డ్ జీఎం పి.సాంబశివారెడ్డి



సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ, ఆర్బీకే వ్యవస్థలు.. అవి అందిస్తున్న సేవల కోసం పత్రికల్లో చదవడమే తప్ప ఎప్పుడూ చూడలేదు. కానీ, ఇవి అందిస్తున్న సేవలు నిజంగా నాకు ఆశ్చర్యం కలిగించాయి. ఈ శతాబ్దంలోనే ఓ గొప్ప విప్లవాత్మక మార్పు అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు..' అని నాబార్డు రిటైర్డ్ జనరల్ మేనేజర్ పి.సాంబశివారెడ్డి ప్రశంసించారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా, పైసా భారం పడకుండా ఏపీ సచివాలయ వ్యవస్థ ద్వారా తాను పొందిన లబ్ధిని ఆయన స్వయంగా 'సాక్షి'కి వివరించారు. ఆయన ఏమన్నారంటే..

ఈ మార్పు చూసి ఆశ్చర్యపోయా..

మాది ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా సింగనమల మండలం తూర్పు నరసాపురం. స్వగ్రామంలో మాకు వ్యవసాయ భూమి ఉంది. గ్రామంలోనే ఉంటున్న మా సోదరులు నా భూమిని సాగుచేస్తున్నారు. నేను బ్యాంకింగ్ రంగంలో దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించాను. నాబార్డులో వివిధ హోదాల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో పనిచేసి జనరల్ మేనేజర్‌గా 2013లో రాష్ట్ర విభజనకు ముందు రిటైరయ్యాను. కుటుంబంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. మా స్వగ్రామానికి వెళ్లి దాదాపు దశాబ్దం దాటిపోయింది. గ్రామంలో విశేషాలే కాదు.. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలు కూడా మా సోదరులు, బంధువుల ద్వారా తెలుసుకుంటుంటాను. గ్రామ సచివాలయాల ఏర్పాటు తర్వాత నేను మా గ్రామానికి వెళ్లలేదు. అయితే, గ్రామ సచివాలయ వ్యవస్థ గురించి వార్తా పత్రికలతోపాటు మా సోదరుల ద్వారా తెలుసుకున్నాను. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఎలాంటి సిఫార్సులు లేకుండా అన్ని పనులు గ్రామంలోనే అయిపోతున్నాయని చెబుతుంటే ఆశ్చర్యమేసింది. ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు. పంట ఉత్పత్తులను కూడా గ్రామంలోనే కొంటున్నారని మా బంధువులు చెప్పగా విన్నాను. పత్రికల్లో కూడా అప్పుడప్పుడూ చూస్తున్నాను. ఇది నిజమేనా.. ఇంత మార్పు వచ్చిందా.. అని అనుకున్నాను. కానీ, స్వతహాగా నాకు ఎదురైన అనుభవంతో ఆశ్చర్యపోయాను.

సిఫార్సుల్లేకుండా పరిహారం..

గత శనివారం నా ఖాతాలో రూ.34వేలు జమైంది. ఆశ్చర్యపోయాను.. ఎక్కడో ఉన్న నా వివరాలు తెలుసుకుని నాకు ఫోన్ చేశారు. ఎంతో గౌరవంగా మాట్లాడారు. ఎలాంటి సిఫార్సులు లేవు.. ఎవరికీ రూపాయి ఇవ్వలేదు. నేరుగా నా ఖాతాలో కరువు సాయం జమైంది. ఏపీలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలు చూస్తుంటే నిజంగా గొప్ప విప్లవాత్మక మార్పుగా అభివర్ణించొచ్చు. గతంలో విపత్తులు సంభవించిన సందర్భాల్లో పరిహారం కోసం రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి వచ్చేది. అడిగినంత దక్షిణ సమర్పిస్తే కానీ పరిహారం చేతికి వచ్చే పరిస్థితులు ఉండేవి కావు. కానీ, నేడు అవినీతికి తావులేకుండా సచివాలయ సిబ్బంది ఎంతో పారదర్శకంగా అందిస్తున్న సేవలు నిజంగా ప్రశంసనీయం. రైతులకు సంబంధించిన సేవలే కాదు.. పౌరసేవలు కూడా ఎలాంటి సిఫార్సులు లేకుండా ఈ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామ పొలిమేర దాటకుండానే సామాన్య పౌరులు పొందగలుగుతున్నారని తెలిసి నిజంగా సంతోషమేసింది. ఇలాంటి వ్యవస్థ కదా ప్రజలకు కావాల్సింది. ఈ వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వానికి నా అభినందనలు.

నమ్మశక్యం కాని రీతిలో..

పోలింగ్ ముగిసిన తర్వాత ఒకరోజు తూర్పు నరసాపురం గ్రామ సచివాలయం నుంచి ఆర్బీకే సిబ్బంది (రాజారెడ్డి) ఫోన్‌చేశారు. మన సింగనమల మండలాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించింది. భూ యజమానికి కరువు సాయం జమవుతుంది. మీ ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు చెప్పండని అడిగారు. ముందు నమ్మలేదు.. మీకు నా ఫోన్ నంబరు, వివరాలు ఎవరిచ్చారు అని ఆరాతీస్తే.. గ్రామంలో మీ సోదరులిచ్చారని బదులిచ్చారు. ఆ తర్వాత వారితో క్రాస్ చెక్‌చేసుకున్న తర్వాత నమ్మకం ఏర్పడింది. అయినా ఆదాయపు పన్ను చెల్లించే నాకెందుకు కరువు సాయం వస్తుందని అడిగాను. లేదు సర్.. కరువు సాయం పంపిణీకి పన్ను చెల్లింపునకు సంబంధంలేదని బదులిచ్చారు. అయినా నమ్మకం కలగలేదు. లేదు సర్ మీ పేరిట ఉన్న 7.5 ఎకరాల వ్యవసాయ భూమిలో వేరుశనగ వేశారు. కరువు ప్రభావంతో పంట దెబ్బతిన్నది. ఇదే విషయాన్ని మేం రిపోర్టు చేశాం.. అందుకే కరువు సాయం మంజూరైందని వివరించారు. ఆ తర్వాత సిబ్బంది అడిగిన ఇతర వివరాలు చెప్పాను.

ఓట్ల లెక్కింపు ఇలా

జూన్ 4న ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభం

- తొలుత పోస్టల్, సర్వీసు ఓట్ల లెక్కింపు
- ఆ తర్వాత ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు
- సువిధ యాప్‌లో నమోదు చేసిన తర్వాతే ఫలితాల వెల్లడి



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతోంది. జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను కల్పించనున్నారు. మే 13న పోలింగ్ అనంతరం పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే 25 కంపెనీల బలగాలను రాష్ట్రానికి పంపింది. మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 25 వేల మందికిపైగా ఉద్యోగులు పాల్గొననున్నారు. వీరందరికీ రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ర్యాండమైజేషన్ ద్వారా ఉద్యోగులను నియోజకవర్గాలకు కేటాయిస్తారు. మొత్తం ఈ ఓట్ల ప్రక్రియను నిశితంగా పరిశీలించడానికి 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒక్కొక్కరు చొప్పున మొత్తం 200 మంది కేంద్ర పరిశీలకులతోపాటు 200 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు.

ఈవీఎంల తరలింపు

మే 13న పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు మొదలయ్యే అరగంట ముందు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. ముందుగా ఆర్వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలైన అరగంట తర్వాత కూడా ఆ ప్రక్రియ కొనసాగుతుంటే అప్పుడు ఇక ఈవీఎంల లెక్కింపును మొదలుపెట్టడం మొదలు పెడతారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరగడంతో ఈవీఎంలు తారుమారు కాకుండా ఉండటం కోసం స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి తీసుకువచ్చే సిబ్బందికి వేర్వేరు రంగుల్లో యూనిఫామ్ కేటాయించి ఈవీఎంలను తరలిస్తారు. వీరు ఈవీఎంల సీరియల్ నంబర్ ప్రకారం ఒకదాని తర్వాత ఒకటి కౌంటింగ్ టేబుళ్లపైకి చేరుస్తారు. కౌటింగ్ సమయంలో కేవలం ఈవీఎం కంట్రోల్ యూనిట్ మాత్రమే తీసుకువస్తారు. ఓటు వేసిన ఈవీఎం మెషీన్‌తో అవసరం లేదు. కౌంటింగ్ హాల్‌లో టేబుళ్లు ఎన్ని ఉంటే అన్ని ఈవీఎంలను మాత్రమే తీసుకురావాలి. ఒక రౌండ్ పూర్తయిన తర్వాతే మరుసటి రౌండ్‌కు సంబంధించిన కంట్రోల్ యూనిట్‌ను తీసుకురావాల్సి ఉంటుంది. పోలైన ఓట్ల ఆధారంగా ఎన్ని రౌండ్లు కౌంటింగ్ అన్నది లెక్కించి.. దాని ప్రకారం టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ఈవీఎంలో నమోదైన ఓట్లు, వీవీ ప్యాట్‌లో నమోదైన ఓట్లు సరిగా ఉన్నాయా.. లేదా.. అన్నదాన్ని పరిశీలించడం కోసం ర్యాండమ్‌గా మూడు వీవీప్యాట్లు ఎంపిక చేసి మూడింటిని లెక్కిస్తారు. ఇది కూడా ఈవీఎంల లెక్కింపు పూర్తయిన తర్వాత మాత్రమే చేస్తారు. పోలింగ్ ముగిసిన తర్వాత క్లోజ్ బటన్ నొక్కకుండా ఉన్న (క్లోజ్ రిజల్ట్ క్లియర్–సీఆర్‌సీ) ఓటింగ్ యంత్రాలతో పాటు మాక్ పోలింగ్ ఓట్లను తీసివేయకుండా అలాగే ఉంచిన ఓటింగ్ యంత్రాలను పక్కకు పెట్టి వాటిని చివర్లో మాత్రమే లెక్కిస్తారు. అది కూడా పోటీ హోరాహోరీగా ఉంటేనే. మెజార్టీ భారీగా ఉంటే ఇలా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఓటింగ్ యంత్రాలను లెక్కించకుండా పక్కకు పెట్టేస్తారు. ప్రతీ రౌండ్ ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన సువిధ యాప్‌లో నమోదు చేసిన తర్వాతనే ఆర్వో ఫలితాలను ప్రకటించాల్సి ఉంటుంది.

ఆరోగ్యశ్రీ సేవలు ఆగలేదు

- టీడీపీ, బీజేపీ తప్పుడు ప్రచారంపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫైర్
- ఆరోగ్యశ్రీ సేవలపై పచ్చ నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాల్



సాక్షి, అమరావతి/అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో ఎక్కడా ఆరోగ్యశ్రీ సేవలు ఆగలేదని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కానీ టీడీపీ, బీజేపీ నాయకులు పనిగట్టుకుని ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోయాయని విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధైర్యం ఉంటే ఆరోగ్యశ్రీ సేవలపై పచ్చ నేతలు బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈ మేరకు మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. 'రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఎక్కడా అంతరాయం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయినా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయంటూ కొన్ని పత్రికలు అబద్ధాలు వండివారుస్తూ పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పేదల సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిన టీడీపీకి ఈ పథకం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. టీడీపీ హయాంలో కేవలం తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తించేది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలతోపాటు రూ.5లక్షలలోపు ఆదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు కూడా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో 1.42కోట్లకు పైగా కుటుంబాలకు ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వర్తిస్తోంది. దీనిని తెలుగుదేశం నేతలు కాదనగలరా?.. టీడీపీ హయాంలో కేవలం 1,059 మాత్రమే ఉన్న ప్రొసీజర్లను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం 3,257కి పెంచింది. ఉచిత వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం జగన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ పాలనలో కేవలం 919 ఆస్పత్రులకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీ సేవలను మా ప్రభుత్వం 2,371 ఆస్పత్రులకు విస్తరించింది. ఇతర రాష్ట్రాల్లోని నెట్‌వర్క్ ఆస్పత్రులను 72 నుంచి 204కి పెంచింది. టీడీపీ పాలనలో ఆరోగ్యశ్రీ నిధులన్నీ చంద్రబాబు దుర్వినియోగం చేయగా, నేడు గ్రీన్ చానల్ ద్వారా పారదర్శకంగా చెల్లింపులు జరుగుతున్నాయి. ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ ద్వారా 42.91లక్షల మందికి రూ.13,471కోట్ల విలువైన వైద్యసేవలు అందించాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.3,566కోట్లు చెల్లించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో తొలి రెండు నెలల్లో రూ.366కోట్లు చెల్లించగా, తాజాగా మరో రూ.200కోట్ల బకాయిలు విడుదల చేసింది. అదేవిధంగా ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించేలా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం అమలుచేసింది. ప్రభుత్వ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రూ.16,852కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసింది. గత ఐదేళ్లలో వైద్య శాఖలో సుమారు 54వేల పోస్టులను భర్తీ చేసింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయి. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఆరోగ్య సూచీల్లో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉంది. ప్రజలకు డిజిటల్ వైద్యసేవలు, పౌరులకు టెలీ మెడిసిన్ సేవల కల్పనలోనూ ఏపీ తొలి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడి ఆరోగ్య అవసరాలు తీర్చడమే లక్ష్యంగా సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోంది.' అని విష్ణు పేర్కొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లే కీలకం

- ఫారం–18 సమర్పించడం ద్వారా ఏజెంట్ల నియామకం
- ఓట్ల లెక్కింపులో ఫారం–17సీ ఎంతో ముఖ్యం
- నిబంధనలు తెలియకుంటే అయోమయమే



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఎన్నికల నిబంధనలు–1961 ప్రకారం అభ్యర్థి లేదా ఎలక్షన్ ఏజెంట్ ఆమోదంతో కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తారు. కౌంటింగ్ సమయంలో అభ్యర్థి తరఫున ప్రతినిధిగా వ్యవహరించే కౌంటింగ్ ఏజెంట్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు సాయంత్రం 5గంటల్లోపు కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన ఫారం–18ను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఆర్వోలు కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డులు తయారు చేసి పంపుతారు. కౌంటింగ్‌కు గంట ముందు అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీ కార్డ్ ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది. ఫారం–19 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ అపాయింట్‌మెంట్‌ను రద్దు చేసే అధికారం అభ్యర్థి లేదా ఎలక్షన్ ఏజెంట్‌కు ఉంటుంది.

ఏజెంట్లకు అవగాహన అవసరం

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఫారం–17సీ పార్ట్–2 ఎంతో కీలకమైంది. ప్రతి కౌంటింగ్ ఏజెంట్, పరిశీలకులు, సహాయ పరిశీలకులు దీనిపై అవగాహన కలిగి ఉండాలి. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం–17సీలో పొందుపరిచిన మొత్తం ఓట్లు సరిపోల్చి చూడాలి. పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గం నంబర్, పోలింగ్ కేంద్రం పేరు, ఆ పోలింగ్ కేంద్రంలో వినియోగించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు నంబర్లను ఆ ఫారంలోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రంలోకి వచ్చాక ఓటు వేయడానికి నిరాకరించి వెళ్లిపోయిన వారు, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య ఫారం–17సీలో ఉంటాయి. టెండర్ బ్యాలెట్లు, సరఫరా చేసిన పేపర్ సీళ్ల (ఓటరుకు పోలింగ్ కేంద్రంలో ఇచ్చే రెండు రంగుల స్లిప్‌లు), సీరియల్ నంబర్లు, ఎన్ని పేపర్లు వినియోగించారు, వినియోగించని పేపర్ సీళ్లు ఎన్ని తిరిగి రిటర్నింగ్ అధికారికి వెళ్లాయి, పాడైపోయిన పేపర్ సీళ్లు, సీరియల్ నంబర్ల వంటి వివరాలు ఇందులో ఉంటాయి.

ట్యాంపరింగ్ జరిగితే..

కంట్రోల్ యూనిట్ టేబుల్‌పైకి రాగానే అభ్యర్థి సీలింగ్ సెక్షన్ సక్రమంగా ఉందో లేదో కౌంటింగ్ ఏజెంట్లు, పరిశీలకులు చూసుకోవాలి. రిజల్ట్ సెక్షన్‌పై స్ట్రిప్ సీల్, గ్రీన్ పేపర్ సీల్ సక్రమంగా ఉన్నాయో లేదో చూడాలి. సీరియల్ నంబర్లు ఫారం–17సీలో నమోదు చేసినవే ఉండాలి. కంట్రోల్ యూనిట్ పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌ల ట్యాంపరింగ్ జరిగాయని గుర్తిస్తే పరిశీలకులు ఆ విషయాన్ని రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్ల దృష్టికి తీసుకెళ్లాలి. ట్యాంపరింగ్ జరగని కంట్రోల్ యూనిట్లను మాత్రమే లెక్కించాలి.

మార్గదర్శకాలు ఇవీ..

అభ్యర్థులు 18 సంవత్సరాలు నిండిన వారిని ఏజెంట్లుగా నియమించుకుంటే వారు కౌంటింగ్ సక్రమంగా వీక్షించేందుకు వీలుంటుంది. సాయుధ రక్షణ కలిగిన వ్యక్తులను కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించరాదని ఈసీఐ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మునిసిపల్, జెడ్పీ చైర్మన్లు, పబ్లిక్‌రంగ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఏజెంట్లుగా కూర్చునేందుకు అనర్హులు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందేవారు, ప్రభుత్వ–ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే పార్ట్ టైమ్ ఉద్యోగులు, పారామెడికల్ స్టాఫ్, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా ఉండకూడదు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఏజెంట్లుగా వ్యవహరిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951 సెక్షన్ 134 (ఏ) ప్రకారం శిక్షార్హులవుతారు. వీరికి మూడు నెలల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది. సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చునేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. భారత పౌరసత్వం కలిగిన ఎన్నారైలు కూడా కూర్చోవచ్చు. ప్రభుత్వ గన్‌మెన్ సౌకర్యం ఉన్నవారు ఎన్నికల ఏజెంట్‌గా, కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండకూడదు. అలాంటి వ్యక్తి సెక్యూరిటీతో గాని, సెక్యూరిటీ లేకుండా గానీ కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించకూడదు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తనకున్న సాయుధ రక్షణను స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాల్‌లో కూర్చునేందుకు అనుమతిస్తారు. ఒక కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు, ఒక ఆర్వో టేబుల్ కలిపి మొత్తం 15 టేబుళ్లు ఉంటాయి. ఆ మేరకు అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీ పీబీఎస్) లెక్కింపునకు అదనపు టేబుళ్లు అవసరం అని భావిస్తే అందుకోసం వేరే కౌంటింగ్ హాల్‌లో అదనపు టేబుళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులు అక్కడ అదనంగా మరో కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

పోలీసుల తీరు ఏకపక్షం

- టీడీపీ అభ్యర్థి అరవింద్‌బాబు దౌర్జన్యాలకు పాల్పడినా ఆయనపై కేసులు నమోదు చేయలేదు
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై మాత్రం తప్పుడు కేసులు పెట్టారు
- డీజీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీమంత్రి రావెల



డీజీపీకి ఫిర్యాదు అందజేస్తున్న మర్రి రాజశేఖర్, రావెల కిశోర్‌బాబు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని.. ముఖ్యంగా పల్నాడులో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆవేదన వ్యక్తంచేశారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను శనివారం కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు నరసరావుపేటలో పోలీసుల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ నరసరావుపేటలో పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అక్కడ భయానక పరిస్థితులు ఉన్నాయన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదన్నారు. ఓటు వేసినవారు భయంతో వణికిపోతున్నారని చెప్పారు. కట్టా నారపరెడ్డి అనే వృద్ధ న్యాయవాది ఓటు వేసి ఇంటికి వచ్చే సమయంలో దారిలో ఎవరో ఎదురుపడి పలకరిస్తే అక్కడ ఆగినందుకు ఆయన పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారని తెలిపారు. టీడీపీ అభ్యర్థి అరవింద్‌బాబు ఇంటివద్ద పెట్రోల్ బాంబులు, రాళ్లు, మారణాయుధాలను పోలీసులు సీజ్ చేశారని.. కానీ అతనిపై కేసు పెట్టలేదని పేర్కొన్నారు. కానీ.. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై మాత్రం తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. జూన్ 4 జరిగే కౌంటింగ్‌లో ఏజెంట్లుగా ఉండాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పదుల కేసులు పెడుతున్నారని వాపోయారు. కేసు పెట్టిన తరువాత పోలీసులు రాత్రివేళ వారి ఇళ్లకు వెళ్లి మహిళలను బెదిరిస్తున్నారన్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు ఇళ్లల్లో ఉండేందుకు జంకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందన్న నమ్మకం తమకు లేదన్నారు. డీజీపీ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడులు ఎక్కువయ్యాయి

మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై రాజకీయ దాడులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ, బీసీ ఓటర్లను పోలీసులు వెంటాడి వేధిస్తున్నారని, టీడీపీ అభ్యర్థి అరవింద్‌బాబు అరాచకాలకు అడ్డూ, అదుపు లేకుండాపోయిందని చెప్పారు. ఇప్పటి ఎన్నికల్లో జరుగుతున్న దాడులు, అల్లర్లను తాను ఏనాడూ చూడలేదన్నారు. డీజీపీ స్పందించి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 4వ తేదీ వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ సంయమనం పాటించాలని ఆయన కోరారు. డీజీపీని కలిసినవారిలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

గిన్నిస్ రికార్డులోకి చర్మ వైద్యుల ప్రతిజ్ఞ

గుంటూరు మెడికల్: చర్మ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 24 గంటల్లో అత్యధికంగా ప్రతిజ్ఞలు చేసి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏడీవీఎల్) వైద్యులు వరల్డ్ గిన్నిస్ రికార్డును సృష్టించారు. దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన చర్మ వ్యాధి వైద్య నిపుణులు మే 5, 6 తేదీల్లో 9,405 వాగ్దానాలు చేశారు. ఈ విషయాన్ని మే 18న అసోసియేషన్ హెడ్‌క్వార్టర్స్ న్యూఢిల్లీలోని కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షేనాయ్, సెక్రటరీ డాక్టర్ భూమేష్‌కుమార్ గిన్నిస్ బుక్ ప్రతినిధులకు తెలియజేశారు. చర్మ వ్యాధుల్లో ప్రజలకు అవగాహన కల్పించి, చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారి జీవితాల్లో పాజిటివ్ దృక్పథం పెంపొందించేందుకు, ఆధునిక చికిత్సలను ప్రజలకు చేరువ చేసేందుకు చేసిన ప్రతిజ్ఞకు గిన్నిస్ రికార్డు లభించడం ఆనందంగా ఉందని సంఘం ఏపీ అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, కార్యదర్శి డాక్టర్ జె.సౌజన్య తెలిపారు. ప్రతిజ్ఞ సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు.



గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రాన్ని చూపిస్తున్న డాక్టర్ కవిత, డాక్టర్ సౌజన్య

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943